# ద్వాదశ జ్యోతిర్లింగ చరిత్ర

## యాత్రా దర్శిని - శక్తి పీఠములు



# విషయసూచిక





ఓం గణేశాయ నమః ఓం గురుభ్యో నమః మహర్షిభ్యో నమః



# ద్వాదశ జ్యోతిర్లింగములు

## ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రమ్

శ్లో॥ సౌరాష్ట్రే సోమనాథంచ శ్రీశైలే మల్లికార్జునమ్ ।
ఉజ్జయిన్యాం మహాకాలం ఓంకారే పరమేశ్వరమ్ ॥ 1
(ఓంకార మమలేశ్వరమ్ - పాఠాంతరం)

శ్లో॥ ప్రజ్వల్యాం వైద్యనాథం చ ఢాకిన్యాం భీమశంకరమ్ ।
సేతుబంధేతు రామేశం నాగేశం దారుకావనే ॥ 2

శ్లో॥ వారణాస్యాంతు విశ్వేశం త్ర్యంబకం గౌతమీతటే ।
హిమాలయేతు కేదారం ఘృశ్నేశం చ శివాలయే ॥ 3
(చ విశాలకే - పాంఠాంతరం)

శ్లో॥ ఏతాని జ్యోతిర్లింగాని సాయంప్రాతః పఠేన్నరః ।
సప్త జన్మకృతం పాపం స్మరణేన వినశ్యతి ॥ 4

శ్లో॥ ద్వాదశైతాని నామాని ప్రాతరుత్థాయ యః పఠేత్ ।
సర్వపాప వినిర్ముక్తః సర్వసిద్ధి ఫలం లభేత్ ॥ (పాఠాంతరం)
సర్వపాపహరంచైవ సర్వబాధా నివారణమ్ ॥ (పాఠాంతరం)

**భావము:** 1. సౌరాష్ట్రమున (గుజరాత్‌లో) సోమనాథలింగము, 2. శ్రీశైలమున మల్లికార్జునుడు, 3. ఉజ్జయిని యందు మహాకాలుడు, 4. అమరేశ్వరమున ఓంకార లింగము, 5. ప్రజ్వల్యా దేశమున వైద్యనాథ లింగము, 6. ఢాకినీ ప్రాంతమున భీమశంకరుడు, 7. సేతుబంధము (రామేశ్వరము)న రామేశలింగము, 8. దారుకావనమునందు నాగేశ్వరలింగము, 9. వారణాసి (కాశీ) యందు విశ్వేశ్వరుడు, 10. గౌతమీతట (నాసిక్) ప్రాంతమున త్ర్యంబకేశ్వరుడు, 11. హిమాలయము లందు కేదారేశ్వరుడు, 12. విశాలక దేశము (దేవగిరి ప్రాంతము)న ఘృశ్నేశ్వరుడు అను పేర్లతో ద్వాదశ జ్యోతిర్లింగములుగా వెలసినవి. పై జ్యోతిర్లింగముల నామములను ప్రాతః - సాయంకాలములందు నిత్యము తలచినచో సప్త(ఏడు) జన్మలలో చేసిన పాపములును నశించును. (సకల సుఖములను పొందుదురు)

# 1. సోమనాథ జ్యోతిర్లింగము

## (ప్రభాసపట్నం, గుజరాత్)




శ్లో॥ సౌరాష్ట్రదేశే విశదేతి రమ్యే
జ్యోతిర్మయం చంద్ర కళావతంసం ।
భక్తి ప్రదానాయ కృపావతీర్ణం
తం సోమనాథం శరణం ప్రపద్యే ॥

**భావము:** స్వచ్ఛమైన, అతి రమ్యమైన (అందమైన) సౌరాష్ట్ర (ప్రస్తుత గుజరాత్) దేశంలో (రాష్ట్రంలో)ని జీవులందు భక్తిని కలిగించుటకై దయతో అవతరించిన జ్ఞాన జ్యోతితో ప్రకాశించుచు చంద్రకళల వంటి అందమైన రూపముగల సోమనాథుని శరణు పొందుతున్నాను.

సోమనాథుడు = చంద్రుడు, ఈశ్వరుడు అని అర్థాలు; స+ఉమ=సోమ - ఉమతో కూడిన; నాథుడు = ప్రభువు = ఈశ్వరుడు; సోమము = ఒక చెట్టురసము - అమృత సమానమైన ఓషధీ తత్త్వము గలది. అట్టి సోమలతలో అమృతత్త్వమును కల్గించువాడు కావున చంద్రునకు సోముడని పేరు - ఆ సోముని (చంద్రునిచే) ప్రతిష్ఠింపబడినవాడగుట చేత, చంద్రుని కోరికలను తీర్చినవాడగుటచేత అక్కడి ఈశ్వరుడు సోమనాథుడని పిలువబడుచున్నాడు.

**పురాణగాథ:**

బ్రహ్మమానస పుత్రులలో 'దక్షుడు' అనువానికి ప్రజాపతి పదవి ఈయబడింది. అతనికి గల నూరుమంది కుమార్తెలలో మొదటి కుమార్తె 'సతీదేవి' ఈశ్వరుని భార్య అయింది. అశ్వని మొదలు రేవతి వరకు గల ఇరవైయేడు మంది కుమార్తెలు చంద్రుని పెండ్లాడారు. వారిలో రోహిణి మంచిఅందగత్తె అగుటచేత మిగిలిన భార్యల కంటె రోహిణిపైయెక్కువ యిష్టమును చూపేవాడు చంద్రుడు. తమ కంటె యెక్కువగా భర్త అనురాగమును పొందిన రోహిణిని చూచివారు అసూయపడ్డారు-ఆ 26 మంది తండ్రియైన దక్షుని వద్దకు వచ్చి చంద్రుడు తమను సరిగా చూడలేదని చెప్పారు.

దక్షుడు చంద్రునికి భార్యలనందరను ఒకేవిధంగా చూడాలనీ, ఒకరిపైయెక్కువ అనురాగము, ఇతరులపై అలసత భావము చూపించకూడదనీ, తన కుమార్తెల నందరను సమానముగా చూచుకొనమని హితము చెప్పాడు. అయినా చంద్రునిలో మార్పు రాలేదు. రోహిణి కాక మిగిలిన 26 మంది మళ్ళీ తండ్రి వద్దకు పోయి



దుఃఖిస్తూ చంద్రునిలో మార్పు రాలేదని ఫిర్యాదు చేశారు. అందుచేత దక్షుడు చంద్రునిపై కోపించి "ఏ సౌందర్యము నిన్ను దురహంకారిని చేసిందో, ఏ కళల్ని చూసి నీవు కళ్ళు గానక ప్రవర్తిస్తున్నావో అవి నీలో క్షీణించి క్షయరోగముతో చీకటి మచ్చలాగా మిగిలిపోవుదువుగాక" అని శపించాడు.

ప్రజాపతి శాపము ఊరకే పోతుందా! చంద్రుడు క్షయగ్రస్తుడయ్యాడు. అందుచే చంద్రుని సర్వకార్యాలూ స్తంభించిపోయాయి. ఓషధులు, లతలు, చెట్లు నిస్తేజము లయ్యాయి. దేవతలకు సోమము (అమృతం) అందటంలేదు - యజ్ఞయాగాది క్రతువులు నిలచిపోయాయి - అంతటా దుర్భిక్షం యేర్పడింది.

చంద్రుడు వ్యాధితో దుఃఖితుడైనాడు - చంద్రుడు ఇంద్రాది దేవతలతోను, వశిష్ఠాది మహర్షులతోను బ్రహ్మలోకమునకు వెళ్ళి బ్రహ్మదేవునితో తన దుఃఖాన్ని చెప్పుకొని తరుణోపాయమును చెప్పమని ప్రార్థించాడు. వారందరి ప్రార్థనలను వినిన బ్రహ్మదేవుడు "ప్రభాస తీర్థమను పుణ్యక్షేత్రమున (గుజరాత్‌లోని కథైవార్ దగ్గర) శ్రీ మహా మృత్యుంజయ మంత్రముతో దీక్షగా శివుని అర్చిస్తే శివుని దయవలన శాప విమోచనం కలుగుతుంద"ని చంద్రునికి చెప్పాడు.

బ్రహ్మదేవుని మాటలననుసరించి చంద్రుడు ప్రభాసక్షేత్రమును చేరుకొని అక్కడ పార్థివ శివలింగమును ప్రతిష్టించి, దీక్షగా నలుబది రోజులు మహా మృత్యుంజయ మంత్రాన్ని జపించాడు. ఆ మంత్రం -

"ఓం త్ర్యంబకం యజామహే సుగన్ధిం పుష్టివర్ధనమ్ ।
ఉర్వారుకమివ బంధనాన్మృత్యోర్ముక్షీయ మామృతాత్ ॥"

చంద్రుని దీక్షకు సంతోషించిన పరమేశ్వరుడు ప్రత్యక్షమై "చంద్రా! ప్రజాపతి వాక్యములు అసత్యములు కారాదు. అయినను నీ దీక్షకు మెచ్చి లోకకళ్యాణార్థము ఆ శాపమునకు కొంత నివారణమును వరముగా అనుగ్రహిస్తున్నాను. నీకు క్షయ రోగముండదు-నీకు అమరత్వము కలుగుతుంది. అయితే కృష్ణపక్షములో ప్రతిరోజూ ఒక్కొక్క కళ చొప్పున పెరుగుతూ వుంటుంది. ఈ వృద్ధి క్షయములు సృష్టియున్నంత కాలము కొనసాగుతాయి." అని వరము యిచ్చాడు.

చంద్రుడు, దేవతలు, మునుల ప్రార్థనలననుసరించి శివుడు ప్రభాస క్షేత్రమున చంద్రుని పేరుతో సోమనాథ లింగముగా వెలిశాడు. దేవతలు, మహర్షులచే పుణ్యోదకములతో నింపబడిన కుండము (చెరువు) చంద్ర కుండమని పేరొందింది - ఈ ప్రభాస క్షేత్రమే నేడు సోమనాథ్‌గా పిలువబడుతోంది. (ఇది గుజరాత్ వాయువ్య తీరంలో అరేబియా సముద్రపు ఒడ్డున ఉన్నది.) ఈ సోమనాథ జ్యోతిర్లింగ దర్శనము వలన, పూజల వలన సర్వపాతకములు, దుష్కర్మలు నశించి, సర్వమనోభీష్ట సిద్ధి కలిగి అంత్యమున కైవల్యమును పొందుతారు. చంద్ర కుండమున నిత్యము స్నానము చేయు వారికి అసాధ్యములైన రోగములును నశించి ఆరోగ్యము కలుగుతుందని హిందువుల నమ్మకము.

**చారిత్రకాంశములు:**

మొదటి దేవాలయం క్రీస్తు పూర్వము 797-497 సం॥ల మధ్య నిర్మింపబడి యుంటుందని చరిత్రకారుల ఊహ. శ్రీ హర్ష చక్రవర్తి మనుమడైన ధారసేనుని పరిపాలనా కాలంలో క్రీ॥ శ॥ 640-649 మధ్య కాలంలో రెండవసారి జీర్ణోద్ధరణ జరిగినట్లు శిలాశాసనాల వల్ల తెలుస్తోంది. భోజపరమార్ అనే రాజు 30 అంతస్థులతో, గోపురాల మీద 14 సువర్ణకలశాలతో, నవరత్నఖచితమైన సింహద్వారంతో ఆలయాన్ని నిర్మించాడట. ఈ ఆలయం అరేబియా సముద్రంలో ప్రయాణించే నావికులకు అద్భుతంగా దర్శనమిచ్చేదని విదేశీ యాత్రికులు అభివర్ణించారు. క్రీ॥ శ॥ 755లో అరబ్బుల దండయాత్రలో ఆ ప్రాంత పాలకులైన వాలభి రాజులు ఓడిపోవడంతో ఆలయానికి పోషకత్వం కరవైపోయింది. క్రీ॥ శ॥ 800 ప్రాంతంలో 'నాగభట్ట' అనునతడు విదేశీయుల్ని పారద్రోలి మూడవసారి ఎర్ర ఇసుకరాళ్ళతో దేవాలయాన్ని బాగు చేయించి తిరిగి వైభవాన్ని కలిగించాడు.

క్రీ॥ శ॥ 1026 జనవరిలో గజనీ మహమ్మద్ సైన్యము సోమనాథ్‌ను ముట్టడించింది. మందిర పరిరక్షణలో 50 వేల మంది సౌరాష్ట్ర వీరులు మరణించారు. గజనీ మహమ్మద్ కోటను స్వాధీనం చేసుకొని, మందిరంలోని అపార ధనరాశులను దోచుకొని, శివలింగాన్ని ముక్కలుగా చేసి, దేవాలయాన్ని నేలమట్టం చేసి వెళ్ళిపోయాడు. 'ఆల్‌బిరూని' అను అరబ్ యాత్రకుని వర్ణనలను చదివి తీరవలసిందే.

క్రీ॥శ॥ 1045 నాటికి ఆలయం తిరిగి పునరుద్ధరింపబడింది. ఇది నాల్గవసారి. ఈకాలంలో గుజరాత్ ప్రాంతానికి 'గూర్జర'దేశమనే పేరు వచ్చింది. క్రీ॥శ॥ 1144లో రాజైన కుమారపాలుడు 1164లో ఆలయాన్ని విస్తృతపరచి ఆలయరక్షణకు కోట గోడను, దేవాలయానికి బంగారు కలశాలను, విశాలమైన దర్బారు హాలు, ముఖ మంటపము, మంచినీటి కోనేరు, అర్చకులకు ఇండ్లు, సముద్రం వరకు మెట్లు నిర్మింపజేశాడు.

రెండవ భీమదేవుడను రాజు మేఘనాథ మంటపాన్ని నిర్మించాడు. విశాలదేవుని కాలంలో 'సరస్వతీ సదస్సు' పేరుతో కళాశాల ప్రారంభమైనది. 1287లో త్రిపురాంతకుడనే యోగి ఈ ఆలయప్రాంగణంలో ఉమాపతి, ఉమేశ్వర, మల్హణేశ్వర, త్రిపురాంతకేశ్వర, రామేశ్వర ఆలయాలను నిర్మించాడు. 1144-1297 మధ్యకాలంలో సోమనాథ దేవాలయం అత్యంత వైభవ స్థితిని పొందింది.

క్రీ॥ శ॥ 1297లో ఢిల్లీ సుల్తానుల మద్దతుదారు జలాలుద్దీన్ ఖిల్జీ యొక్క సైనికాధికారి అలాఫ్‌ఖాన్ దేవాలయాన్ని నేలమట్టం చేశాడు. 1308-1325 మధ్యలో మహీపాలదేవుడనే రాజు తిరిగి పునర్నిర్మాణం ప్రారంభించగా అతని కుమారుడు 'రా-ఖరగర్' 1325-1351 మధ్య ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసి సోమనాథలింగ ప్రతిష్ఠ చేశాడు. 1394లో గుజరాత్‌కు ఢిల్లీ సుల్తానుల ప్రతినిధియైన ముజఫర్‌ఖాన్ దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. తర్వాత చిన్నదిగా తిరిగి నిర్మింపబడింది. దానిని ముజఫర్‌ఖాన్ మనుమడు అహమ్మద్ షా 1413లో ధ్వంసం చేశాడు. ఇతడే కర్ణావతి నగరాన్ని అహమ్మదాబాద్ అని పేరు మార్చాడు. తర్వాత నిర్మింపబడిన దేవాలయాన్ని మహమ్మద్‌బేగడా అనే రెండవ ముజఫర్‌ఖాన్ 1459లో ధ్వంసం చేశాడు.



అక్బర్ కాలంలో స్థానికుల కృషితో 1560లో ఆలయం పునరుద్ధరింపబడింది. క్రీ॥ శ॥ 1669లో ఔరంగజేబు భారతదేశంలోని ముఖ్య దేవాలయాలన్నింటితోపాటు సోమనాథ దేవాలయాన్ని కూడ ధ్వంసం చేయించి మసీదుగా మార్చాడు. 1708లో ఇండోర్ రాణి అహల్యాబాయి హోల్కర్ నూతనంగా దేవాలయాన్ని నిర్మింపజేసింది. 1812లో దేవాలయ నిర్వహణ బాధ్యత బరోడా రాజు గైక్వాడ్ చేతుల్లోకి వచ్చింది. బ్రిటీష్ పాలనలో లార్డ్ కర్జన్ మసీదుగా ఉన్న దేవాలయం చుట్టూ ప్రహరీ గోడను నిర్మించాడు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సర్దార్ వల్లభాయ్ పటేల్, జవహర్‌లాల్ నెహ్రూ, కె.ఎం. మున్షీల ప్రయత్నాలతో 11-5-1951న జ్యోతిర్లింగ ప్రతిష్ఠ నాటి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా జరిగింది. 13-5-1965న సోమనాథ దేవాలయ శిఖరానికి కలశ ప్రతిష్ఠ, ధ్వజారోహణము జరిగాయి.

భారతదేశంలో ముస్లిముల చేత యెన్నో దేవాలయాలు దోచుకోబడి ధ్వంసం చేయబడ్డాయి. చాలా దేవాలయాలు మసీదులుగా మార్చబడ్డాయి. అన్నిటికంటె యెక్కువసార్లు ధ్వంసం చేయబడినది సోమనాథ దేవాలయమే-సోముని (చంద్రుని) కళలు యెన్నిసార్లు తగ్గుతాయో, అన్నిసార్లు తిరిగి అభివృద్ధి చెందుతాయి అన్నట్లుగా హిందూదేవాలయాలు యెన్నిసార్లు ధ్వంసం చేయబడినా అన్నిసార్లు తిరిగి అభివృద్ధి చేసుకొంటారు భారతీయులు అనేదానికి సోమనాథ దేవాలయ చరిత్రయే ప్రబల నిదర్శనము - అది భారతీయుల ఆధ్యాత్మిక విశ్వాసబలము.

## దర్శనీయ ప్రదేశాలు

1. **సోమనాథ దేవాలయం:** ప్రధాన ఆలయ గోపురం 155 అడుగుల యెత్తున 400 మీటర్లు పొడవు, 400 మీటర్ల వెడల్పున మూడు అంతస్థులతో నాగర శైలిలో ఆలయం నిర్మింపబడింది. దీనిలో జ్యోతిర్లింగము, బ్రహ్మ, విష్ణువులు దర్శనమిస్తారు.
2. ముస్లిముల దాడికిభయపడి అసలు లింగాన్ని 2ఫర్లాంగుల దూరంలో భూమిలో దాచారంటారు.

ఆలయంలో ఉదయం 7-00 గంటలకు హారతి - సేవ జరుగుతుంది. ఈ సమయంలో సోమనాథుని పాలు, నెయ్యి, పెరుగు మొదలగు ద్రవ్యాలతో అభిషేకాలు చేస్తారు. తర్వాత స్వామిని అలంకరిస్తారు. ఆలయం బయట పూలు మొదలగు పూజా సామాగ్రి అమ్మే షాపులు, కాఫీ, టీ, భోజన హోటళ్ళు, టాంగా బండ్లు, వ్యాన్లు, ఆటోరిక్షాలు మొదలగు సదుపాయాలున్నాయి.

సోమనాథ్‌లో తపతి (కపిల) హిరణ్య, సరస్వతి నదుల త్రివేణీ సంగమం, శారదాపీఠం, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, సూర్యదేవాలయం, లక్ష్మీనారాయణాలయం, భాలక తీర్థం / దేహోత్సర్గ (కృష్ణుడు బోయవాని బాణము నెపమున అవతారమును చాలించిన చోటు). జగత్‌మందిరం, జైనాలయం, బలరామ గుహ చూడదగినవి. సోమనాథదేవాలయందగ్గరలో ఆలయట్రస్ట్‌వారి భోజనశాల వుంది. యాత్రీకుల వసతి సౌకర్యాలకు ఇక్కడేవిధమైన లోటు లేదు.

# 2. మల్లికార్జున జ్యోతిర్లింగము

(శ్రీశైలం, ఆంధ్రప్రదేశ్)




శ్లో॥ శ్రీశైల సంగే విబుధాతి సంగే
తులాద్రి తుంగేపి ముదావసంతం।
తమర్జునం మల్లికపూర్వమేకం
నమామి సంసార సముద్ర సేతుమ్॥

**భావము:** శ్రీశైలములో దేవతలందరూ కలసి వున్న చోట తులాద్రి శిఖరముపైన సంతోషముగా నివసిస్తున్నవాడూ సంసారమనే సముద్రానికి వారధి వంటివాడూ అయిన మల్లికార్జునుడికి నమస్కరిస్తున్నాను.

**పురాణగాథ:**

విఘ్నేశ్వరుడు, కుమారస్వామి యుక్తవయసు వారగుటచేత వారికి వివాహము చేయాలని పార్వతీపరమేశ్వరులు సంకల్పించారు. వారిద్దరినీ పిలచి భూప్రదక్షిణము చేసి రమ్మనమని, ముందుగా వచ్చిన వారికి మొదట వివాహము చేస్తామని చెప్పారు. కుమారస్వామి తన నెమలి వాహనం మీద భూప్రదక్షిణమునకు బయలుదేరాడు. విఘ్నేశ్వరుని వాహనం ఎలుక కదా! అది నెమలిలా వేగముగా ప్రయాణించ లేదు కదా! వేగముగా ఎలా వెళ్ళిరాగలడు. దానికి తోడు భారీ శరీరము. వినాయకుడు బాగా ఆలోచించాడు. పూజ్యభావంతో మనస్ఫూర్తిగా తల్లిదండ్రులకు ప్రదక్షిణం చేస్తే భూప్రదక్షిణ చేసినట్లే అనే పురాణ వాక్యం స్ఫురించింది. వెంటనే తల్లిదండ్రులైన పార్వతీపరమేశ్వరులను భక్తిభావంతో స్మరిస్తూ వారికి ప్రదక్షిణ చేశాడు. అలా తల్లి దండ్రులకు అతడు ప్రదక్షిణ చేస్తూండడం చేత అన్ని నదులలోను, సముద్రములలోను తనకంటె ముందే అతడు స్నానము చేసి వస్తూండడమును చూచి కుమారస్వామి ఆశ్చర్యపోయాడు. మొట్టమొదట భూప్రదక్షిణ పూర్తిచేసినవాడుగా వినాయకుడు నిలిచాడు.

అపుడు పార్వతీపరమేశ్వరులు వినాయకునికి సిద్ధి, బుద్ధి అను ఇద్దరు కన్యలతో వివాహం చేశారు. తను అంత కష్టపడి తిరిగి వచ్చినా, యేమీ కష్టపడని వినాయ కుడికి ఫలితం దక్కడంతో కుమారస్వామికి అలకవచ్చింది. అతడు కైలాసమును వదలి దక్షిణమునవున్న క్రౌంచపర్వతము(శ్రీశైలము)నకు వెళ్ళిపోయాడు. కుమారునిపై గల ప్రేమతో తల్లియైన పార్వతి అక్కడికి వెళ్ళింది. ఆమె కోసం ఈశ్వరుడు వెళ్ళాడు. ఇలా పార్వతీపరమేశ్వరులు భ్రమరాంబ, మల్లికార్జునులనే పేరుతో శ్రీశైలం చేరారు.



పూర్వం శిలాదుడనే ఋషి సంతానము కోసం శివుని గూర్చి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షము కాగా 'నీపై భక్తిగల ఇద్దరుకుమారులను ఈయుము' అని కోరాడు. శివుని వరము వలన శిలాదునికి నంది, పర్వతుడు అను పుత్రుడు కలిగాడు.

వారు శివుని గూర్చి తపస్సు చేశారు. శివుడు నందికి ప్రత్యక్షమై వరము కోరు కొమ్మనగా నంది 'స్వామీ! నీవెల్లపుడు నాపై నివసించాలి. నిన్ను మోసే భాగ్యం నాకు కల్గించు' అని కోరాడు. ఇంకా 'నేను తపస్సు చేసిన ఈ స్థలంలో' పర్వతలింగ' మనే పేరుతో వెలసి, ఈ పర్వత శిఖరం చూసినంత మాత్రాన భక్తులకు పునర్జన్మ లేకుండా మోక్షము కలగాలి. సమస్త తీర్థాలూ, సకల దేవతలూ ఇక్కడ కొలువుండాలి.' అని కోరాడు. పర్వతుడు శ్రీ పర్వతముగా, పర్వత లింగము మల్లికార్జున లింగముగా అయ్యింది.

**వృద్ధమల్లికార్జునుడు:**

పూర్వం ఒక రాకుమారి శివుని పెండ్లాడాలను కొంది - శివుని మల్లిపూవుల తోను, అర్జున పుష్పాలతోను పూజించేది. ఒక రోజు శివుడు ఆమె కలలో కనిపించి ఒక తుమ్మెదను చూపించి అది వాలిన చోట తన కోసం వేచి వుండమనీ, తానే వచ్చి వివాహమాడతాననీ చెప్పాడు. ఆమెకి మెలకువ వచ్చి కళ్ళు తెరిచే సరికి ఒక భ్రమ రము ఎగురుతూ కన్పించింది. ఆమె ఆ తుమ్మెదను అనుసరిస్తూ శ్రీశైల ప్రాంతము లోని అడవిలో ఒక పొద మీద తుమ్మెద వాలడం చేత ఆ పొద క్రింద శివుని ధ్యానిస్తూ శివుని కోసం నిరీక్షించ సాగింది. ఆ అడవిలోని చెంచులు పాలు, పండ్లు, తేనె మొద లైన వాటిని ఆమెకు ఆహారంగా ప్రతిరోజూ ఇచ్చేవారు.

ఒక రోజు శివుడు పార్వతితో కలసి ఆ ప్రాంతానికి వచ్చేడు. పార్వతికి ఆ రాకుమారిని చూపించి ఆమె నన్ను పెండ్లాడదలచుకొన్నదని శివుడు చెప్పేడు. దానికి పార్వతి హేళన చేసింది. శివుడు తన మాటలను నిరూపింపదలచి ఆ రాకుమారి దగ్గరకు ఒక ముసలివాని రూపంలో వెళ్ళి 'రాకుమారీ, నీ కోసం వెతుకుతూ ముసలి వాడనయ్యాను ఇంత కాలానికి నిన్ను చేరాను. 'నా ముసలి రూపమును లెక్క చేయక నన్ను పెళ్ళాడుతావా?' అని అడిగాడు. అందుకామె ఒప్పుకొన్నది. ఆమెను తమ స్వంత బిడ్డవలె సాకిన చెంచులు వద్దంటున్నను వినక శివుని పెండ్లాడింది. ఆ సందర్భంగా చెంచులు కొత్త అల్లుని కొరకు మద్య, మాంసాలతో విందు యేర్పాటు చేశారు. శివుడావిందును అంగీకరించలేదు. రాకుమార్తె యెంతగా నచ్చచెప్తున్నా విన బడనట్లు అలిగి శివుడు వెళ్ళిపోసాగాడు. ఆమె మల్లయ్యా... ఓ చెవిటి మల్లయ్యా! ఆగు... నిలబడు అని గట్టిగా పిలిచింది. అయినా శివుడు లెక్కచేయలేదు. అప్పుడా రాకుమార్తె 'రాయిలాగ మాట్లాడవేమి? అక్కడే లింగముగా మారిపో' అని శపించింది. వృద్ధుడైన శివుడు అక్కడే అదే రూపంలో రాయిగా మారిపోయాడు. అందుకు పార్వతి రాకుమారిని చూచి 'ఓసీ! భ్రమరమును వెంబడించి వచ్చిన నీవు తుమ్మెదగా మారి పోవుదువు గాక' అని శపించింది. దాంతో ఆమె శివుని భార్యయైన భ్రమరాంబగా నిలచిపోయింది. భక్తులు ఇప్పటికీ వృద్ధ మల్లికార్జునస్వామిని వృద్ధమల్లయ్యా, ముసలి మల్లయ్యా, చెవిటి మల్లయ్యా అని పిలుస్తూ వుంటారు.

**భ్రమరాంబాదేవి:**

ఒకప్పుడు అరుణాసురుడనే రాక్షసుడు బ్రహ్మను గూర్చి తపస్సు చేసి రెండు కాళ్ళ ప్రాణుల నుండి గాని, నాలుగు కాళ్ళజీవుల నుండి గాని తనకు మరణం లేకుండా వరం పొందాడు. వరగర్వంతో అతడు అన్ని లోకాలనూ బాధించసాగాడు. అతనిని సంహరించమని దేవతలంతా ఆదిశక్తిని కోరారు. అప్పుడామె అరుణాసురుని తో యుద్ధానికి తలపడింది. ఆమె వేలాది తుమ్మెదలను సృష్టించి అరుణాసురుని సంహరించమని పంపింది. ఆరుకాళ్ళ జీవులైన ఆ తుమ్మెదలు అరుణాసురుని కుట్టి సంహరించాయి. దేవతల కోరికపై ఆదిశక్తి భ్రమరాంబికగా అక్కడ వెలసింది. అందుకే గాబోలు అమ్మవారి ఆలయం వెనుక గోడల నుండి భ్రమరముల ఝుం కారము వినిపిస్తూ వుంటుంది.

18 శక్తి పీఠాలలో మహామహిమాన్వితమైనది భ్రమరాంబా శక్తిపీఠమే. అష్టా దశ (18) శక్తి పీఠాలలో శ్రీశైల పీఠాన్ని అధిష్టించిన భ్రామరీశక్తి భక్తుల కోరికలను తీర్చటంలో ప్రఖ్యాతి పొందింది. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన మల్లికార్జున లింగము అనే పేరుతో శివుడు, అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా పరిగణింపబడిన భ్రమరాంబిక పేరున ఆదిశక్తియైన పార్వతి యీ శ్రీశైలంలో వెలసి యుండడం శివ భక్తులకు, శాక్తేయులకు విశేష ఆనందదాయకము.

**చరిత్ర:** కృతయుగంలో హిరణ్యకశిపుడు, త్రేతాయుగంలో శ్రీరాముడు శ్రీశైలాన్ని దర్శించారు.

ద్వాపరయుగంలో పాండవులు (కీ॥ పూ॥ 3120 ప్రాంతంలో) శ్రీశైలాన్ని దర్శించి వారి పేర్లతో లింగాలను ప్రతిష్టించారని ఇతిహాసాలు, పురాణాలు వలన తెలుస్తోంది. ఇక చరిత్రలో-పతంజలి మహర్షికంటెముందు యోగశాస్త్రాన్ని బోధించిన గోరక్‌నాథుడు, ఆదిశంకరాచార్యులు, ఆచార్య నాగార్జునుడు శ్రీశైలమును దర్శించారనీ, అక్కడ కొంతకాలం తపస్సు చేశారనీ తెలుస్తోంది. తర్వాత వివిధరాజ వంశాలవారు శ్రీశైలాన్నభివృద్ధి చేశారు.

**శాతవాహనులు:** శాతవాహనుల కాలంలో శ్రీశైలాని 'సిరిధాన్' అని వ్యవహరించే వారు. పులమావి (క్రీ॥శ॥ 102-130)నాసిక్ గుహలలో చెక్కించిన శాసనాలలో దీని ప్రస్తావన వుంది. 3వ శతాబ్ది వరకు పాలించిన శాతవాహనులు దీని పోషణ చూసే వారు.

**ఇక్ష్వాకులు:** ఇక్ష్వాకులు 3వ శతాబ్దిలో ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. వారిలో 'వశిష్ఠపుత్ర క్షాంతమూలుడు' కుమారస్వామి భక్తుడు, శివభక్తుడు. ఇతని కాలంలో శ్రీశైలం చాలా అభివృద్ధి చెందింది. శాతవాహనుల కాలంలో 'సిరిధాన్'గా పిలువ బడిన క్షేత్రము ఇక్ష్వాకుల కాలంలో శ్రీశైలముగా, శ్రీపర్వతముగా పిలువబడింది. ఇక్ష్వాకులు శ్రీ పార్వతీయులుగా పిలువబడ్డారు.

**పల్లవులు:** ఇక్ష్వాకు రాజైన పురుషదత్తుని గెలిచి సింహవర్మ అనే పల్లవరాజు శ్రీశైలాన్ని తన రాజ్యంలో కలుపుకున్నాడు. ఇతని వంశస్థుడైన త్రిలోచన పల్లవుడు



శ్రీశైల ప్రాంతపు అడవిని కొంత కొట్టించి బ్రాహ్మణులకు నివాసాన్ని ఏర్పరచాడు. పల్లవులు 4వ శతాబ్ది వరకు శ్రీశైలాన్ని పరిపాలించారు. తర్వాత 'కరికాలచోళుడు' అనునతడు త్రిలోచన పల్లవుని ఓడించి అతడు తలపెట్టిన అభివృద్ధిపనులను హిందూస్థానీ పని వారితో చోళుడు పూర్తి చేయించాడు.

**విష్ణుకుండినులు:** 4వ శతాబ్ది చివరిభాగంలో శ్రీశైలము విష్ణుకుండినుల అధీనంలోకి వెళ్ళింది. వారున్ను, వారి బంధువులైన 'వాకాటకులు'ను శ్రీశైలాభివృద్ధికి కృషిచేశారు.

**కదంబులు:** 6వ శతాబ్ది మొదటి భాగంలో పల్లవులు తిరిగి రాజ్యానికి వచ్చారు. తర్వాత వారిని మయూర వర్మ అనే కదంబరాజు జయించి శ్రీశైలాన్ని తన అధీనం లోకి తెచ్చుకున్నాడు.

**చోళులు:** 6వ శతాబ్ది మధ్య నుండి 8వ శతాబ్ది వరకు రాజ్య పరిపాలన చేసిన చోళ వంశములలో రేనాటి చోళులు శ్రీశైలమును పాలించారు.

**రాష్ట్రకూటులు:** 8వ శతాబ్దిలో రాష్ట్రకూటుడైన 'దంతిదుర్గుడ'నువాడు కీర్తివర్మను జయించి కర్ణాటకకు రాజయ్యాడు. అతడు, అతడి వంశస్థుల పాలనలో క్రీ॥ శ॥ 973 వరకు శ్రీశైలము వుంది.

**చాళుక్యులు:** క్రీ॥ శ॥ 973లో ఒక చాళుక్యుడు రాష్ట్రకూటులను జయించి శ్రీశైలాన్ని తిరిగి చాళుక్యుల పాలనలోకి తెచ్చాడు. ఇతని వంశస్థులను చాళుక్యులనీ, కళ్యాణి చాళుక్యులనీ అంటారు. వీరికి, దాక్షిణాత్య చోళులకూ మధ్య కలహాలను అవకాశముగా తీసుకొని రెండవ గోంక వెలనాటి ప్రతినిధి శ్రీశైలాన్ని ఆక్రమించాడు. క్రీ॥ శ॥ 1162 వరకు శ్రీశైలం ఇతని కొడుకు వశములో వుంది.

**కాకతీయులు:** క్రీ॥ శ॥ 1162 నాటికి శ్రీశైలం కాకతీయుల చేతిలోకి వచ్చింది. ఆనాటి నుండి 1323 వరకు శ్రీశైలం కాకతీయుల అధీనంలోనే యుండి అభివృద్ధి చెందింది.

**కొండవీటిరెడ్డి రాజులు:** క్రీ॥ శ॥ 1326 నుండి అద్దంకిని పాలించిన ప్రోలయ వేమారెడ్డి అధీనంలోకి శ్రీశైలం వచ్చింది. ఈ ప్రోలయ వేమారెడ్డి 1335 సం॥లో పున శ్రీశైలానికి మెట్లు కట్టించాడు. 1335-1346 మధ్య పాతాళగంగకు మెట్లు కట్టించినట్లు శాసనాలు చెప్తున్నాయి. ఇవి ఇప్పటికీ బాగానే వున్నాయి. అయినా 1393-94లో రెండవ దేవరాయల భార్య విఠలాంబ కట్టించిన పాతాళగంగ మెట్లనే భక్తులు వాడుతున్నారు. 1364లో రాజ్యానికి వచ్చిన అనవేమారెడ్డి 1377లో వీరశిరో మండపాన్ని కట్టించినట్లు 9-1-1378న వేయించిన ఒక స్తంభ శాసనం వలన తెలుస్తోంది. ఇతని తర్వాత కుమారగిరిరెడ్డి (1378-1407 రాజ్యకాలం) శ్రీశైల శిఖరానికి మెట్లు కట్టించాడు. ఇతని మంత్రి కాటయవేముడు 1398లో ఈ మెట్లు వేయించినట్లు శాసనమున వున్నది.

**విజయనగర రాజులు:** విఠలాంబ పాతాగంగకు మెట్లనేకాక విఠలేశ్వరాలయాన్ని కూడ కట్టించినట్లు తెలుస్తోంది. క్రీ॥ శ॥1405లో రెండవ హరిహర రాయలు ఆలయ ముఖమండపాన్ని, దక్షిణపు వైపు గోపురాన్ని నిర్మింపజేశాడు. 1456లో సాళువ

తిరుమలయ్య శ్రీశైలానికి చాలా దానాలు చేశాడు. 1457-58లో ప్రౌఢ దేవరాయల పరిచారిక కొన్ని దానాలు చేసింది. 1468లో మహామండలేశ్వర పర్వతయ్య (వీరనరసింహరాయల వంశము వాడు) భూములు, తోటలు, కట్టడాలు దానం చేశాడు. 1485లో సాళువ పెదమల్లప్ప రాజు ఒక చెరువును తవ్వించాడు. 1513లో శ్రీకృష్ణదేవరాయలు గర్భాలయపు రాగిరేకుకు, ముఖమండపానికి బంగారుపూత పూయించాడు. 1526లో రాయల సేవకుడు మల్లప్ప కొన్ని కానుకలిచ్చాడు. రాయల మంత్రి 'చంద్రశేఖరామాత్యుడు' కళ్యాణ మండపాన్ని కట్టించి గర్భాలయ ద్వారాలకు బంగారు రేకులు పొదిగించాడు. క్రీ॥ శ॥ 1529 నవంబరులో - ఆలయ విమానానికి చుట్టూ కొంతభాగం బంగారుపూత పూయించాడు. 14-1-1531న బంగారు నందిని చేయించాడు. పవళింపు సేవామందిరానికి ముందు మండపాన్ని కట్టించి అందులో శ్రీకృష్ణదేవరాయలు, తిమ్మరుసుల విగ్రహాలను పెట్టించాడు.

**శివాజీ:** మహారాష్ట్రుడైన ఛత్రపతి శివాజీ క్రీ॥ శ॥ 1674-77లో శ్రీశైలాన్ని దర్శించి, ఉత్తర గోపురాన్ని నిర్మింపజేసి, ఆలయ రక్షణ కోసం కొంతమంది మరాఠీ సైనికులను నియమించాడనీ, రోహిల్లాల దండు ఆలయంపై దండెత్తినపుడు ఆ మరాఠీసైనికులలో చివరివాడు కూడా చనిపోయే వరకూ వారితో పోరాడినట్లును తెలుస్తోంది. ఆ సైనికుల సంతతి వారిప్పటికీ ప్రతి సంవత్సరము శ్రీశైలము వచ్చి తమ పెద్దలకు ధూపం వేస్తుంటారు.

శివాజీ శ్రీశైలంలోని భ్రమరాంబాదేవిని సేవించి ఆమెను ప్రసన్నము చేసికొని ఖడ్గమును కానుకగా పొందినాడనీ, నాటినుంచీ 'ఛత్రపతి శివాజీ' అని పిలువబడ్డాడని చరిత్ర.

**నవాబులు:** ఔరంగజేబు ఈ ప్రాంతాన్ని జయించి రాజాభీమ్‌సింగును గవర్నరుగా నియమించాడు. ఈ ప్రాంతము అప్పటి సేనాని దావూద్‌ఖాన్‌కు జాగీరుగా ఈయబడింది. తర్వాత అతని తమ్ముడు ఇబ్రహీంఖానుకు సంక్రమించింది. ఇబ్రహీంఖాన్ శ్రీశైల దేవాలయం క్రింద అనుభవములో నున్న గ్రామాలను, ఆస్తులను 1712లో తిరిగి పట్టాలిచ్చి వారికి స్వాధీనం చేశాడు. తర్వాత ఇది హైదరాబాదు నవాబుల అధీనమయ్యింది. 8-4-1782లో నైజాం ఆలీఖాన్ అసఫ్‌జా దస్తావేజులను పునరుద్ధరిస్తూ దేవస్థాన పరిపాలనను శ్రీ శృంగేరీ జగద్గురువులకు అప్పగించాడు. తర్వాత అది ఈస్ట్ ఇండియా కంపెనీ స్వాధీనమయింది. వారు 1840లో పుష్పగిరి పీఠాధిపతులకు అప్పగించారు. 100 సం॥ల కాలం వారి అధీనంలో నున్నా యెట్టి అభివృద్ధి లేకపోగా ఆలయాలు జీర్ణావస్థకు చేరుకున్నాయి. పుష్పగిరిపీఠం ఆలయ నిర్వహణ సరిగా చేయకపోవడం చేత ఆనాటి ప్రభుత్వం దీనిని కొంతకాలం జిల్లా కోర్టు వారధీనంలో వుంచి, 1929లో శ్రీ పాణ్యం రామయ్య గారి అధ్యక్షతన ఒక బోర్డు నేర్పరచి వారికి అప్పజెప్పారు. ఆ బోర్డువారు 1949లో దేవాదాయ ధర్మాదాయ శాఖవారికి అప్పజెప్పారు. ఈశాఖ వారు నేడు యెన్నో అభివృద్ధి కార్యాలు చేస్తున్నారు.

## శ్రీశైల దేవాలయానికి చేయబడిన దానములు

శాసనములను బట్టి యెందరో భక్తులు చాలా దానాలు చేసినట్లు తెలుస్తోంది. ఇక్కడ కొన్నిటిని వివరిస్తున్నాము.



1412లో 'లింగయ్య' అనునతడు గుడి చుట్టూ గల ప్రాకారంలో కొంతభాగం కట్టించాడు. 'అప్పనయ్యంగారు' నంది మండపం నుండి భ్రమరాంబా ఆలయంవరకు మెట్లు కట్టించాడు. 1456లో చోళమండల రాజ్యపు గవర్నరు బంగారు ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించాడు. 1462లో బైరాగి 'శాంతయ్య' పూలతోటను దానమిచ్చాడు. 1505లో వీరప్పయ్య భార్య లక్కమ్మ ముఖమండప దక్షిణ ద్వారానికి గల రాగిరేకుకు బంగారు పూత వేయించింది.

1517లో పర్వతయ్య, అతని భార్య భీముని కొలనుకు దగ్గరలో ఒక చెరువును త్రవ్వించారు. 1529లో శ్రీశైలంలో కరణముగా పనిచేస్తున్న వాని కొడుకులు అన్నపూర్ణ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 1530లో లింగయ్య అనునతడు మల్లికార్జున స్వామి కవచానికి బంగారుపూత పూయించాడు. తిరుమల రాయల అనుచరుడైన 'శాలకరాజు' యజ్ఞశాలా మండపాన్ని కట్టించాడు. 'మల్లప్ప నాయుడు' పెద్ద గంటను దానమిచ్చాడు. 1585లో నందరాయ పట్టణమునకు చెందిన 'కుమార వీరప్పయ్య దేవుడు' అనునతడు స్వామి వారికి పెద్ద గంటలను యిచ్చాడు.

1592లో కృష్ణప్పనాయకుడు 'గంగైకొండనాడు'లోని రెండు గ్రామాలను ఆలయానికి బహూకరించాడు. 1594లో 'సితాపిఖాన్' అనువాడు గుడి ఉత్తరపు వాకిలికి ఎదురుగా బంగారు ధ్వజస్తంభాన్ని యేర్పాటు చేశాడు. 1634లో 'అన్నమరాజు' బంగారు స్తంభాన్ని పాతించాడు. 'మన్నెపు నాయకుడు' దక్షిణ ప్రాకారాన్ని పునరుద్ధరించాడు. చరిత్రలో ఇంకా యెంతమంది యేవేవి బహూకరించారో? ఎంతమంది భ్రమరాంబా మల్లికార్జునులను సేవించి తరించారో!

## శ్రీశైల క్షేత్రంలో చూడదగిన ప్రదేశములు

శ్రీ శిఖరేశ్వరం, హాటకేశ్వరం, పాలధార - పంచధారలు, సాక్షిగణపతి, బైలు వీరభద్రుడు, నాగలూటి వీరభద్రుడు, వీరభద్రస్వామి, మల్లికార్జునాలయం, ప్రాకారాలు-గోపురాలు, శనగల బసవన్న, సప్తమాతృకలు, శనగల బసవన్న, పాతాళగంగ, సిద్ధిరామేశ్వరకొలను, భీమునికొలను, మనోహర గుండము, బ్రహ్మగుండము, విష్ణుగుండము, నవబ్రహ్మాలయాలు, హేమారెడ్డి మల్లమ్మ-అక్కమహాదేవి, బలిపీఠం, సారంగధర మఠం, శ్రీరామప్రతిష్ఠిత సహస్రలింగం, సీతాప్రతిష్ఠిత సహస్రలింగం, త్రిఫలవృక్షం, భ్రమరాంబాలయం, లోపాముద్ర, శిల్పమండపం, రుధిరగుండం, నిత్యకళ్యాణమండపం, యాగశాల, అన్నపూర్ణా మందిరం, అమరేశ్వరాలయం, గిరిజాశంకరుడు, పశుపతినాథలింగం, గంగాధర మండపం, మల్లమ్మ కన్నీరు, వరాహతీర్థం, గోగర్భం, గంగాభవానీ స్నానఘట్టాలు, పాతాళగంగా ఘట్టము, ఆరామ వీరేశ్వరుడు, చంద్రకుండం, శివాజీస్ఫూర్తి కేంద్రము, శ్రీ మౌనస్వామి సమాధి, దత్తాత్రేయ వృక్షము - పాదుకలు, పాతాళేశ్వరుడు, విఠలేశ్వరాలయం, అక్కమహాదేవి, కదళీవనం, శ్రీ కుమారస్వామి, ఈశ్వరుని అష్టమూర్తులు, శ్రీ రాజరాజేశ్వరీ ఆలయం, పంచపాండవుల ప్రతిష్ఠిత లింగములు, ఆలయ ప్రాంగణములోని నాగావళీ పార్కు దేవాలయ ప్రాకార కుడ్యశిల్పములు, శంకరమఠము, శృంగేరిశారదామఠం, కంచి

కామకోటి మఠం, పండితారాధ్య పీఠం, పంచమఠాలు, ఘంటామఠం, విభూతి మఠం, రుద్రాక్షమఠం, నందులమఠం, జలవిద్యుత్‌ప్రాజెక్టు మొదలైనవి చూడదగినవి.

## శ్రీశైల శిల్పసంపద - విశేషాలు

శ్రీశైలమున ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన మల్లికార్జునలింగము, అష్టాదశ శక్తులలో ఒకర్తైయైన భ్రమరాంబ వెలసియుండుట శివ-శక్తుల సమ్మేళనమును పొందిన పవిత్ర స్థలమని గ్రహించండి. ఈ సందర్భంగా శ్రీ శంకరాచార్యుల వారు ఇక్కడ వ్రాసిన శివానందలహరిలోని ఒక శ్లోకము చెప్పుకోవడం బాగుంటుంది -

శ్లో॥ సంధ్యారంభ విజృంభితం శ్రుతిశిరస్థానాంతరాధిష్ఠితం
సప్రేమ భ్రమరాభిరామ మసకృత్సద్వాసనా శోభితం ।
భోగీంద్రాభరణం సమస్త సుమనః పూజ్యం గుణావిష్కృతం
సేవే శ్రీగిరి మల్లికార్జున మహాలింగం శివాలింగితమ్ ॥

శ్రీశైలంలో ప్రధానమైనది మల్లికార్జునాలయం. ఇది తూర్పు ముఖంగా వుంది. ఈ ఆలయానికి ముందు వెనుకల (తూర్పు - పడమరలలో) ధ్వజస్తంభాలుండడం ఒక విశేషం. ఈ ఆలయానికి ముఖమండపమేగాక నందిమండపం కూడ వేరుగా వుంది. చాలా స్తంభాలతో వున్న ఈ మండపంలోని నంది చాలా పెద్దది. దీన్ని శనగల బసవన్న అంటారు. గర్భాలయంలోకి ప్రవేశించేముందు ఎడమచేతి ప్రక్కన పెద్ద బొజ్జగల గణపతి విగ్రహముంది. ఇతడి పొట్టలో రత్నాలున్నాయని రత్నగణపతి అంటున్నారు.

మల్లికార్జునాలయానికి పడమరదిక్కున ప్రాకారాన్ని ఆనుకొని భ్రమరాంబాలయ మున్నది. ఆ ఆలయంలో ప్రవేశించే ముందు ఎడమ ప్రక్క చిన్న మందిరములో సీతాదేవి ప్రతిష్ఠించిన సహస్రలింగస్వామి వున్నాడు. భ్రమరాంబాలయానికెదురుగా నున్న మండపంలో ఆమె వాహనమయిన సింహము నుంచారు. భ్రమరాంబికామూర్తి దుర్గాకృతి/కాళికాకృతిలోనో వుంది. ఈమెకి మాధవి అని పర్యాయ నామం వున్నది.

మల్లికార్జునుని గుడి తూర్పు ముఖద్వారానికి ఉత్తరముగా వృద్ధమల్లికార్జునాలయం వుంది. లింగము పెద్దదే. ఈ గుడికి కొంచము ఈశాన్యంగా చిన్న సహస్రలింగాలయం వుంది. ఈ లింగముపై చిన్న పిల్లలు తినే పాలకాయల ఆకారంలో వేయి లింగాలు చెక్కబడ్డాయి. ఇది సీతాదేవి ప్రతిష్ఠించిన సహస్రలింగము కంటె పెద్దది. ఇక్కడ పంచపాండవుల గుళ్ళు వీరభద్రాలయము ఉన్నాయి.

మల్లికార్జునాలయంలో లోహనిర్మితాలైన నటరాజ విగ్రహాలు అసాధారణమైన నాట్య భంగిమలలో శాస్త్ర లక్షణాలతో వున్నాయి. పూర్వం గోడలు బంగారు పూత పోసిన ఇత్తడి రేకులతో కప్పబడి వుండేవి. వాటి మీద శివావతారాలు, జిలుగు నగిషీ పనితనముతో వున్నాయి - అయితే పోగా మిగిలిన కొన్ని రేకులు ఈనాడు మద్రాసు మ్యూజియంలో భద్రపరచారు.



మల్లికార్జునాలయానికి ఉత్తర దిక్కుగా మేడి, జువ్వి, రావి కలసిన ఒక పెద్ద చెట్టు వుంది. దీనిని దత్తాత్రేయ వృక్షమని పూజలు చేస్తూ వుంటారు. ఈ ఆలయ ప్రాకారము లోపలే కొన్ని కోనేరులున్నాయి. అందలి నీరు పవిత్రములని కొందరు ఆ తీర్థములతో స్వామినభిషేకిస్తారు. ఇక శిల్పాల గూర్చి -

శ్రీశైలంలో నంది మండపము మీద, మల్లికార్జునాలయము మీద మూడు దిక్కులలోను శివావతారమూర్తులను పరమసుందరంగా అమర్చారు. నందిమండపానికి తూర్పున నటరాజశిల్పం చాలా అందంగా వుంది. ఎడమ ప్రక్క శివకామి, కుడి వైపు మాణిక్యవాచకర్ విగ్రహాలున్నాయి. దక్షిణదిశలో వ్యాఖ్యాన దక్షిణామూర్తి సప్తర్షి పరివేష్టితుడై వున్నాడు. ఉత్తరమున పాశుపతమూర్తి చెక్కబడింది. ప్రధానాలయ ద్వారముముందు తూర్పున వృషభారూఢమూర్తి ఇరుప్రక్కలా వినాయక, కుమార స్వాములు కొలుస్తూ వున్నట్లు చెక్కబడింది. దక్షిణమున భిక్షాటన మూర్తి (మదన కామేశ్వరుడు) చెక్కబడింది. ఈయన సౌందర్యానికి మోహించిన ఋషిపత్నులు తమ వలువలు (బట్టలు) జారిపోతుండగా ఆ పరమేశ్వరుని వెంటబడినట్లు చిత్రింపబడి వున్నారు. ఈ శిల్పము అత్యద్భుతమనవచ్చు.

ఉత్తర దిక్కున మార్కండేయ రక్షణం చేస్తున్న శివుడు మలచబడినాడు. ఇలాగే కళ్యాణ మండపము మీద గూడ సిమెంటుతో శిల్పం అమర్చబడింది. పడమటి దిక్కున పార్వతీ కళ్యాణశిల్పము, దక్షిణమున అమ్మవారిని ఎడమ కౌగలించుకొంటున్న ఆలింగనమూర్తి, ఉత్తరమున గంగాధరమూర్తి ప్రధానములు. ఆవలీవల హరిహర, కాలభైరవమూర్తులు సౌందర్యపరాకాష్టనందుకొన్నవి.

ఇటీవల తయారైన శిల్పాలలో చెప్పదగినది అమ్మవారి ఆలయానికి చుట్టూ నిర్మింపబడే ప్రదక్షిణ మండపం. ఈ మండప స్తంభాలు దివ్యశిల్ప విలసితములు. పెద్ద పెద్ద ఏనుగుల మీద వాటి తొండములను పట్టుకొని సింహములు, ఆ సింహాల మీద ఖడ్గములను చేత ధరించిన దేవకన్యలు దర్శనమిస్తారు. ఈ సింహాల నోళ్ళలో కోరల మధ్య గుండ్రని బంతుల వంటి గుండ్లు చెక్కబడినవి - కోరలు విరుగకుండ, నాలుకకు దెబ్బతగలకుండ మాంసపుముద్దలలాగ వీటిని తీర్చడం చాలా కష్టమైనపని. ఇది ఒక విచిత్ర శిల్పమనవచ్చును. వీలున్న చోటునల్లా అద్భుతమైన జిలుగు నగిషీ పనితో నింపబడ్డాది. ఈ స్తంభాలలో మూలలలో నున్న స్తంభాలపై గల దేవకన్యల అవయవ సౌందర్యము చూచి ఆనందించవలసినదేగాని చెప్ప శక్యము కానిది. ఆవ్యాళీ స్తంభానికి ప్రక్కనే తీర్చబడిన ద్వారపాలిక, ఆమె శిరస్సు మీది పద్మముల అందము వర్ణించనలవిగానిది.

మరీ చెప్పదగిన విశేషం కలవి తూర్పు ద్వారానికి ఆవలీవలా చెక్కబడిన శిల్పాలు, వెనుక ప్రక్క అరటి ఆకులు శిల మీద తీర్చబడి వుంటవి. అరటి ఆకు కుండవలసిన సౌకుమార్యం ఆ శిల్పి యెలా చెక్కాడా అని మనం ఆశ్చర్యపోతాము. గంధర్వ స్త్రీలు ఆ అరటిచెట్ల నానుకొని నిలబడి నృత్యం చేస్తున్నట్లున్నారు. వారి పాదాల క్రింద ఢంకా వాద్యాలున్నాయి. ఆ ఢంకాల మీదనే వారి నాట్యం కనక దీన్ని ఢంకా నృత్య శిల్పమంటారు. ఆ స్తంభాల మీద వీలున్న దగ్గరల్లా యెన్నెన్ని దేవతా, మానవ మూర్తులను చెక్కారో చెప్పడం కష్టం.

భ్రమరాంబా, మల్లికార్జునాలయములు రెండింటి మీద చుట్టూ శిల్పకళ ఉన్నా వాటికన్న ప్రాకారకుడ్య శిల్పాలే యెక్కువగా ఆకర్షిస్తాయి. ఇవన్నీ అర్ధశిల్పాలేకాని పూర్ణ శిల్పాలు కావు. మూర్తికి నలువైపులాగల విశేషాలను చూపేది పూర్ణశిల్పమనీ, ఒక రాతిమీద ఒక ప్రక్కమాత్రమే అగపడేటట్లుచేయబడినది. అర్ధశిల్పమనీ అంటారు. ఈ నిర్వచనం ప్రకారం చూస్తే శ్రీశైల ఆలయ ప్రాకార శిల్పాలన్నీ అర్ధశిల్పాలే.

మల్లికార్జున దేవాలయ ప్రాకారము ఆరడుగుల పొడవు, మూడడుగుల వెడల్పు గల రాళ్ళను యెనిమిది వరుసలుగా ఒక దాని మీద నొకటి అమర్చిబడిన రాళ్ళు యెడమెడముగా పెట్టబడి వున్నాయి. ఈ నిర్మాణ పద్ధతి దుర్గప్రాకార పద్ధతివలె వుంటుంది. క్రిందివరుస రాళ్ళ మీద శిల్పములు లేవు. తర్వాతి ప్రతి రాతి మీద అనేక పురాణగాధల శిల్పాలు, శివలీలలు, శివావతార చిత్రాలు యెన్నెన్నో చెక్కబడ్డాయి. ప్రాకారానికి పడమటి వైపున తప్ప మిగిలిన మూడు వైపులా గోపురాలున్నాయి.

ప్రాకారపు గోడలకు వెలుపల రెండోవరుస రాళ్ళపై ఎన్నెన్నో రకాల ఏనుగులు చెక్కబడ్డాయి. కొన్ని ఒకదాని వెనుక ఒకటిగాను, మరికొన్ని యెదురెదురుగాను, కొన్ని కలహిస్తున్నట్లు, కొన్ని శివలింగాలను అభిషేకిస్తున్నట్లు, పూజిస్తున్నట్లు, కొన్ని అంబారీలతో యుద్ధమునకు బయలుదేరుతున్నట్లు, కొన్ని తమ తొండములతో తామరపూల కాడలను మెలివేస్తున్నట్లు, మరికొన్ని తొండములతో చెట్లను విరుస్తున్నట్లు చాలా అందముగా చెక్కబడ్డాయి.

రెండు ఏనుగులు కుండలతో నీటినెత్తిపోసి శివలింగాన్ని అభిషేకించాడం, శివుడు లింగములో నుండి తన దివ్యరూపాన్ని ప్రకటించడం చాలా మనోహరంగా వుంటుంది. మరొక శిల మీద ఒక ఏనుగు కడవతో నీరుపోసి అభిషేకిస్తూండగా మరొక ఏనుగు కలువపూలతో లింగమును పూజిస్తూ వుంటుంది. ఇంకొక చోట ఒక ఆవు తన పొదుగు నుండి శివలింగముపై పాలను కురిపిస్తున్నట్లున్నది. ప్రాకారపు కుడివైపున రెండు బల్లులు శివలింగపూజచేసిన శిల్పంయెంతో సున్నితంగా బాగుంది.

మూడవ వరుస రాళ్ళ మీద నానావిధాలుగా నున్న గుఱ్ఱములు చెక్కబడ్డాయి. కొన్ని మామూలుగా వుంటే, కొన్నివేటలో పాల్గొన్నట్లున్నాయి. వాటి మీద వీరభటులు న్నారు. వేటాడే భటులు అడవి జంతువులనే సందర్భములో యెలా చంపవలసినదీ వివరిస్తున్నవి. వేటకుక్కలు వారికి సహాయం చేయడం - వేటరహస్యాలెన్నో తెల్పును. కొన్ని గుర్రాలు ఇనుపకవచాలతో నున్నాయి. దీనిని బట్టి గుర్రాలకు యుద్ధము లందు మాత్రమే కాక వేట యందు కూడా కవచాలు వేస్తారని తెలుస్తుంది.

కొన్ని వరుసలలో హంసలు, కిన్నెరులు, పురుష మృగములు చెక్కబడ్డాయి. తల, వృక్షము పురుషాకృతితోను, నడుము, కాళ్ళుమృగాకృతితోను వుండే రూపాన్ని పురుష మృగమంటారు. అయిదవ వరుసలో యోగాసనాలలో నున్నమూర్తులు చెక్కబడ్డాయి. ఈ యోగా సనాలు 72పైన కన్పిస్తున్నాయి. మనకు పరిచయమైనవే కాక విశేషాసనాలున్నూ యెన్నో ఇక్కడ చెక్కబడ్డాయి. ఋషులు, సాధకులు, స్త్రీలు కూడా ఆసనాలు వేస్తున్నట్లు యెంతో ఆకర్షణీయంగా చెక్కబడ్డాయి.



శ్రీశైల ప్రాకారాలపై యెన్నో విధములైన నృత్యభంగిమలు, మర్దళాది వివిధ వాయిద్యవాదకుల శిల్పాలు అద్భుతంగా వున్నాయి. తూర్పు ప్రాకారపు గోడ మూడవ వరుసలో గణపతి, సాలీడు, పాము, ఏనుగులు శివార్చన చేయు కథ, తిన్నడను బోయవాడు కండ్లు పెరికి శివునకు పెట్టుట, చంద్రావతీ చంద్రగుప్త మహారాజుల కథలు, ఒక స్త్రీ తన చనుబాలను శివలింగముపై పిండుట, శివుడు యముని నుండి మార్కండేయుని రక్షించడం, త్రిమూర్తులు, అష్టదిక్పాలకులు, దక్షయజ్ఞ ధ్వంసము, దేవగంధర్వాప్సరసలశిల్పాలు, లింగోద్భవమూర్తి పార్వతీకళ్యాణము, కళ్యాణసమయంలో దేవతలంతా చేరుటచే ఉత్తరాన బరువై భూమి క్రుంగటం, అప్పుడు అగస్త్యుడు దక్షిణమున నిల్చి భూమిని సమతూకంలోనికి తేవడం అనే విషయాన్ని శిల్పి త్రాసు - చిప్పలలో అద్భుతంగా చూపించాడు.

దక్షిణ ప్రాకారం మీద కూడ దక్షయజ్ఞ ధ్వంసమును చెక్కాడు. సూర్యచంద్రులు, తాటకవధ, పూతన వధ, దిక్పాలురు, రెండు ఏనుగులను గరుత్మంతుడు భక్షించడం, దశావతారాలు, గజేంద్రమోక్షము, క్షీరసాగర మథనము, శ్రీకాళహస్తి జన్మవృత్తాంతము, అర్జునుడు పాశుపతాస్త్రమునకై తపస్సు చేయుట, పంచముఖలింగం, విశ్వరూపం, వారాహమూర్తి చాలా బాగున్నవి. ఒక దగ్గర శివుడు నాట్యం చేస్తూంటే బ్రహ్మ, విష్ణువు, ప్రమథగణాలు, దేవతలు ఆనందంతో చూస్తున్నట్లు చాలా అందంగా చెక్కబడింది. ఒక భక్తుడు శివదర్శనం కోరి తన తలను ఖండించుకొనడం, వినాయకుడు పిల్లనగ్రోవినూదటం, శిబి చక్రవర్తి కథ, హంసలు, ఏనుగులు శివుని పూజించడం చాలా అందమైన శిల్పాలు. ఇక్కడ శివ సంబంధితములేకాక విష్ణులీలా చిత్రాలు కూడా నున్నవి. గోపికా వస్త్రాపహరణం, పెద్ద బాకాలు ఊదుతున్న వాద్యగాండ్రు, కొన్ని ఒంటెలు, రెండు, మూడు మైథున చిత్రాలు, ఒక నాగబంధం శిల్పములు అద్భుతంగా చెక్కబడ్డాయి. ఉత్తరపు ప్రాకారము గూడ అద్భుత శిల్పాలతో నింపబడింది. రెండు తలలు గల గండభేరుండ పక్షి, 22 చేతులతో నున్న పక్షి ఆకారము, మహిషాపుర మర్దిని, వేటలో నున్న బోయ దంపతులు.

పడమటి ప్రాకారం ఉత్తరపు కొనమీద పదిచేతులు గల వీరభద్రమూర్తి, పెద్ద పులి, కొండచిలువల పోరాటం, ఒక కోటి ఈతచెట్టుపై కూర్చుని కల్లుత్రాగటం, కొన్ని శక్తిమూర్తులు, జీబ్రాలు, సర్పములు, నంది విగ్రహాలు అద్భుతంగా చెక్కబడ్డాయి. ఉచ్ఛిష్ట గణపతి, పులిని తన కొమ్ములతో ఒక దున్న చంపడం, మూడు శరీరాలకు ఒక తల, ఒక లేడికి రెండు తలలు వంటి విచిత్ర శిల్పాలు - ఎన్నని చెప్పను? ప్రతి వారూ చూసి తీరవలసిన అద్భుత క్షేత్రం ఈ శ్రీశైలం.

## నందీశ్వర ప్రార్థన


శ్లో॥ ధర్మశ్చతుష్పాత్ యజ్ఞస్త్వం - స్వర్ణశృంగః త్రయీ వపుః
గోపతే వాహరూప స్త్వం - శూలినః త్వాం నమామ్యహమ్ ॥

శ్లో॥ నందీశ్వర నమస్తుభ్యం - సాంబానందప్రదాయక
మహాదేవస్య సేవార్థం - అనుజ్ఞాం దాతుమర్హసి ॥

(శివ దర్శనానికి ముందు నందీశ్వరుని ప్రార్థించుకోవలెను.)

# 3. మహాకాళేశ్వర జ్యోతిర్లింగము

## (ఉజ్జయిని, మధ్యప్రదేశ్)



ఉజ్జయిని

శ్లో॥ అవంతికాయాం విహితావతారం
ముక్తిప్రదానాయ చ సజ్జనానాం ।
అకాల మృత్యోః పరిరక్షణార్థం
వందే మహాకాల మహాసురేశమ్ ॥

**భావము:** అకాల మృత్యువు నుండి రక్షించి సజ్జనులకు ముక్తినిచ్చుటకు అవంతీ నగరము (ఉజ్జయిని)లో అవతరించిన మహాకాలుడను పేరు గల దేవదేవునకు నమస్కరిస్తున్నాను. (ఇక్కడి అమ్మవారు మహాకాళి.) ఇది అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటి -సతీదేవి మోచేయిపడిన చోటు)

**పురాణగాధ:** మాళవ దేశంలోని అవంతీ (నేటి ఉజ్జయిని) నగరం శిప్రా నది ఒడ్డున వుంది. భారతదేశంలోని మోక్షదాయకములైన ఏడు నగరాలలో ఈ అవంతీనగరం ఒకటి.

"అయోధ్యా మధురా మాయా కాశీ కాంచే అవంతికా ।
పురీ ద్వారవతీ చైవ సప్తైతే మోక్షదాయకాః ॥

అనే పురాణ వచనం వలన ఈ అవంతిక నగరం మోక్షదాయకమని తెలుస్తుంది. స్కాంద పురాణంలోని అవంతీ ఖండం ఈ నగరం గొప్పదనాన్ని యెంతగానో వివరించింది. శివపురాణంలోను, మహాభారతంలోను ఈ అవంతీ (ఉజ్జయినీ)నగర మహిమ యెంతగానో వివరింపబడింది. ఇక్కడి శిప్రా (క్షిప్రా) నదీస్నానం అన్ని పాపాలనూ నశింపజేస్తుందనీ అష్టదరిద్రాలు దూరమైపోతాయని పురాణాలలో చెప్పబడింది. శ్రీకృష్ణుడు, బలరాముడు, కుచేలుడు సాందీపని వద్ద చదువుకున్నారని భాగవతం చెప్తోంది. ఆ సాందీపుని ఆశ్రమంలో ఈ నగరంలో శిపా నది ఒడ్డున వుంది. చరిత్ర ప్రసిద్ధిగన్న విక్రమాదిత్య మహారాజు ఈ ఉజ్జయినీ నగరాన్ని రాజధానిగా జేసుకొని పరిపాలించాడు. ఇతని సోదరుడు 'భట్టి' మంత్రిగా, మరొక సోదరుడు భర్తృహరి విరాగియైన మహా పండితుడుగా, కాళిదాసాది మహాకవులు అతని ఆస్థాన నవరత్నాలుగా చరిత్ర ప్రసిద్ధము. ఈ భట్టివిక్రమార్కుల చరిత్రకథలుగా దేశమంతా చెప్పుకొంటూ వుంటారు. ఈ నగరానికి గల ప్రసిద్ధి అది.

విక్రమాదిత్యుని కాలంలో వరాహమిహిరాది జ్యోతిశ్శాస్త్రవేత్తలు ఆ శాస్త్రాన్నెంతో అభివృద్ధి చేశారు. గ్రహాది నభోరాసుల పరిశీలనకనువుగా ఒక నక్షత్రశాలనే ఉజ్జయిని



లో నిర్మించేరు. భారతీయ జ్యోతిశ్శాస్త్రమున కాయువు పట్టైన 'దేశాంతర శూన్యరేఖ' ఉజ్జయిని నుండే ప్రారంభమైనది. జ్యోతిశ్శాస్త్రంలో సున్నా డిగ్రీగా పరిగణించేది ఆ ఉజ్జయినీ - లంకారేఖయే.

ఉజ్జయినీ నగరనివాసము శిప్రా (క్షిప్రా/ఛిప్రా) నదీస్నానము, మహాకాళేశ్వర ధ్యానము / దర్శనము, అక్కడ మరణించుట సర్వపాపహరమనీ, అష్టైశ్వర్యప్రదమనీ, మోక్షప్రదమనీ స్కాందపురాణము అవంతికాఖండము 26వ అధ్యాయం 17, 18, 19 శ్లోకములలో వివరింపబడింది. ఇక పౌరాణిక గాధ -

ఒకప్పుడు ఉజ్జయినీ నగరంలో వేదవేదాంగవేత్త, నిత్యపార్థివశ్రీలింగ పూజా తత్పరుడు అయిన 'వేదప్రియుడు' అను బ్రాహ్మణుడు నివసిస్తూ వుండేవాడు-అతనికి 'దేవప్రియుడు, సుమేదసుడు, సుకృతుడు, ధర్మవాహుడు' అను నలుగురు కుమారులు కలిగారు. వారి సుగుణముల వలన ఉజ్జయినీ నగరమే బ్రహ్మతేజముతో కళకళలాడింది.

అయితే, ఉజ్జయినికిదగ్గరలో నున్న 'రత్నమాలా' అనే పర్వతమున 'దూషణుడు' అనే రాక్షసుడుండేవాడు. అతడు తపస్సుచేసి బ్రహ్మ నుండి వరములను పొందేడు. ఆ వర గర్వముతో దేవతలను ఓడించి పారద్రోలాడు. దౌర్జన్యంతో యజ్ఞాది క్రతువులను చేసేవారిని హింసించి యజ్ఞధ్వంసం చేసేవాడు. ప్రజలు వేదోక్త ధర్మాలను వదలి పెట్టారు. పుణ్యతీర్థములు నిస్సారములయ్యాయి. కాని ఉజ్జయిని (అవంతికానగరం) లో మాత్రం వైదిక ధర్మము చెడిపోలేదు. సిరిసంపదలతో కళకళలాడేది. దానిని ఆ రాక్షసుడు చూచి సహించలేకపోయాడు. దేవతలు, రాజాధిరాజులు నా ఆజ్ఞలను తల దాల్చుచుండగా ఈ ఉజ్జయినిలోని వారు పాటించడంలేదు. వారిని శిక్షించవలసినదే. వేదధర్మమును, పూజలను విడిచిపెట్టి నా శరణుకోరిన సరే లేకపోతే ఉజ్జయినివాసుల జీవితములు ముగిసినట్లే అని వారికి చెప్పిరండని నల్గురు మంత్రులను పంపించాడు. వారు ఉజ్జయినికి వెళ్ళి ప్రజలకు, వేదప్రియుని నలుగురు కొడుకులకు దూషణుని మాటలు చెప్పారు. కాని వారు దూషణుని మాటలను లెక్కచేయలేదు. భయపడలేదు.

దూషణుడు నగరమును దండెత్తకమానడని తలచిన ఉజ్జయిని నగరములోని బ్రాహ్మణులు, వేదప్రియుని కొడుకులు ప్రజలకు ధైర్యము చెప్పి, తాము పార్థివ శివ లింగమును నిర్మించి యధాశాస్త్రముగా, ఏకాగ్రచిత్తులై శివపూజ చేస్తున్నారు. ఆ దూషణాసురుడు తన సైన్యముతోవచ్చి వారినిచంపుడని తనసైనికుల నాజ్ఞాపించాడు. తానును బ్రహ్మహత్యకు తలపడి కత్తిచేతబట్టి వచ్చాడు. బ్రాహ్మణులను బాధపెడుతున్నాడు. అయినా వారు దీక్ష వదలక శివుని పూజిస్తూనే ఉన్నారు.

ఆ సమయమున పార్థివశివలింగ ప్రతిష్ఠ జరిగిన చోటున భయంకరమగు శబ్దముతో పెద్ద అఖాతము (గొయ్యి) యేర్పడింది. దానిలో నుండి మహేశ్వరుద్భవించి "ఓరీ దూషణా! నీవంటి దురాత్ములను, సాధుహింసకులను నశింపజేయడానికే మహా కాళరూపుడనై వచ్చాను" అని చెప్పి ఒక్క హుంకారముతో ఆ దూషణాసురుని, అతని సేనలను సంహరించాడు. చావగా మిగిలినవారు పారిపోయారు. శివసాక్షాత్కారము వలన రాక్షసుల బాధలుపశమించాయి. దేవతలు పుష్పవర్షము కురిపించారు. బ్రహ్మ,

విష్ణువు, ఇంద్రాదిదేవతలు వచ్చి మహాకాళేశ్వరుని పూజించారు. బ్రాహ్మణులు నమస్కరించారు. అపుడు శివుడు వరము కోరుకోమన్నాడు. అపుడు వారు 'మహా కాళేశ్వరా! నీవు యీ స్థలమున జ్యోతిర్లింగముగా వెలసి భక్తుల అభీష్టములను తీర్చుచు, వారికి మోక్షమును ప్రసాదింపుచుండుము' అని కోరారు.

ఇట్లు పరమేశ్వరుడు ఉజ్జయినిలో మహాకాలేశ్వరుడనే పేరుతో జ్యోతిర్లింగమై వెలసి భక్తుల కోరికలను తీరుస్తూ, చిత్తశుద్ధిని, ముక్తిని ప్రసాదిస్తున్నాడు.

సూతుని వలన పై గాథను వినిన సౌనకాది మునులు మహాకాళేశ్వరు నారాధించిన భక్తుల చరిత్ర చెప్పుమని అడిగారు. దానికి సూతుడిట్లు చెప్పుచున్నాడు.

"ఒకప్పుడు ఈ ఉజ్జయినీ నగరాన్ని మహాశివభక్తుడైన 'చంద్రసేనుడు' అనే రాజు పరిపాలించేవాడు. ఒకనాడు అతడు శివపూజలోనిమగ్నుడైయున్న సమయంలో శ్రీకరుడు అనే అయిదేండ్ల గోపబాలకుడు తన తల్లితో అక్కడికి వచ్చి రాజు చేస్తున్న పూజను చూశాడు. తను కూడా అలాగే శివుని పూజించాలనుకొని ఆ బాలుడు తిరిగి వచ్చుచు దారిలో దొరికిన ఒక గులకరాయిని తీసికొచ్చి దానినే శివలింగముగా భావించి దానికి అభిషేకము, చందన పుష్పాదులతో పూజను అతిశ్రద్ధగా చేస్తూండే వాడు. ఒకనాడా బాలుడు ధ్యానములో బాహ్య స్మృతిలేనంతగా నుండగా అతని తల్లి భోజనమునకు రమ్మని చాలాసార్లు పిలిచి, చివరకు విసిగిపోయి శివలింగమును, పూజాద్రవ్యాలను తీసిపారవేసి బాలుని బలవంతముగా భోజనమును తీసుకెళ్ళ బోయింది. కాని ఆ బాలుడు విలపిస్తూ శంభో! మహాదేవ అని ఎలుగెత్తి పిలవ సాగాడు. తల్లి చేయునది లేక ఇంటికి పోయింది. బాలుడట్లు ఆక్రందనము చేస్తూ మూర్ఛపోయాడు. శివుడు కరుణించి ఆ బాలుని పునర్జీవితుడిని చేశాడు. బాలుడు కనులు తెరిచేసరికి ఒక దివ్యమందిరము, అందు జ్యోతిర్లింగము కనపడగా బాలుడు మరింత సంతోషముతో శివుని స్తుతించాడు. తిరిగి బాలునికై వచ్చిన అతని తల్లి జరిగినదంతయు కనులారా చూచినదై బిడ్డడి నెత్తుకొని మైమరచింది. రాజైన చంద్ర సేనుడికీ విషయము తెలిసి వెంటనే వచ్చి బాలుని కొనియాడేడు. ఆ సమయమున అక్కడ హనుమంతుడు ప్రత్యక్షమై అక్కడ చేరిన భక్తులందరితో 'భక్తులారా! ఈ ప్రపంచమున పరమశివుని మించిన పరతత్త్వము ఇంకొకటి లేదు. మహర్షులు వేల సంవత్సరములు తపస్సు చేసినా పొందలేని మహాఫలమును ఈ బాలకుడు పొందేడు. ఇది ఆ దయామయుని కృపాఫలమే. మీరును ఈ భగవద్ద ర్శన పూజాదులతో కృతార్థులవండి. ఈ బాలకుని వంశమున ఇతనికి యెనిమిదవ తరము వాడుగా ఈ శ్రీకరుడను బాలకుడే నందగోపుడను పేరును తిరిగి పుడతాడు. అతని వాత్సల్యము ప్రేమలను పొందుటకు శ్రీమన్నారాయణుడు శ్రీకృష్ణుడిగా అవత రించి నానావిధ లీలలతో భక్తులనాదుకొంటాడు' అని చెప్పి అంతర్ధానమయ్యాడు. తర్వాత చాలాకాలం చంద్రసేన, గోపాలకులు శ్రీ మహాకాలుని పూజిస్తూ ముక్తిని పొందేరు" అని సూతుడు చెప్పేడు.

**చరిత్ర:** చైనా యాత్రికుడు 'హుయాన్‌త్సాంగ్' రచనలలోను, బాణుని కాదంబరి లోను, శూద్రకుని మృచ్ఛకటిక నాటకంలోను, కథా సరిత్సాగరంలోనూ, కాళిదాసుని కావ్యాల లోను, ఇంకా మరెన్నో సంస్కృత గ్రంథాలలో ఉజ్జయిని వైభవం వర్ణితమై



వుంది. విక్రమాదిత్యుడనే బిరుదును పొందిన చంద్రగుప్తుని తర్వాత మౌర్యులు, తర్వాత శుంగ వంశపు రాజులు, తర్వాత గుప్త వంశపురాజులు పరిపాలించారు. వారి తర్వాత హూణులు వారి తర్వాత (9వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకు) పరమార్ రాజులు పాలించారు. వీరి పాలనలో రాజధానిగా, సాహితీ కళా సంస్కృతులు అత్యంతాదరణ పొందినది. వీరిలో భోజరాజు చిరస్మరణీయుడు. వీరిలో చివరి వాడు శిలాదిత్యుడు. ఇతని తర్వాత ముస్లిములు (సుల్తానులు) తర్వాత మొగలాయీలు పాలించారు. 12-16 శతాబ్దాలమధ్య ఉజ్యయిని అనేక దాడులకు దోపిడీలకు నిలయమైంది.-సుల్తానుల పాలనలో దోపిడి పరాకాష్టకు చేరి నిత్యపూజా వైభవాలంతరించి పోయాయి.-1650లో రాజా సవాయిసింగ్ గవర్నర్‌గా నియమింప బడినాక అతడు శిధిలమైన దేవాలయాలను, నక్షత్రవేదశాలను పునరుద్ధరించాడు. 17వ శతాబ్దప్రారంభంలో మరాఠీల ఆధిపత్యంలోకి వచ్చింది. వీరు ఆలయాలను పునరుద్ధరించడమే కాక యెన్నో దేవాలయాలను నిర్మింపజేశారు. బహుముఖీ కళా కేంద్రంగా తీర్చిదిద్దారు. మరాఠీల తర్వాత సింధియాల పాలనలోకి వచ్చింది. 1809 వరకు రాజధానిగా నుండిన ఉజ్యయిని నుండి 1810లో దౌలత్‌రావు సింధియా రాజధానిని గ్వాలియర్‌కు మార్చాడు. ఆ తర్వాత సింధియాల నుండి బ్రిటీష్ వారి ఆధిపత్యంలోకి, స్వాతంత్ర్యం తర్వాత భారత ప్రభుత్వాధీనంలోకి వచ్చింది. -

## దర్శనీయ స్థలములు

1. మహాకాళేశ్వర మందిరం, 2. హరిసిద్ధిదేవి, 3. బడా గణేశ్, 4. గోపాల మందిరం 5. గఢ్ కాళికా, 6. భర్తృహరి గుహ 7. కాల భైరవుడు 8. సాందీపని ఆశ్రమం 9. సిద్ధవటము 10. మంగళనాథుడు 11. నక్షత్ర వేదశాల 12. శిప్రానది మొదలగునవి.

స్కాందపురాణములో ఉజ్జయినిగా పిలువబడే అవంతికాక్షేత్రములో శివలింగ ముల సంఖ్యాకంగా వున్నాయి. వాటిలో ముఖ్యమైనది 84. అవంతి కాఖండమున ఒక్కొక్క శివలింగము గూర్చి ఒక్కొక్క అధ్యాయము చొప్పున వర్ణింపబడింది. - ఇక దర్శనీయముల గూర్చి -

**1. శిప్రానది:** రైల్వేస్టేషన్ నుండి మైలున్నర దూరములో ప్రవహిస్తోంది. దీనిపై చక్కని కట్టడములతో ఘట్టములు (ఘాట్‌లు) ఉన్నాయి. వాటిలో నరసింహ, రామ, పిశాచమోచన, ఛత్ర, గంధర్వ ఘాట్‌లు ముఖ్యములు. ఈ ఘట్టములలో చక్కని భగవన్మందిరాలున్నాయి. గంధర్వఘాట్ తర్వాత నదిపై బ్రిడ్జి కట్టేరు-అవతలి గట్టున దత్తకా అఖాడా, కేదారేశ్వరము, రణజీత్ మందిరము, హనుమాన్ మందిరము వున్నవి. - మహాశ్మశానసమున కవతల వీరదుర్గాదాస్ రా ఠౌర్ ఛత్రి, ఆ తర్వాత ఋణ ముక్త మహాదేవక్షేత్రము ఉన్నవి.

**2. మహాకాళేశ్వరుడు:** ఈ మందిరము రైల్వే స్టేషన్‌కు మైలు దూరంలో ఉన్నది. మందిర ప్రాగంణము చాలా విశాలమైనది. ప్రాంగణము మధ్యలో మహాకాల మందిరము, దీనికెదురుగా పైభాగమున ఓం కాలేశ్వరుడు, అతని క్రింద మహా కాళేశ్వరుడు (రెండంతస్థులన్న మాట) - మహాకాళేశ్వరునికి ఒక వైపు గణేశుడు,

ఇంకొకవైపు కుమారస్వామి, మరొకవైపు పార్వతీదేవి వెలసియున్నారు. మందిరము పైభాగంలో దక్షిణమున గల మందిరములలో అనాది కాలేశ్వర, వృద్ధ కాలేశ్వర మందిరాలు విశాలమైనవి. మహాకాళేశ్వరమందిరానికి సమీపంలో ఒక సభా మండపము, దగ్గరలో కోటి తీర్థమనే సరోవరము, దాని సమీపమున చిన్నచిన్న శివఛత్రములు. దేవాస్ రాజ్యానికి చెందిన ధర్మశాల యున్నవి - సభా మండపంలో శ్రీరామమందిరం, దాని వెనుక అవంతికాపుర అధిష్ఠాన దేవతయైన అవంతికాదేవి మందిరములు యున్నవి - మహాకాళేశ్వర మందిర సమీపంలోనే బడాగణేశ మందిరమున్నది.- దానికి దగ్గరలో సప్తధాతుమయమైన పంచముఖాంజనేయుని మందిరము, ఇతర దేవతా మూర్తులు ఉన్నవి.

**3. హరిసిద్ధిదేవి:** రుద్ర సరోవరమునకు దగ్గరలో విశాలప్రాకారంతో హరిసిద్ధి దేవీ మందిరమున్నది. ఇది అవంతికా శక్తి పీఠము, విక్రమాదిత్యుడారాధించిన భవానీ ఈమెయే, గుజరాత్ లోని మూలద్వారకావల సముద్రతీర పర్వతశ్రేణిలో మరొకదేవి యున్నది. రెండును ఒకే ఆకారములో నుండుట విశేషము. ఇచటి దేవీ పీఠమున నున్నది శ్రీ చక్రము. దాని వెనుక అన్నపూర్ణా మందిరము, దాని తూర్పుద్వార సమీపమున చిన్నబావి, మధ్యలో స్తంభము, దగ్గరలో సప్తసాగరమనే సరస్సు, హరిసిద్ధి మందిరము వెనుక అగస్త్యేశ్వర మందిరము గలవు. మహాకాళ మందిరం నుండి ప్రధాన వీధికి వెళ్లుత్రోవలో 24 స్తంభముల మండపము (ప్రాచీన సింహ ద్వారా శిధిలావశేషము కావచ్చు) భద్రకాళీదేవి ఇచటనే వుంది.

**4. గోపాలమందిరం:** ఇది మధ్యవీధిలో వుంది. ఇందులో రాధా,కృష్ణ, శంకర మూర్తులున్నాయి. ఈ మందిరాన్ని రాజాదౌలత్ సింధియా భార్య బాయజాబాయి కట్టించింది.

**5. గఢకాలికా:** గోపాలమందిరం నుండి మార్గమున్నది. ఇది నగరానికి మైలు దూరంలో వుంది. మహాకవి కాళిదాసు ఈకాళిని ఆరాధించియే మహాకవి అయ్యాడు. ఈ కాళీమందిర సమీపంలో స్థిరగణేశ మందిరము, దానికెదురుగా ప్రాచీన హనుమన్మందిరము వున్నవి. అచట శ్రీమహా విష్ణుని విగ్రహము, దాని సమీపములో గౌరభైరవమూర్తి, దానికి దగ్గరలో ఛ్రిప్రాఘాటు, ఆతర్వాత మహాశ్మశానం ఉన్నాయి.

**6. భర్తృహరి గుహ:** మహాకాళీ దేవళమునుకుత్తరంగా రెండు ఫర్లాంగులదూరంలో భర్తృహరి గుహ, అతని సమాధి ఉన్నాయి. ఒక సందులో నుండి గుహలోకి ప్రవేశించ వలసియుండును.

**7. కాలభైరవ క్షేత్రము:** నగరంనుండి మూడు మైళ్ళదూరంలో శిప్రానది యొడ్డున ఒక దిబ్బపై కాలభైరవాలయమున్నది.

**8. సిద్ధవటము:** కాలభైరవ క్షేత్రమునకు తూర్పుభాగమున శిప్రానది అవతలి యొడ్డున సిద్ధవటమును ప్రసిద్ధస్థానమున్నది. ఇక్కడి వటవృక్షము మొదట్లో నాగబలి, నారాయణబలి మొ॥ సమర్పించి సిద్ధవటము నారాధిస్తారు.

**9. సాందీపని ఆశ్రమం** (అంకపదము): గోపాలమందిరము నుండి రెండు మైళ్ళ దూరంలో మంగళనాథ క్షేత్రమునకు వెళ్ళుత్రోవలో వున్నది. దీనికి దగ్గరలో విష్ణు



సాగరము, పురుషోత్తమ సాగరము వున్నాయి. చిత్రగుప్తుని ప్రాచీన స్థానమిచటనే యున్నది. సాందీపని ఆశ్రమమున కావల జనార్దనమందిరమున్నది.

**10. మంగళనాథక్షేత్రం:** అంకపదము (సాందీపని ఆశ్రమము) నకావల దిబ్బపై మంగళనాథ మందిరమున్నది. భూదేవి కుమారుడైన అంగారకుడు (కుజుడు) ఇక్కడే జన్మించాడని పురాణాలు చెప్తున్నాయి. ఇక్కడ ప్రతి మంగళవారం విశేషపూజలు జరుగుతాయి.

**11. నక్షత్ర వేధశాల** (యంత్ర మహల్): ఇది శిప్రానది దక్షిణ తీరమున ఇపుడు జీర్ణావస్థలో వుంది. అందలి యంత్రములు నేటికినీ కొన్ని ఉపయోగిస్తాయి.

పై స్థలములు కాక ఇంకాయెన్నో శివాలయాలు, శక్తి ఆలయాలు, తీర్థములు (చెరువులు మొదలగునవి) భైరవాలయాలు, రుద్రక్షేత్రాలు ఉన్నాయి. అన్నీ వివరంగా చెప్పాలంటే ప్రత్యేకంగా ఒక పుస్తకమే వ్రాయవచ్చు. స్కాంద పురాణవచనములబట్టి

"శ్మశానమూషరం క్షేత్రం పీఠంతు వసమే వచ ।
పంచైకత్ర నలభ్యంతే మహాకాళవనాదృతే ॥" - అనగా

"మహాశ్మశానం, ఊషరక్షేత్రము, శక్తిపీఠము, మహాకాననము, మహాకాళేశ్వరం అను నీయైదును దేవదుర్లభములని భావము. (ఇచట మరణించిన వారికి తిరిగి జన్మ ముండదు కావున ఇది ఊషరక్షేత్రమని, పాపాలను నశింపజేస్తుంది కావున క్షేత్రమనీ, మహాశ్మశానమనీ, మహాకాళవనమనీ, మోక్షప్రదమైనదని ఉజ్జయిని పేరొందింది.

## 4. ఓంకారేశ్వర జ్యోతిర్లింగము - (అమరేశ్వరుడు)

### ఓం కార్, మధ్యప్రదేశ్




శ్లో॥ కావేరికా నర్మదయోః పవిత్రే
సమాగమే సజ్జన తారణాయ ।
సదైవ మాంధాతృ పురే వసం తం
ఓంకార మీశం శివమేక మీడే ॥

**భావము:** "కావేరీ, నర్మదానదులు సంగమించు ప్రాంతంలో మాంధాత (షోడశ మహారాజులలో ఒకడు) నిర్మించిన పట్టణములో సజ్జనులను తరింపజేయడానికై నివసించియున్న ఓంకారేశ్వర నామధారుడైన శివుని పొగుడుతాను". (ఓంకారేశ్వరుని భార్య ఓంకారేశ్వరి-అమరేశ్వరుని భార్య అన్నపూర్ణాంబ-నర్మదానదికి రెండు వైపులా నున్న ఈ రెండు లింగాలూ దర్శనీయములు.)

**పురాణగాథ:** ఒకప్పుడు నారదుడు శివుని ఆరాధించడంకోసం గోకర్ణ క్షేత్రానికి వెళ్ళి తిరిగివస్తూ వింధ్య పర్వతం దగ్గరకు వచ్చాడు. వింధ్య పర్వతుడు నారద మహర్షికి స్వాగతం చెప్పి "నేను పర్వతరాజును, సర్వ సంపన్నుడను, ఏవిషయంలోను లోపం లేదు" అని గర్వంగా పలికాడు. అపుడు నారదుడు అతని గర్వమునణపదలచి, "మేరువుతో పోలిస్తే నీవెంతటి వాడవు" అని ఈసడించాడు. - అపుడు వింధ్యుడు బాధపడి "ఓంకార, క్షేత్రమునకు వెళ్ళి అక్కడ ఒక పార్థివ లింగాన్ని నిర్మించి ఏకదీక్షతో శివునికై తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై వరము కోరుకోమన్నాడు. ఈ తపస్సుతో అతని అహంకారము నశించింది. అపుడతడు 'పరమేశ్వరా ! నా బుద్ధి యెల్లప్పుడు ప్రసన్నముగా నుండునట్లు వరమిచ్చి, నీవు యెల్లప్పుడు నా శిరస్సుపై నిలచి యుండుము' అని కోరాడు. శివుడు తథాస్తు అన్నాడు. దేవతలు శివుని స్తుతిస్తూ జ్యోతిర్మయి రూపంతో స్థిరంగా వుండమని కోరారు. పార్థివాకారంలో అమలేశ్వరుడు / అమరేశ్వరుడు అను రెండు పేర్లతో అక్కడ ఆవిర్భవించాడు. ఈ రెండు లింగాల రూపంతో నున్న శివుడు ఒకే జ్యోతిర్లింగముగా భావించాలి.

ఈ క్షేత్రంలో నర్మదానది 'నర్మద, కావేరి' అను రెండు పాయలుగా ప్రవహిస్తోంది. ఈ రెండు పాయల నడుమ ఉన్న ప్రదేశాన్ని 'మంధాతృపురి, శివపురి అనే పేర్లతో పిలుస్తారు. కారణమేమిటనగా-ఒకప్పుడు సూర్య వంశపు రాజైన 'మాంధాత' యను నతడు ఈ పర్వతముపై చాలా సంవత్సరాలు తపస్సు చేసి, శివుని ప్రసన్నుని చేసుకొని స్వామికి దేవాలయాన్ని నిర్మించాడు. అందుచే దీనికి మాంధాతృ పురి అనే పేరు వచ్చింది. మాంధాత కట్టించిన శివాలయము, ఇతరాల యాలను ఆకాశం నుండి చూస్తే ఓంకార రూపంలో కన్పిస్తాయి. అంచేత ఓంకారేశ్వరుడని, భక్తుల మలినములను తొలగిస్తుంది కనుక అమలేశ్వరుడని పేర్లు వచ్చాయి.

శ్లో॥ అమరాణాం శతైశ్చైవ సేవితోహ్యమలేశ్వరః ।
తథైవ ఋషిసంఘైశ్చ తేన పుణ్యతమో మహాన్ ॥
(స్కాందపురాణం - రేవాఖండం - 28 అధ్యాయం)

**భావము:** ఈ క్షేత్రమున వెలసిన అమలేశ్వరుడు/అమరేశ్వరుడు ముక్కోటి దేవతల చేతను, ఋషి సంఘముల చేతను అనాదికాలము నుండి ఆరాధింపబడుచుండుట చేత పవిత్రతముడై అలరారుచున్నాడు.

**చరిత్ర:** ఎక్కువగా చరిత్రాంశాలేవీ ప్రాచుర్యంలో లేవు. సూర్య వంశ చక్రవర్తి మాంధాత ఇక్కడ తపస్సు చేసి ఆలయం నిర్మించడంచేత మాంధాతృపురి అనే పేరు వచ్చిం దంటారు. ఈ క్షేత్రము మౌర్యులు, గుప్తులు, పరమార్ రాజుల పరిపాలనలో యెంతో దివ్యంగా వెలుగొందింది. మహమ్మద్ ఘజినీ విధ్వంసం చేసిన శివాలయా లలో ఇది రెండవది. (మొదటిది సోమనాథ్) - పరమార్ రాజుల తర్వాత ఈ క్షేత్రం ముస్లిముల దండయాత్రల వలన శిధిలావస్థకు చేరుకొంది. తర్వాత మరాఠాల ఆధిపత్యంలో తిరిగి పునరుద్ధరింపబడింది.

**దర్శనీయ స్థలములు:** కోటీ తీర్థము, కోటేశ్వర, హాటకేశ్వర, త్ర్యంబకేశ్వర, గాయత్రీశ్వర, గోవిందేశ్వర, సావిత్రీశ్వర, భూరీశ్వర, శ్రీకాళికా, పంచముఖ గణేశ్వర, ఓంకారేశ్వర, శుకదేవ, మాంధాత్రీశ్వర, మనోగణేశ్వర, శ్రీద్వారకాధీశ్వర, నర్మదేశ్వర, మహాకాళేశ్వర, వైద్యనాథేశ్వర, సిద్ధేశ్వర, రామేశ్వర, జాలేశ్వర, విశల్యేశ్వర, అంధ



కేశ్వర, ఋణమకేశ్వర, నమగ్రహేశ్వర, శ్రీమారుతిరాయ, సాక్షిగణేశ్వరులు, అన్నపూర్ణాంబా, తులసీదేవి మూర్తులు చూడదగినవి. తరువాత అవిముక్తేశ్వరము, దరియాయనాథ గద్దీ, వటుక భైరవుడు మంగళేశ్వరుడు, నాగచంద్రేశ్వరుడు, దత్తాత్రేయుడు, కాల-గౌరభైరవులు, శ్రీరామమందిరము, అక్కడకు దగ్గరలోగల గుహలో గల ధృష్ణేశ్వరుడు, నర్మదాదేవి చూడదగినవి. శ్రీచక్రేశ్వరుడు, గోదంతేశ్వరుడు, మల్లికార్జునుడు, త్రిలోచనేశ్వరుడు, గోపేశ్వరుడు, అమలార్జునేశ్వరుడు, ఋణముక్తేశ్వరుడు, గౌరీ సోమనాథ విశాల లింగమూర్తి (ఇతనిని మామాభాంజా అంటారు)నందీశ్వర, గహేశ్వర, హనుమంతులు, అన్నపూర్ణ, మహిషాసురమర్దిని, సీతారసోయీ, ఆనంద భైరవుడు, దుర్గా భవాని, శ్రీదేవి, సిద్ధనాథ, కుంతీమాతృ దేవతలు, భీమార్జునులు, భీమశంకరుడు, కాలభైరవుడు, శ్రీమన్నారాయ ణుని 24 మూర్తులు, పశుపతి నాథుడు, గదాధరుడు, లాటభైరవగుహలో కాళేశ్వరం, 56 భైరవులు, కల్పాంత భైరవుడు, ఓం కారేశ్వరుడు దర్శించదగును. గోకర్ణేశ్వరుడు, మహాబలేశ్వరుడు, ఇంద్రేశ్వరుడు, వ్యాసేశ్వరుడు, అమరేశ్వరుడు, వృద్ధకాళేశ్వర, బాగేశ్వర, ముక్తేశ్వర, కర్దమేశ్వరములు తిలభాండేశ్వరుడు ఆరాధనీ యులు. కార్తికేయుడు, అఘోరేశ్వర గణపతి, బ్రహ్మేశ్వర, లక్ష్మీనారాయణ, కాశీవిశ్వేశ్వర, శరణేశ్వర, కపిలేశ్వర, గంగేశ్వర, విష్ణు, వరుణేశ్వర, నీలకంఠేశ్వర, కర్దమేశ్వర, మూర్తులు, శిలామార్కండే యీశ్వరుడు, గౌరీ సోమనాథుడు, సిద్ధేశ్వర మందిరములు చూడదగినవి. కుబేరభాండారీ, శంకరమందిరం, చ్యవన మహర్షి ఆశ్రమం, వారాహీ, చాముండా, బ్రహ్మాంశీ, వైష్ణవీ, ఇంద్రాణీ, కౌమారీ, మహేశ్వరీ అను సప్తమాతృకలు, సీతా వాటికలోని 64 యోగినీ గణములు, 84 భైరవమూర్తులు, సీతా కుండము, రామకుండము, లక్ష్మణ కుండము చూడదగినవి.

## 5. వైద్యనాథ జ్యోతిర్లింగము

**ధోన్‌కు 2 మైళ్ళ దూరం (ఉత్తర ప్రదేశ్) (ప్రజ్వల్యా నగరము అని క్షేత్రం పేరు)**




శ్లో॥ పూర్వోత్తరే ప్రజ్వలికా నిధానే,
సదావసంతం గిరిజా సమేతం ।
సురాసురా రాధిత పాదపద్మం,
శ్రీ వైద్యనాథం తమహం నమామి ॥

**భావము:** తూర్పు - ఉత్తరముల మధ్యయైన ఈశాన్యపు దిక్కున "ప్రజ్వల్య" అనే చోట యెల్లప్పుడూ పార్వతీదేవితో నివసిస్తూ, దేవతలు - రాక్షసులచేత పూజింపబడు పాద పద్మములు గల శ్రీవైద్యనాథునకు నమస్కరిస్తున్నాను.

(ఇక్కడి దేవి - జయదుర్గాత్రిపుర సుందరీదేవి - ఇది అష్టాదశశక్తి పీఠాలలో ఒకటి - దీనిని సతీదేవి హృదయము పడినచోటంటారు.)

**పురాణగాథ:** త్రేతాయుగంలో రావణాసురుని తల్లి 'కైకసి' ఒకనాడు సముద్రపు ఒడ్డున ఇసుకతో శివలింగము (సైకత లింగము) ను చేసి పూజిస్తూవుండగా సముద్ర కెరటాలు ఆలింగాన్ని ముంచి కొట్టుకొని పోవునట్లు చేశాయి. అందుకామె చాలా విచారంగా ఇంటికి తిరిగి వచ్చింది. ఆమె పట్ల బాధపడుతూ వుండటాన్ని చూసిన రావణుడు తల్లిని కారణమడుగగా ఆమె జరిగినదంతా చెప్పింది. దానికి రావణుడు 'సైకత లింగము పాడయినదని విచారిస్తున్నావా? చూడు ఆ పరమేశ్వరుడినే యిక్కడకు తీసుకువస్తాను' అని చెప్పి ఈశ్వరుని గూర్చి హిమాలయాలలో ఘోర తపస్సు చేశాడు. ఎంత కాలము గడచినా శివుడు ప్రత్యక్షము కాకపోవుటచే రావణుడు మరింత దీక్షగా శివుని పూజిస్తూ నైవేద్యముగా తన పది తలలలో ఒక్కొక్క తలను ఖండించి సమర్పించడం మొదలుపెట్టాడు. చివరకు పదియవ తలను కూడ ఖండించబూనగా శివుడు ప్రత్యక్షమై రావణుని పూర్వము వలెనే తొమ్మిది తలలను వాటి స్థానములలో అమర్చి, యేదేని ఒక వరము కోరుకొమ్మని అనుగ్రహించాడు. దానికి రావణుడు శివుని తనతో లంకానగరమునకు వచ్చి నిత్యము తను, తనవారు పూజించుకొనే అవకాశమును కల్పించమని కోరాడు. అపుడు శివుడు తన ఆత్మ లింగమును రావణునకిచ్చి "రావణా! ఇది గొప్ప మహిమగలది. సర్వాభీష్ట ఫలము లను యిస్తుంది. దీనిని నీవు లంకలో నుంచి పూజించుకొనుము. అయితే దీనిని నీవు తీసుకు వెళ్ళునపుడు మధ్యలో యెక్కడను భూమిపై పెట్టరాదు సుమా! ఒకసారి భూమిపై పెట్టబడినచో అది అక్కడనే ప్రతిష్ఠింపబడుతుంది. జాగ్రత్త సుమా! అని చెప్పి మాయమయ్యాడు.

రావణుడు ఆ లింగమును చేతులలో పెట్టుకొని లంకకు ప్రయాణమయ్యాడు. ఈ విషయం దేవతలకు తెలిసి చాలా భయపడ్డారు. వారు గణేశుని వద్దకు వెళ్ళి 'రావణుడు యెట్టి వరములు లేకుండానే ప్రజలను, మునులను, దేవతలను రకరకములుగా బాధిస్తున్నాడు. ఇక ఈ శివుని ఆత్మలింగమును లంకకు తీసుకువెళ్తే అతని ఆగడములకు అడ్డు వుండదు. కాబట్టి అతడు దానిని లంకకు తీసికొని వెళ్ళకుండా చూడమని' ఎన్నో విధాలుగా ప్రార్థించారు.

విఘ్నేశ్వరుడు సరేనని రావణుని అనుసరిస్తూ సమయం కోసం చూస్తున్నాడు. ఇంతలో సాయం సమయమయ్యింది. రావణుడు త్రికాలసంధ్యా వందనాన్ని నియమములను తు.చ. తప్పక పాటించు నిష్ఠాగరిష్ఠుడవడం చేత సాయంకాల సంధ్యావందనము చేయవలెననీ, తన చేతిలోనున్న శివలింగమును క్రిందపెట్టరాదనీ విఘ్నేశ్వరుడు సరేనని రావణుని అనుసరిస్తూ సమయం కోసం చూస్తున్నాడు. ఇంతలో సాయం సమయమయ్యింది. రావణుడు త్రికాల సంధ్యానందనాది నియమ ములను తుచ తప్పక పాటించు నిష్ఠా గరిష్ఠుడవడం చేత సాయంకాల సంధ్యా వందనము చేయవలెననీ, తన చేతిలో నున్న శివలింగమును క్రిందపెట్టరాదని



శివుడాజ్ఞాపించాడు. కాబట్టి దానిని యెవరి చేతిలోనైనా పెట్టితాను సంధ్యవార్చు కుందామనే ఉద్దేశంతో అటునిటు చూడసాగాడు. ఇట్టి అవకాశం కోసం యెదురు చూస్తున గణేశుడు గోపబాలకుని రూపంలో రావణునకు కన్పించాడు. అపుడు అతడు ఆ గోపబాలుని చేతిలో ఆ శివలింగము నుంచి, తాను సంధ్యావందనముల చేసి వచ్చువరకు దానిని భూమిమీద పెట్టకుండా జాగ్రత్తగా పట్టుకొనమని చెప్పి నదిలోనికి దిగాడు. రావణుడు సంధ్యావందనమున నిమగ్నుడైయున్న సమయము చూచి, అదే సరైన టైముగా భావించి గోపబాలుని రూపములో నున్న విఘ్నేశ్వరుడు 'అయ్యో! ఈ లింగము క్షణక్షణానికీ బరువైపోతోంది. దీనిని నేను మోయలేకపోతున్నాను. వేగంగా రావయ్యా'అంటూ అరవడం మొదటుపెట్టాడు. రావణుడు ఆతురతగా వస్తున్నాడు అతడలా దగ్గరకు వస్తున్న కొలదీ, బరువును అతికష్టంగా మోస్తున్నట్లు నటిస్తూ ఇక మోయలేక వదలివేసినట్లు ఆ శివలింగాన్ని భూమిపై పెట్టేశాడు వినాయకుడు. చాలా విచారించాడు రావణుడు. అయినా బలగర్వముతో ఆ లింగాన్ని తిరిగి భూమినుండి పెకలించ డానికి యెంతో ప్రయత్నించాడు. భూమి కదలబారిందే కాని శివలింగము ఒక్క అంగుళము కూడా పైకి లేవలేదు. అయినా పట్టువిడువకుండా ప్రయత్నిస్తూనే వున్నాడు. రావణుని శరీరమంతా గాయాలతో రక్తసిక్తమయ్యింది. అపుడు అశరీర వాణి "రావణా! శివాజ్ఞను నీవు మీరగలవా! ఈ లింగాన్ని నీవు పెకలించలేవు. వృథాప్రయాసమాని, ఈ లింగమును పూజించి నీ గాయముల నుండి విముక్తి పొందుము అని పలికింది. ఇక చేయునది లేక రావణుడు ఆ లింగమును అర్చించి తన గాయములను పోగొట్టుకొని స్వస్థుడై లంకకు తిరిగిపోయాడు. తర్వాత బ్రహ్మాది దేవతలందరూ అక్కడకు వచ్చి ఆ జ్యోతిర్లింగమునకు అభిషేకాది అర్చనలు చేశారు.

రావణుడికి గాయములను మాన్పి స్వస్థతచేకూర్చిన కారణంగా ఆనాటినుండీ ఆశివలింగమునకు 'వైద్యనాథ' లింగమని పేరు వచ్చింది. ఈ లింగమును పూజించిన వారికి సకల వ్యాధులనుండి విముక్తి లభించి భోగభాగ్యములు, మోక్షములు కలుగుతాయి.

పురాణకాలంలో చితాభూమిగా ప్రసిద్ధి పొందిన ఈ క్షేత్రము ఈనాడు వైద్యనాథ్‌గా బైద్యనాథ్‌ధామ్(దేవఘర్)గా పిలువబడుతున్నది. ఇది జార్ఖండ్ రాష్ట్రంలో జస్పిడి అను రైల్వేస్టేషనుకు 6 కి॥మీ॥ దూరంలో వుంది. వైద్యనాథ్ లింగము పేరుతో 1. మహారాష్ట్రలోని పర్లీగ్రామంలో ఒకటి, 2. నాందేడ్‌కు 20కి॥మీ॥ దూరంలో గంగాఖేడ్ దగ్గర ఒకటి, 3. పంజాబ్ రాష్ట్రంలో 'కీర' గ్రామంలో ఒకటి, 4. హిమాచల ప్రదేశ్‌లో పఠాన్‌కోటకు 155కి॥మీ॥ దూరంలో ఒక లింగము వున్నాయి. ఇవన్నీ వైద్యనాథ్‌గా పిలువబడడమేకాక, అన్నిచోట్లను స్థలపురాణముగా పైపురాణగాథనే చెప్పబడుతోంది.

రావణుడు హిమాలయముల నుండి ఈశ్వరుని ఆత్మలింగమును తీసికొని లంకకు వస్తూండగా కర్ణాటకలోని గోకర్ణ క్షేత్రము వద్ద విఘ్నేశ్వరుని వలన భూస్థాపిత మయ్యిందని అక్కడి వారు చెప్తారు. అక్కడి ఆ శివలింగమునకు గోకర్ణేశ్వరుడని, పార్వతికి తామ్రగౌరి అని పేర్లు.

**చరిత్ర:** ఈ క్షేత్రము మౌర్యసామ్రాజ్యంలోను, గుప్తసామ్రాజ్యంలోను ఒక భాగంగా వారి సేవలను పొందింది. తర్వాత పాలరాజులు, మొగలు చక్రవర్తులు, బీహార్, బెంగాల్ నవాబుల పాలనలో నుండేది. చారిత్రకంగా చెప్పుకోదగిన విశేషాలు లేవు.

## దర్శనీయ స్థలాలు

ఈ ఆలయ ప్రాంగణంలో చాలా గోపురశిఖరాలున్నాయి. చుట్టూ ప్రహరీ గోడవున్నది. ఈ దేవాలయ గర్భగృహన్ని విశ్వకర్మ నిర్మించాడని అంటారు. దేవాలయ ప్రక్కనున్న కోనేరు "శివగంగ"లో స్నానము రోగనివారకమని భక్తుల విశ్వాసము. ఇక్కడి పార్వతీ ఆలయం, దుర్గామందిర్ (నవదుర్గాలయం), బైజభక్తి మందిర్, అను కూర్‌ఠాకూర్ ఆశ్రమం, విద్యాపీఠ్ చూడదగినవి. ఇది దేవఘర్, అని కూడపిలువబడు తోంది. ఇది 'రాంచీ'కి 26 కి॥మీ॥లోను, ధన్‌బాద్‌కు 10 కి॥మీ॥లోను వుంది. రాష్ట్రంలోని పలు నగరాల నుండి బస్సు సౌకర్యమున్నది. ఈ వైద్యనాథాలయం ప్రాకారంలో 21మందిరాలున్నాయి. 1. గౌరీమందిరము (శక్తిపీఠము-శ్రీజయదుర్గా త్రిపుర సుందరీ విగ్రహాలు) 2. కారికేయ మందిరము (మదనమోహన, కార్తికేయ విగ్రహములు) ఈ మందిరములుగాక ఇంకనూ గణపతి, బ్రహ్మ, సంధ్యాదేవి, భైరవకాల, హనుమ, మనసాదేవి, సరస్వతి, సూర్య, బగళాదేవి, శ్రీరామ, ఆనంద భైరవ, గంగా ద్వార, మాసిక వేదిక, హరగౌరీ, కాళికా, అన్నపూర్ణా, చంద్ర కూప, లక్ష్మీనారాయణ, నీలకంఠమహాదే మందిరములున్నవి.

### ఇక మహారాష్ట్రలోని పరలీవైద్యనాథుడు :

'పరల్యాం వైద్యనాథంచ' అను పాఠము ననుసరించి దీనిగూర్చి కూడ ఇక్కడ చెప్పబడుతున్నది. పరలీవైద్యనాథము ఒకమంచి నగరము పర్లీ రైల్వేస్టేషను నుండి 2కి॥మీ॥ దూరంలో వైద్యనాథస్వామి ఆలయమున్నది. స్టేషన్ నుండి ఆటోలలో ప్రయాణించవచ్చు. ప్రధానాలయానికి తూర్పుముఖంగా, ఉత్తరముఖంగా ద్వారాలు వున్నాయి. లింగము తూర్పు ముఖంగా వుంది. ఉత్తరద్వారము ప్రవేశద్వారము. సామాన్లు భద్రపరచుగది, పూజాసామగ్రి, పుస్తకములషాపులు, కళ్యాణమండపములు, వసతిసదుపాయాలు, ఉచితభోజన సదుపాయాలు ఇక్కడ లభిస్తాయి. స్వామివారి కెడమవైపున పార్వతీదేవి, తాబేలు మండపంలోని గణపతి, అనేక శివలింగాలు, నాగరాజు, గాయత్రీదేవి, కోనేరు. అక్కడ శివలింగాలు చూడదగినవి. మహాశివ రాత్రికి, విజయదశమికి ఉత్సవాలుజరుగుతాయి. ఉత్తరద్వారంబయట శనిమందిరం, ఆదిశంకరాచార్యుల ప్రతిమ, అయ్యప్పస్వామి ఆలయం, బాలజీ మందిరం, చూడ దగినవి. ఆలయంలోను, బయట ప్రాంతాలలోను దొంగభయ మెక్కువ భక్తులు జాగ్రత్తగా నుండవలెను. పర్లీ వైద్యనాథ్ రైల్వేస్టేషన్‌కు దగ్గరలో గల బస్‌స్టాండు నుండి పర్భనీ, నాందేడ్, జౌండా మొదలగు ప్రదేశాలకు బస్సు సదుపాయాలున్నాయి. ఔండా నాగనాథ్‌లోని నాగనాథలింగము కూడా ఒక జ్యోతిర్లింగముగా మహారాష్ట్రులచే చెప్ప బడుతోంది. గుజరాత్‌లోని ద్వారకలో గల నాగనాథ (నాగేశ్వర) లింగమే జ్యోతిర్లింగ మని స్తోత్రములో వర్ణింపబడినది.



# 6. భీమశంకర జ్యోతిర్లింగము

(ఢాకినీ - మహారాష్ట్రలోని ఖేడ్ ప్రాంతం)




శ్లో॥ యం ఢాకిని శాకినికా సమాజైః
నిషేవ్యమాణం పిశితాశనైశ్చ ।
సదైవ భీమాది పద ప్రసిద్ధం
తం శంకరం భక్తహితం నమామి ॥

**భావము:** మాంసమును తినే ఢాకిని శాకినీ సమూహములు చేత సేవింపబడుతూ, భీముడు (లేక భయంకరుడు) అను పేరుతో ప్రసిద్ధుడైనా, భక్తులకు శుభములను కలిగించు శంకరునకు నమస్కరిస్తున్నాను. (ఇక్కడి అమ్మవారిని బ్రహ్మ కమలముతో పూజించుట చేత "కమలజ" అని పిలువబడుతోంది.)

**పురాణగాథ:**

ప్రస్తుత పూనా నగరమునకు సుమారు 100 మైళ్ళ దూరములో గల సహ్యా పర్వత మండలి ఢాకినీ శిఖర ప్రాంతమున పూర్వము కర్కటుడనే రాక్షసుడు పుష్కసి అను పేరు గల తన భార్యతో నివసిస్తూ వుండేవాడు. వారి కుమార్తె పేరు 'కర్కటి' - ఆమెను 'విరాధుడు' అనువానికిచ్చి పెళ్ళి చేశారా రాక్షస దంపతులు. శ్రీరాముడు విరాధుని చంపిన తర్వాత 'కర్కటి' తిరిగి తన తల్లిదండ్రుల దగ్గరకు సహ్యాద్రికి వచ్చి చేరెను.

ఢాకినీ శిఖరము నుండి పుట్టిన భీమానది యందు స్నానము చేయుటకు అగస్త్య మహర్షి శిష్యుడైన 'సుతీక్ష్ణుడు' అనువాడు వచ్చాడు. కర్కట - పుష్కసులను రాక్షస దంపతులా ముని కుమారుని భక్షింపబోవగా నతత తన తపోబలముచే వారిని భస్మము చేశాడు. ఇదంతయు చూస్తున్న కర్కటి అప్పటి నుండి దిక్కులేనిదై ఒక్కతియే ఆ సహ్యా పర్వతమున కాలము వెళ్ళబుచ్చుతోంది. ఒకనాడు రావణాసురుని సోదరుడైన కుంభకర్ణుడు సహ్యాపర్వతమునకు వచ్చినపుడు ఆమెను చూసి బలాత్కారముగా ఆమెను లోబరచుకొని, అక్కడ ఆమెతో కొన్నాళ్ళు విహరించి లంకకు తిరిగి వెళ్ళి పోయాడు. గర్భవతియైన కర్కటి ఒక కుమారుని కని వానికి భీముడని పేరు పెట్టింది.

ఆ భీముడు పెరిగి పెద్దవాడై ఆ సమీపమండలి ప్రజలను పలు విధాలుగా పీడించేవాడు. అతడొకనాడు ప్రసంగవశమున తన తండ్రి యెవరని తల్లిని (కర్కటిని) అడిగాడు. అపుడామె తన తల్లిదండ్రుల గూర్చియు, తన మొదటి భర్త (విరాధుడు) గూర్చియు, చెప్పి, కుంభకర్ణుడు తనను చేపట్టుట వలన నీవు పుట్టితివని చెప్పింది.

మరియు రామరావణ యుద్ధమున రావణ, కుంభకర్ణాది మహావీరులందరూ చనిపోయారనీ, వారివలెనే నీవునూ ముల్లోకములను జయించి వారి కీర్తిని నిలబెట్టుమని భీముని కోరింది. నాటి నుండి అతడు విష్ణుభక్తులను, ఆశ్రమవాసులగు మునులను వెతకి వెతకి హింసించేవాడు. ఆ సహ్యా పర్వతమున బ్రహ్మకై తపస్సు చేసి అతని నుండి కావలసిన వరములను పొందాడు.

భీమాసురుడు వర గర్వముతో దేవతలపై దండెత్తి ఇంద్రుడిని పదవీభ్రష్టుని చేశాడు. దిక్పాలకులతనికి భయపడి పారిపోయారు. తర్వాత భీముడు మర్త్య లోకము (ఈ భూమిని) జయించాలనుకున్నాడు. ఆ కాలమున కామరూప దేశము (ప్రస్తుత నేపాల్)ను సుదక్షిణ్యుడనే రాజు పరిపాలించేవాడు. అతడు గొప్ప శివభక్తుడు. భీముడు మొదట కామరూపము పై దండెత్తి సుదక్షిణుడి నోడించి కారాగారమున బంధించాడు.

భీమాసురుని చెరసాలలో బందీలైన సుదక్షిణ మహారాజు దంపతులు శివభక్తిని విడువక తమ యెదుట పార్థివ శివలింగము నుంచుకొని దీక్షగా పరమేశ్వరుని పూజించేవారు. ఈ విషయమును తెలిసికొనిన భీమాసురుడు కారాగారమునకు వచ్చి ఆ రాజ దంపతులను, పార్థివ శివలింగమును పరిహసిస్తూ దూషించాడు. దానికి సుదక్షిణ మహారాజు "భీమాసురా! శివుని మహిమ తెలియక నీవు దూషిస్తున్నావు. శివుడు భక్తులను రక్షించుటే కాక నీ వంటి పాపులను శిక్షిస్తాడు కూడా" అని అతడిని మందలించాడు. దానితో భీముడు కోపమును పట్టలేక చేతిలోని కత్తిని ఆ రాజు పూజిస్తున్న పార్థివలింగము పైకి విసిరాడు. దాంతో ఆ పార్థివ లింగము నుండి శివుడుద్భవించి తన మూడవ కంటితో భీమాసురుని, అతని రాక్షస గణములను భస్మము చేశాడు. సుదక్షిణ మహారాజు, ఇంద్రాది దేవతలు, నారదాది మహర్షులు శివుని స్తుతించారు. అక్కడ భీమాసురుడు చంపబడడం చేత భీమశంకరుడుగా తాను జ్యోతిర్లింగమవుతానని, భక్తులను రక్షించి సకల శుభముల నిచ్చెదనని శివుడు వరమిచ్చాడు. సుదక్షిణుడు తన కామరూప దేశమునకు తిరిగి వెళ్ళిపోయినను ప్రతి మాసశివరాత్రికి అక్కడకు వచ్చి భీమశంకరుని పూజించేవాడు. రాక్షస సమూహములు భస్మము చేయబడగా ఆ బూడిద కాలాంతరమున ఓషధులుగా రూపొందాయి.

భీమశంకరుడను పేరు గల శివలింగములు పైన తెల్పిన మహారాష్ట్రలోని ఖేడ్ ప్రాంతముననే గాక (1) ఉత్తరప్రదేశ్‌లో నైనిటాల్‌కి 20 కి.మీ.లో ఉజ్జనక్ అనే గ్రామంలో ఒకటి; (2) అస్సాంలోని గౌహతిలో బ్రహ్మపుర పర్వతముపై ఒకటి; (3) ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లాలోని దక్షారామమున ఒకటి ఉన్నాయి.


పంచారామములు అని పిలువబడే 1. దక్షారామము, 2. అమరా రామము (అమరావతి-కృష్ణాజిల్లా), 3. కుమారా రామము (సామర్లకోట), 4. క్షీరారామము (పాలకొల్లు), 5. సోమారామము (గునుపూడి-భీమవరం) అయిదును శివభక్తులకు అత్యంత ప్రీతిపాత్రములు.

**చరిత్ర:** చెప్పుకోదగినంతగా లేదు - శివాజీ తర్వాత మహారాష్ట్రను పాలించిన పీష్వాలలో నానా ఫడ్నవీస్ "అనునతడు శ్రీ స్వామి వారికి అందమైన ఆలయాన్ని నిర్మించి ఈ క్షేత్రాభివృద్ధికి చాలా కృషి చేశాడు.



# 7. రామేశ్వర జ్యోతిర్లింగము

## (రామేశ్వరం - తమిళనాడు)



రామేశ్వరం

శ్లో॥ సంతామ్రపర్ణీ జలరాశి యోగే
నిబధ్య సేతుం విశిఖైరసంఖ్యైః ।
శ్రీరామచంద్రేణ సమర్పితం తమ్
రామేశ్వరాఖ్యం నియతం నమామి ॥

**భావము:** ఏ నదిలో నీటి బిందువులు ముత్యపు చిప్పలో పడగానే ముత్యములుగా మారుతాయో, తనలో స్నానము చేసిన పాపాత్మునికి ముక్తిని ప్రసాదిస్తుందో ఆ తామ్రపర్ణీనది సముద్రములో కలిసే చోట, అనేక బాణములతో వారధి (సేతువు)ను నిర్మించిన శ్రీరామచంద్రునిచే ప్రతిష్ఠింపబడి, రామేశ్వరుడని పిలువబడుచున్న పరమేశ్వరునికి నిత్యము నమస్కరించుచున్నాను.

**పురాణగాథ:**

శ్రీరాముడు రావణ వధానంతరము లంక నుండి పుష్పక విమానంలో తిరిగి వస్తూ 'పులస్త్య బ్రహ్మ వంశమున పుట్టిన రావణ, కుంభ, కర్ణాది రాక్షసులను సంహరించుట వలన బ్రహ్మ హత్యాపాతకము కలుగును. కావున తగిన పరిహారమేదైనా చేసుకోవాలి' అని తలచి ప్రస్తుత రామేశ్వర ప్రాంతమున నున్న అగస్త్యముని ఆశ్రమమును చేరాడు. అగస్త్యుడు శ్రీరామునకతిథి సత్కారములు చేసి, బ్రహ్మ హత్యా దోష నివారణకై సముద్ర తీరమున ఒక శివలింగమును ప్రతిష్ఠ చేయమన్నాడు. శ్రీరాముడు హనుమంతుని పిలిచి, కైలాసము నుండి శివలింగమును తెమ్మని పురమాయించాడు. సీతమ్మకు అగ్నిపరీక్ష జరిగిందిక్కడనే. విభీషణాదులు లంక వరకు కట్టబడిన సేతువు (బ్రిడ్జి) ఇంకనూ వుండుట మంచిది కాదనియు, దానిని ధ్వంసము చేసిన బాగుండుననియు చెప్పారు. అపుడు శ్రీరాముడు తన ధనస్సు యొక్క చివరతో ఆ సేతువును భగ్నము చేశాడు. అట్టా సేతువు శ్రీరాముని ధనస్సు చివరతో భగ్నమైంది (విరిగింది) కాబట్టి ఆ ప్రాంతానికి ధనుష్కోటి అని పేరు వచ్చింది. ఇక్కడి గంధమాదన పర్వతము అతి పుణ్యస్థలము.

హనుమంతుడు శివలింగమునకై కైలాసానికి వెళ్ళిన వాడింకను తిరిగి రాలేదు. శివలింగ ప్రతిష్ఠకు నిర్ణయించిన సమయము దగ్గరగుచున్నది. అందరిలోను ఆతురత

పెరుగుతోంది. సమయము (శుభముహూర్త సమయం) మించిపోకుండా సైకత (ఇసుకతో చేసిన) శివలింగమును ప్రతిష్ఠించుట మంచిదని నిర్ణయించారు.

సీతాదేవి సముద్రమునందలి తడి ఇసుకతో ప్రార్థివ శివలింగమును తయారు చేసింది. నిర్ణీత సమయమున విధి విధానముగా శ్రీరాముడా సైకత లింగమును ప్రతిష్ఠించాడు. రామునిచే ప్రతిష్ఠింపబడిన ఆ లింగమును రామేశ్వరుడని, రామేశ్వర లింగమనీ వ్యవహరిస్తారు. ఆ లింగ ప్రతిష్ఠ పూర్తయిన క్షణమున హనుమంతుడు కైలాసము నుండి శివ లింగమును తెచ్చాడు. తాను తెచ్చిన లింగమును కాక వేరొక లింగమును ప్రతిష్ఠించినందుకు ఆంజనేయుడలిగాడు. అతని అలక తీర్చు నెపముతో తాను మహాబలవంతుడననే గర్వమును భగ్నపరచు ఉద్దేశముతో శ్రీరాముడు హనుమంతుని ఓదారుస్తూ తాను ప్రతిష్ఠించిన సైకత లింగము నక్కడ నుండి తొలగించిన హనుమంతుడు తెచ్చిన లింగమునక్కడ ప్రతిష్ఠిస్తానని చెప్పాడు. ఆ సైకత లింగమునక్కడ నుండి తొలగించుటకు విశ్వప్రయత్నము చేసియు, ఫలించక మూర్ఛ పోయాడు. సీతమ్మ అతనిని మూర్ఛ నుండి సేదదీర్చి ప్రశాంతుడిని చేసింది. అపుడు శ్రీరాముడు "హనుమా! అది (ఆ సైకత లింగము) పవిత్రురాలైన మీ అమ్మ సీతమ్మచే చేయబడింది. విధి విధానంగా, శాస్త్రోక్తంగా నా చేత ప్రతిష్ఠింపబడింది. దానిని నెవరును వీసమంతైనను కదలించలేరు-నీవు చింతించకు - నీవు తెచ్చిన లింగమును కూడ యిక్కడ 'హనుమదీశ్వరుడు' అను పేరుతో ప్రతిష్ఠించుదము. ఇక్కడకు వచ్చిన భక్తులు "నీవు తెచ్చిన లింగమును దర్శించనిదే రామేశ్వర దర్శన పుణ్యఫలము దక్కదు" అను వరముతో అతనిని ఓదార్చి ఆ లింగమును రామేశ్వర లింగమునకు దగ్గరలోనే ప్రతిష్ఠించాడు. దీనికి హనుమదీశ్వరుడని, కాశీవిశ్వనాథుడనీ పేర్లు కలిగాయి.

ఈ రామేశ్వర క్షేత్రమును గూర్చి స్కాంద పురాణము యెంతగానో వర్ణించింది. రామేశ్వర స్వామి దేవాలయము 1000 అడుగుల పొడవు, 650 అడుగుల వెడల్పు, 150 అడుగుల యెత్తుతో అనంతమైన శిల్పకళతో నిర్మింపబడింది. ఈ క్షేత్రంలో నందీశ్వరుడు, వెండి రథము, బంగారు గోపురాలు చూడదగినవి. ఆలయం చుట్టూ 1200 స్తంభాలతో ప్రదక్షిణ మండపం నిర్మింపబడింది. ప్రతి స్తంభము ఒకే రాతితో మలచబడింది. ఆలయ ప్రహరీకి నాలుగు దిక్కులా నాలుగు ద్వారాలున్నాయి. ప్రహరీ బయట స్తంభములుగా తీర్చుట కోసమన్నట్లు, మండపములోని స్తంభముల సైజులో (పొ × వె × మందము) పలకలుగా తీర్చిన ఏకశిలలు యెన్నో పడి వున్నాయి. ఇంకా ఏమి నిర్మించదల పెట్టారో ఆనాడు - ఆలయము లోపల 23 నూతులు (తీర్థములు) న్నాయి. సముద్రము అగ్ని తీర్థముగా 24వ తీర్థముగా చెప్పబడుతోంది. ఉత్తర భారత యాత్రీకులు తాము తెచ్చిన గంగా జలముతో రామేశ్వర లింగాన్ని అభిషేకిస్తారు. ఇక్కడి సముద్రపుటిసుకను తీసుకు వెళ్ళి గంగానదిలో కలుపుతారు. ఈ పుణ్య కార్యము త్రేతాయుగము నుండి నేటి వరకూ కొనసాగుతూనే వుంది.

**చరిత్ర:** ఈ రామేశ్వరం గూర్చి చారిత్రకంగా చెప్పుకోదగిన విశేషాలు లేవు. మధ్య, ఉత్తర భారతదేశంలో వున్నంత తీవ్రముగా ఈ ప్రాంతంలో ముస్లిం దండయాత్రలు



లేవు. అందుచేత ఇక్కడ సాహితీ సంస్కృతులు, కళలు, దేవాలయ శిల్ప సంపద నేటికీ చెక్కు చెదరక నిలచి వున్నాయి.

## దర్శనీయ స్థలాలు

**రామేశ్వర దేవాలయం:** ద్రావిడ శిల్పశైలిలో మూడు ప్రాకారాలతో నిర్మింపబడింది. మొదటి ప్రాకారంలో రామేశ్వర స్వామి గర్భాలయం, ప్రక్కనే హనుమదీశ్వర (కాశీవిశ్వేశ్వర) ఆలయం వుంది. రెండవ ప్రాకారంలో అమ్మవారి ఆలయం వుంది. మూడవ ప్రాకారంలో చిత్రవిచిత్రములైన శిల్పములతో కూడిన స్తంభాలతో నిర్మించిన అద్భుతమైన మంటపమున్నది. ఇది ప్రపంచంలోనే అతి పెద్దది. ఈ ప్రాకారంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయం, నటరాజు, సేతు మాధవస్వామి, కోనేరు వివిధ తీర్థాలు వున్నాయి. ఈ ఆలయానికి తూర్పున సముద్రము, పడమటి వైపున విశిష్టమైన గోపురాలున్నాయి.

**అగ్నితీర్థం:** 24వదిగా చెప్పబడే ఈ తీర్థము తూర్పున వున్న సముద్రమే. ఇక్కడ సముద్రం ఛాలా ప్రశాంతంగా ఒక కోనేరులా వుండటంచేత స్నానానికి అనువుగా వుంటుంది.

**గంధమాదన పర్వతం:** ప్రధానాలయానికి 3 కి.మీ.లలో నున్న ఎత్తైన పర్వతం. ఆంజనేయుడు సీతను వెదకడానికి లంకకు ఈ పర్వతముపై నుండే ఎగిరాడని, శ్రీరాముడు ఇక్కడి నుండే వానర సైన్యాన్ని లంకకు నడిపించాడని అంటారు. ఈ పర్వత శిఖరం నుండి రామేశ్వర సుందర దృశ్యాలను చూడవచ్చు.

**హనుమాన్ ఆలయం:** ఈ పర్వత సమీపంలో వుంది. హనుమంతుడు లంక నుండి వచ్చి సీతమ్మ సంగతులను శ్రీరామునికిచటనే చెప్పాడంటారు.

**విలోంది తీర్థం:** సీత కోసం రాముడు బాణంతో ఏర్పరచాడట. నీరు తియ్యగా వుంటుంది. ఇది ప్రధానాలయానికి 7 కి.మీ. దూరంలో పాంబన్‌కు వెళ్ళే త్రోవలో వుంది. ఇక్కడున్న రామాలయాన్ని 'ఏకాంత రామమందిరం' అంటారు.

**పాంబన్ బ్రిడ్జి:** ప్రధానాలయానికి 12 కి.మీ. రామేశ్వర ద్వీపాన్ని భారత భూభాగంతో కలుపుతోంది. దీని పొడవు 2.2 కి.మీ.

**ధనుష్కోటి:** రామేశ్వరానికి 18 కి.మీ. 1964లో వచ్చిన తుఫానుకు కొట్టుకుపోగా కోదండ రామస్వామి ఆలయం మాత్రమే నిలచింది. ఇది బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం కలిసే చోటు.

**ఇతర దర్శనీయ ప్రదేశాలు:** నాయకి అమ్మన్, భద్రకాళి, పంచముఖ ఆంజనేయ, కోదండ రామాలయాలు, జటాయుతీర్థం, విభీషణాదులు ప్రతిష్ఠించిన అనేక శివలింగాలు చూడదగినవి.

స్కాందపురాణము-బ్రహ్మఖండము-సేతు మాహాత్మ్యము - 48వ అధ్యాయంలో రామేశ్వరమును గూర్చి, సేతువు గూర్చి చాలా వివరంగా వర్ణింపబడింది. అట్లే ధనుష్కోటి తీర్థము గూర్చి కూడ స్కాందపురాణము యెంతగానో చెప్పింది చూడుడు.

**ధనుష్కోటి తీర్థము గూర్చి స్కాంద పురాణము:**

శ్లో॥ దక్షిణాంబునిధే పుణ్యేరామ సేతా విముక్తిదే ।
ధనుష్కోటి రితిఖ్యాతం తీర్థయస్తి విముక్తిదం ॥

బ్రహ్మహత్యా సురాపాన స్వర్ణస్తేయ వినాశనం ।
గురుతల్పగ సంసర్గ దోషాణామపి నాశనం ॥


కైలాసాది పదప్రాప్తి కారణం పరమార్థదం ।
సర్వకామమిదం పుంసామృణ దారిద్ర్యనాశనమ్ ॥

ధనుష్కోటి ర్ధనుష్కోటి ర్ధనుష్కోటిరితీరణాత్ ।
స్వర్గాపవర్గదం పుంసాం మహాపుణ్య ఫలప్రదమ్ ॥

ఇట్లా యెంతగానో శ్లాఘించింది. అట్లే వాల్మీకి రామాయణము కూడ ఈ రామేశ్వర క్షేత్రము, తీర్థములు, ధనుష్కోటి, గంధమాదన పర్వతాది విషయములను, వాటి మాహాత్మ్యమును చాలా విపులంగా వివరించింది.

# 8. నాగనాథ జ్యోతిర్లింగము (నాగేశ్వరుడు)

## (ద్వారక-గుజరాత్ / సౌరాష్ట్రదేశం)




శ్లో॥ యామ్యే సదంగే నగరేతి రమ్యే
విభూషితాంగం వివిధైశ్చభోగైః
సద్భక్తిముక్తి ప్రదమీశమేకం
శ్రీ నాగనాథం శరణం ప్రపద్యే॥

**భావము:** దక్షిణదిక్కున (యామ్యే) ఉన్న అతిరమ్యమైన నగరములో అనేక పడగలతో అలకరింపబడిన శరీరమును కలిగి, మంచి భక్తి ముక్తులను యిచ్చు నాగనాథుని శరణుపొందుచున్నాను.(అమ్మవారు నాగేశ్వరి)

**పురాణగాధ:** (శివపురాణమునుండి)

ఒకప్పుడు దారుకుడనే రాక్షసుడు దారుక అను తన భార్యతో పశ్చిమ తీరములో పదహారు యోజనముల వనమును సకలవసతులతోను నిర్మించుకొని సుఖముగా జీవిస్తూ వుండేవాడు. ఆ దంపతుల పేరుతో ఆ వనము దారుకావనమని



పిలువబడేది. దారుక దేవీ భక్తురాలు ఆమె దేవికై తపస్సుచేసి వరములను పొందింది. ఆ వర ప్రభావంతో వారి నివాసమైన దారుకావనమును వారు ఎక్కడకు వెళ్ళాలనిపిస్తే అక్కడకు తీసికొని పోతూవుండేవారు. రాక్షస సహజమైన యజ్ఞయాగాదులను ధ్వంసముచేయుట, ప్రజలను నానారకములుగా హింసించుటయనునవి వరగర్వంతో విచ్చలవిడిగా చేసేవారు. వారి బాధలను భరించలేక ప్రజలు, మునులు ఔర్వమహర్షి వద్దకు వెళ్ళి తమను రాక్షసుల బారి నుండి రక్షించమని ప్రార్థించారు. మనసు ద్రవించిన ఔర్వమహర్షి "భూమిపై గల మునులను, ప్రజలను హింసిస్తే ఆ రాక్షసులు వెంటనే నశిస్తారు". అని శపించాడు.

ఆ శాపము విషయము తెలిసిన ఆ రాక్షదంపతులు తమ దారుకావనమును సముద్రములో ఒక ప్రాంతమున స్థాపించుకొని, భూమిపై నున్న వారిని హింసించ వలనుపడదు కావున సముద్రముపై ప్రయాణించు వారిని హింసించ మొదలు పెట్టారు. ఓడలను కొల్లగొట్టి అందలి మనుష్యులను తినగలిగినందరిని తిని మిగిలిన వారిని తమ బందీలుగా చెరసాలలోనుంచేవారు. అందుచేత వారి ఆహారమునకెట్టి లోటును కలుగుటలేదు. పడమటి సముద్రము (అరేబియా మహాసముద్రము)లో ఓడలలో ప్రయాణించు వారికే ఆపదయెప్పుడు వస్తుందోనని భయముతో గడగడ లాడేవారు.

ఒక రోజు ఆ రాక్షస దంపతులకు చిక్కిన ఓడలో చాలామంది వ్యాపారులు (వైశ్యుల), సరంగులు, ఇతర పనివారు ఉన్నారు. వారందరినీ చెరసాలలో వుంచారు. వారిలో 'సుప్రియుడు' అనే వైశ్యుడు గొప్ప శివభక్తుడు. అతడు తనకు వచ్చిన ఆపదకు చింతించక పరమేశ్వర ధ్యానంలో గడుపసాగాడు. చేయునదిలేక, తమ ప్రాణాల నెప్పుడు తీస్తారో తెలియక మిగిలిన ఖైదీలు కూడ సుప్రియునితోబాటు ఈశ్వర నామ జపం, భజనలు చేయడం మొదలు పెట్టేరు. చెరసాలకు కాపలాగా నున్న రాక్షసులు గోల చేయవద్దని, భజనలను మానమని యెంత చెప్పినా వారు వినక పోవడంచేత ఆ కావలివారు వెళ్ళి ఆ విషయమును రాక్షస దంపతులకు చెప్పేరు. దానికి వారు కోపంతో వచ్చి ఖైదీలను నానారకములుగా హింసించడం మొదలు పెట్టేరు. 'సుప్రియుడు' అదేమీ పట్టించుకొనక శివనామమందే జపిస్తున్నాడు. ఉన్నట్లుండి అక్కడ నాలుగు దిక్కులకు నాలుగు ద్వారములతో, మధ్యన ఒక లింగముతో నున్న దేవాలయములాగా మారిపోయింది. ఆ జైలు గది-శివలింగమును చూడగానే సుప్రియుడు అమితానందముతో వెళ్ళి దానిని కౌగలించుకొని శివనామ జపంలో తన్మయుడైపోయాడు. అపుడా శివలింగము నుండి శివుడు వచ్చి ఆ రాక్షసులను సంహరించి భక్తులను కాపాడాడు. "ఇక నుండి ఈ దారుకావనం వర్ణాశ్రమ ధర్మాలతో వర్ధిల్లుతుంది" అని వరమిచ్చాడు.

దేవీ భక్తురాలైన దారుక దేవిని ప్రార్థించి తనను, తన (రాక్షస) వంశమును కాపాడమని ప్రార్థించింది. ఈ సందర్భంగా పార్వతీపరమేశ్వరులలో అభిప్రాయ భేదాలు తలయెత్తాయి. చివరకు ఆ పురాణ దంపతులు సమాధానపడి, "ఆ దారుకా

వనం ఒక యుగ కాలము రాక్షసుల అధీనములో నుండేటట్లును, ఈ లోపల వర్ణాశ్రమ ధర్మాలను పాటించువారెవరు వచ్చినా వారికి ఆపద కలుగకుండునట్లును, నాగేశ్వరుడు (నాగనాథుడు) అనే పేరుతో అక్కడ వెలసిన ఆ జ్యోతిర్లింగమును అర్చించిన వారికి రాజసమాన భోగభాగ్యములు కలుగునట్లును వరమిచ్చారు.

ఆ యుగాంతంతో 'వీరసేనుడు' అనే రాజు అక్కడకు చేరి, భక్తితో శివుని అర్చించి నాగేశ్వరుని ప్రసాదముగా పాశుపతాస్త్రమును సంపాదించి, దానితో దారుకా (రాక్షస) వంశమును నాశనం చేశాడు. ఆ వీర సేనుని కుమారుడే నలచక్రవర్తి.

ఈ పవిత్ర క్షేత్రము నేడు 'నాగనాథ్', 'నాగేశ్వర్' అను పేర్లతో పిలువబడుతూ గుజరాత్ రాష్ట్రంలోని పశ్చిమ సముద్రతీరంలోని 'ద్వారక'కు సమీపంలో ఒక చిన్న దీవిలో వున్నది.

**చరిత్ర:** ఈ క్షేత్రమును గూర్చిన చారిత్రక విశేషాలేమీ అంతగా లేవు. చాళుక్యులు, గూర్జరులు మొదలగు వారి పాలనలో అభివృద్ధి చెందినా, మత ఛాందసుడైన ఔరంగ జేబు దాడులతో శిధిలమయ్యింది. తర్వాతి కాలంలో భక్తుల నిరంతర కృషితో పునరుద్ధరింపబడింది.

## దర్శనీయ ప్రదేశాలు

**శ్రీ నాగనాథ దేవాలయం:** బౌద్ధశిల్ప రీతిలో పునర్నిర్మితమైన ఈ ఆలయం యెంతో ఆకర్షణీయంగా వుంటుంది - కనకేశ్వరీ దేవి ఆలయం, శ్రీ నాగనాథ తీర్థం చూడదగినవి.

**గోపీతలాబ్:** శ్రీకృష్ణ నిర్యాణము తర్వాత గోపికలను దొంగలు అపహరించిన స్థలమిదేనంటారు. ఇది నాగనాథ్‌కు 4 కి.మీ. వుంది.

**భేట్‌ద్వారక:** ఓఖా పోర్టుకు 2 కి.మీ. దూరంలో గల దీవి. ఇక్కడ నున్న కృష్ణాలయమే ఒకప్పటి శ్రీకృష్ణ నివాసమని చెప్పబడుతోంది. ఇంకా రుక్మిణీ ఆలయం, గీతామందిరం, గాయత్రీ మందిరం, ద్వారకా ధీశ, స్వామినారాయణ, సిద్ధినాథ మహాదేవ మందిరాలు చూడదగినవి. ద్వారకలో హోటల్సు, వసతి సదుపాయాలు, ఆటోరిక్షా మొ॥ ప్రయాణ సౌకర్యాలు లభిస్తాయి.

**భారతదేశంలో నాగేశ్వర జ్యోతిర్లింగముగా పిలువబడేవి:**

1. పైన తెలిపిన 'ద్వారక' సమీపములోని నాగేశ్వరుడు. అమ్మవారు నాగేశ్వరి.
2. ఉత్తరప్రదేశ్‌లో జోగేశ్వర ఖటేర్‌మల్‌కి 44 కి.మీ.లలోను, ఆల్మోరాకి 90 కి.మీ.లోను ఉన్నది. స్వామిపేరు నాగేశ్వరమహాదేవ. అమ్మవారి పేరు పుష్టీదేవి.
3. బీహార్ రాష్ట్రంలో వైద్యనాథమ్‌కి 75 కి.మీ.లలో ధుంకా క్షేత్రంలోని ఈశ్వరుడు వాసుకి నాథ్ లేక నాగనాథ్ అని పిలువబడుతున్నాడు.
4. మహారాష్ట్రలోని పర్లి-వైద్యనాథాలయానికి 125 కి.మీ.లలో ఔండా నాగనాథ్ నందలి నాగనాథలింగము కూడా జ్యోతిర్లింగమే అంటారు.



# 9. విశ్వేశ్వర జ్యోతిర్లింగము - వారణాసి (కాశీ) (ఉత్తరప్రదేశ్)




శ్లో॥ సానందమానందవనే వసంతం
ఆనంద కందం హతపాప బృందమ్
వారణాసీ నాథమనాథ నాథం
శ్రీ విశ్వనాథం శరణం ప్రపద్యే॥

**భావము:** ఆనందముతో కూడినవాడు ఆనంద వనమనే పేరుగల వారణాసి (కాశీ) పురములో నివసించే వాడూ, ఆనందమునకు నిలయమైనవాడూ, పాపసమూహాన్ని పోగొట్టేవాడూ, అనాథులైన జీవులకు (ప్రాణులకు) నాథుడైన వాడూ అయిన శ్రీవిశ్వనాథుని శరణుపొందుతున్నాను. (వరణ-అసి అను గంగానదీపాయలు కలసిన చోటున ఉన్న నగరం కావున దానికి వారణాసియని పేరువచ్చింది. ఇక్కడి అమ్మవారి పేరు విశాలాక్షి. ఈమె అష్టాదశ శక్తులలో ఒకర్తె. కావున ఇది ఒక శక్తి పీఠము.

**పురాణగాథ:** సృష్ట్యాదియందు పరబ్రహ్మ స్వరూపుడైన పరమేశ్వరుడు ఈ భువనములను సృష్టింపదలచి ప్రకృతి-పురుషుడు (స్త్రీ-పురుషుడు) అను రూపములను ధరించాడు. ఆ ప్రకృతి- పురుషులిద్దరు తమ తల్లిదండ్రులెవరో తెలుసుకోలేక విచారిస్తున్న సమయములో పరమేశ్వరుడు ప్రత్యక్షమై "మీరిద్దరూ తపస్సు చేయండి. బ్రహ్మాండాన్ని సృష్టించండి" అని చెప్పాడు. అప్పుడు వారు తాము తపస్సు చేయడానికి అనువైన ప్రదేశమేది? అని అడిగారు. అపుడు పరమేశ్వ రుడు అయిదు క్రోసులు పొడవు - వెడల్పులుగల నగరాన్ని నిర్మించేడు. ఆనగరమే కాశీ. అది ఆ పురుషునికి దగ్గరలో ఆకాశంలో నిలిచింది. ఆ పురుషుడే శ్రీ మహావిష్ణువు.

విష్ణువు సృష్టిని సంకల్పించి చాలా సంవత్సరముల పాటు తపస్సు చేశాడు. అలసిన అతని శరీరంనుండి స్వేదము (చెమట) ధారాళముగా స్రవించి విశాలాకాశంలో ప్రవహించింది. ఆ విచిత్ర దృశ్యాన్నిచూచి ఆశ్చర్యంతో విష్ణువు తలూపాడు. అప్పుడాతని చెవినుండి మణులతో కూడిన కర్ణాభరణం జారి పడింది. అది పడిన ప్రదేశమే 'మణికర్ణిక' తీర్థమయ్యింది. శ్వేద జలధార అంతకంతకు అధికమై చివరకు కాశీనగరం మునిగి పోవడం మొదలయ్యింది. అపుడీశ్వరుడు కాశీనగరాన్ని తన త్రిశూలంతో యెత్తివుంచాడు. మహావిష్ణువు తన భార్యయైన ప్రకృతితో అక్కడ నిద్రించాడు. అతని నాభి నుండి చతుర్ముఖ బ్రహ్మ ఆవిర్భవించాడు. అతడు శివాజ్ఞతో ఈ బ్రహ్మాండాన్నీ పదునాలుగు భువనాలనూ, సకల చరాచర సృష్టినీ చేశాడు. ఆ

సందర్భంగా, బ్రహ్మ, విష్ణువు మొదలగు వారంతా పరమేశ్వరుని యెన్నో విధాల స్తుతించారు. సంతుష్టుడైన పరమేశ్వరుడు వారందరి కోరికపై అక్కడ (కాశీలో) విశ్వేశ్వర జ్యోతిర్లింగమై వెలిశాడు. ప్రళయకాలంలో పరమేశ్వరుడు కాశీనగరాన్ని తన త్రిశూలంపై నిలబెడతాడనీ, 'కాశ్యాంతు మరణాన్ముక్తిః' అను సూక్తి, వలన ఇక్కడ మరణించిన వారు పునర్జన్మ లేకుండ మోక్షమును పొందుతారని పురాణ వచనములు.

(స్కాంద పురాణము - కాశీ ఖండంలో చెప్పబడినది.)

అంతే కాకుండా -

"కదా కాశీం గమిష్యామి కదాద్రక్ష్యామి శంకరమ్ ।
ఇతి బ్రువాణస్సతతం కాశీవాస ఫలం లభేత్ ॥" అంటోంది.

అంటే । "ఎపుడు కాశీకి వెళతానో, ఎప్పుడు విశ్వేశ్వరుని దర్శిస్తాలో, అని మనస్సులో పదేపదే తపన పడేవారికి కాశీలో నివసించినంత పుణ్యఫలం లభిస్తుంది." అని భావము.

**చరిత్ర:** వేదవాఙ్మయకాలం నుండీ, ప్రపంచ నాగరికతకంటే ముందుగానే నాగరికత పొందిన నగరముగా వేద వాఙ్మయానికీ, హైందవ సంస్కృతికి, విజ్ఞాన భండారాలకూ నిలయమైన నగరముగా ప్రసిద్ధినందినది.

మౌర్యులు, కనిష్కుడు, సముద్ర గుప్తుడు, హర్షవర్ధనుడు, యశోవర్మ, మిహిర భోజుడు, మహీపాలుడు మొదలగు చక్రవర్తులు విశ్వనాథుని సేవించి క్షేత్రాభివృద్ధికి కృషిచేశారు. సోమనాధ దేవాలయములాగే కాశీ విశ్వనాథుడు కూడా హిందువులకు ప్రాణప్రదుడగుటచేత ఈఆలయానికున్న భోగభాగ్యాలు, మడిమాన్యాలూ మహారాజుల కంటే గొప్పగా వుండేవి. అందుచేతనే ఈ దేవాలయం యెన్నోసార్లు (11 శతాబ్ది పూర్వార్థం నుండి 17వ శతాబ్ది ఉత్తరార్థం వరకు గల 600 సం॥లు) ముట్టడించబడి, దోచుకోబడి, ధ్వంసము చేయబడింది. 1670లో మత ఛాందసుడైన ఔరంగజేబు విశ్వనాథ దేవాలయ విధ్వంసానికి పూనుకొని ఆలయంలోనికి ప్రవేశించగానే అక్కడ విశ్వేశ్వరుడదృశ్యుడయ్యాడట. దాంతో ఔరంగజేబు విశ్వనాథ మందిరాన్ని పడగొట్టి మసీదుగా మార్చాడు. తర్వాత ఇండోర్ మహారాణి 'అహల్యాబాయి'కి కలలో విశ్వ నాథుడు కనబడి తానున్న ప్రదేశాన్ని చెప్పాడట. అప్పుడామె 1776లో తిరిగి ప్రతిష్ఠించి నూతన మందిరాన్ని నిర్మింపజేసింది. 19వ శతాబ్దంలో రాజారంజిత్‌సింగ్ ఆలయ శిఖరానికి బంగారు పూత పూయించాడు. అలా తర్వాత చాలామంది ఆలయాభివృద్ధికి కృషిచేశారు.

ఈ కాశీ క్షేత్రంలోనే హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడు పెట్టిన బాధలకు తట్టుకొని సత్యవాక్య పరిపాలకుడన్న పేరు పొందేడు. గౌతమ బుద్ధుడు ఇక్కడనే మొదట ధర్మ సందేశాన్నిచ్చాడు. జైనమత స్థాపకులైన పార్శ్వనాథుడు కాశీరాజు కుమారుడే. జగద్గు రువు శంకరాచార్యులు అద్వైత మతాన్ని స్థాపించారు. ఇలాయెంతో చరిత్రగల ఈ కాశీ నగరం వారణాసి, బెనారస్ అనే పేర్లతో కూడ పిలువబడుతోంది.

## దర్శనీయ స్థలాలు

ఈ కాశీనగరంలో చూడవలసినవి చాలానే వున్నాయి.

శ్లో॥ విశ్వేశం మాధవం ఢుంఢిం దండపాణిం చ భైరవం ।
వందే కాశీం గుహాం గంగాం భవానీం మణికర్ణికామ్ ॥



**భావము:** కాశీ విశ్వనాథుడు, బిందుమాధవుడు, ఢుంఢి వినాయకుడు, శ్రీ దండ పాణీశ్వరుడు, కాల భైరవుడు, గుహ (ఉత్తర వాహినీగంగ), గంగానది, అన్నపూర్ణాంబ (భవాని) మణికర్ణికా ఘట్టములు ప్రధానములు.

కోటిలింగాలతో కూడిన ఈ క్షేత్రములో 37 స్నానఘట్టములున్నాయి. వాటిలో మణికర్ణిక, దశాశ్వమేధ, హరిశ్చంద్రఘాట్‌లు ముఖ్యమైనవి. ఈ నగరక్షేత్రపాలకుడు భైరవుడు. కాశీలో 84 మతములున్నాయి.

**విశ్వేశ్వరవిశ్వనాథ దేవాలయం:** దీన్ని స్వర్ణదేవాలయము అని కూడ అంటారు. ఈ ఆలయం ఆవరణలోనే విష్ణ్వాలయం, అవి ముక్తవినాయకాలయం మొ॥ ఆలయాలున్నాయి.

**అన్నపూర్ణాలయం:** విశ్వనాథాలయానికి దగ్గరలోనే అన్నపూర్ణాదేవి ఆలయం వుంది. అమ్మవారి చేతులలో ఆయుధాలకు బదులు అన్నపుకుండ, గరిటె వుంటాయి.

**దుర్గాలయం :** విశ్వనాథునికి 7 కి.మీ.ల దూరంలో దుర్గాకుండే అనే కోనేటి ఒడ్డున 18వ శతాబ్దంలో నాగర శిల్పరీతిలో నిర్మింపబడిన దుర్గాలయం వుంది. ఈ దుర్గ కాశీక్షేత్రాన్ని రక్షిస్తూ వుంటుందని వాడుక.

**జ్ఞానవాపి తీర్థం:** ఔరంగజేబుచేసిన విధ్వంసంతర్వాత ఇండోర్‌రాణి అహల్యాబాయికి కలలో తానిక్కడనున్నాడని విశ్వేశ్వరుడు చెప్పిన చోటు.

**పశుపతినాథ దేవాలయం** (నేపాలీ దేవాలయం): నేపాల్‌లోని పశుపతినాథ దేవా లయానికి ప్రతిరూపుగా కలపతో నిర్మించి నేపాల్ నుండి తీసికొని వచ్చి ఇక్కడ స్థాపించారు. పూర్తి కలప నిర్మాణం.

**తులసీ మానస్ దేవాలయం:** తులసీదాసు రామాయణాన్ని ఇక్కడే వ్రాశాడనాడానికి గుర్తుగా ఇక్కడ 1964లో పాలరాతితో నిర్మించారు. ఆలయకుడ్యము (గోడ)ల మీద రామచరిత మానస్ (రామాయణం) లోని విశేషాలను అందంగా చెక్కారు.

ఇంకా ఇక్కడ బౌద్ధుల సారనాథ్‌మందిరం, చైనావారి బౌద్ధమందిరము, మ్యూజి యమ్, హిందూ విశ్వవిద్యాలయం, సంస్కృత విశ్వవిద్యాలయం, అడుగడునాయెన్నో దేవాలయాలు చూడదగినవి వున్నాయి. ఈ కాశీ గురించి ---

"శ్లో॥ జపధ్యాన విహీనానాం జ్ఞానవర్జిత చేతసాం -
తతో దుఃఖహతానాం చ గతిర్వారణాసీనృణామ్ ॥
శ్లో॥ తీర్థానాం పంచకం సారం విశ్వేశానందకాననే ।
దశాశ్వమేధం లోలార్కం కేశవో బిందు మాధవః ॥
శ్లో॥ పంచమీ తు మహాశ్రేష్ఠా ప్రోచ్యతే మణికర్ణికా ।
ఏభి సుతీర్థ వర్యైశ్చ వర్ణ్యతేహ్యా విముక్తకమ్ ॥" - అని పురాణాలు.


(మత్స్య పురాణంలో చెప్పబడినది)

**భావము:** జపధ్యానరహితులు, జ్ఞానహీనులు, దుఃఖితులు అగువారికెల్ల కాశీ నగర మొక్కటే సద్గతిదాయకమనుట సత్యము. విశ్వేశ్వరునికి పెన్నిధి (నివాసము) అయిన ఈ ఆనందకాననమును పేరుగల వారణాసిలో దశాశ్వమేధ ఘట్టము, లోలార్క కుండము, బిందుమాధవక్షేత్రం, కేశవస్వామి, మణికర్ణిక అను 5 తీర్థములు ముఖ్యములు.

వీటిచే నిత్య సంయుక్తమగుటచే (ఇవి కలిసి యుండుటచే) కాశీనగరము 'అవిముక్తము' అని చెప్పబడుతోంది.

# 10. త్ర్యంబకేశ్వర జ్యోతిర్లింగము

### నాసిక్ కు 30 కి.మీ.లో త్ర్యంబకేశ్వరం (మహారాష్ట్ర)




శ్లో॥ "సహ్యాద్రిశీర్షే విమలే వసంతం,
గోదావరీ తీర పవిత్ర దేశే ।
యద్దర్శనాత్ పాతకమాశు నాశం,
ప్రయాతి తం త్ర్యంబకమీశ మీడే ॥"

**భావము:** నిర్మలమైన సహ్యాపర్వత శిఖరంమీద, గోదావరితీరప్రదేశంలో నివసిస్తూ, దర్శనమాత్రము చేతనే పాపములను పోగొట్టే త్ర్యంబకేశ్వరుని పొగుడుచున్నాను.

(ఇక్కడి అమ్మవారి పేరు త్ర్యంబకేశ్వరి)

**పురాణగాధ:** సప్తర్షులలో ఒకడైన గౌతమ మహర్షి తన భార్య అహల్యతో కలసి సహ్యా పర్వతముపై గల బ్రహ్మగిరిపై తపస్సుచేసుకొంటూ ఉండేవాడు. (సప్తర్షులు - 1. గౌతముడు, 2. విశ్వామిత్రుడు 3. భరద్వాజుడు 4. అత్రి, 5. వశిష్ఠుడు 6. కశ్యపుడు 7. జమదగ్ని అనువారు) ఒకప్పుడు దేశమున భయంకరమైన కరవు పరిస్థితి యేర్పడింది. ప్రజలు, పశుపక్ష్యాదులు త్రాగటానికి కూడ నీరులేక, పంటలులేక నానా బాధలూ పడుతూండేవారు. తిన తిండిలేని వారెలా యజ్ఞయాగాదులు చేయగలరు? యజ్ఞాహుతులు లేని (హవిస్సులు అందని) దేవతలు కూడ ఇబ్బంది పాలయ్యారు. ఆ పరిస్థితిని దయార్ద్ర హృదయుడైన గౌతముడు చూసి బాధపడి వర్షములు కొరకై వరుణదేవుని గూర్చి తపస్సు చేశాడు. వరుణుడు ప్రత్యక్షమై 'మహర్షి ! ఈశ్వరాజ్ఞను నేను మీరి వర్షమును కురిపించలేను, కానీ నీ తపస్సుకు మెచ్చిన నేను నీవు త్రవ్విన గోతిలో అక్షయముగా నీరుండనట్లు వరమిచ్చుచున్నాను.'అని చెప్పి అంతర్ధాన మయ్యాడు. గౌతముడొక మూరెడు లోతున ఒక కుండమును త్రవ్వాడు. వరుణుని వరము వలన అది నీటితో నిండినది. ఎంతనీరు వాడినను తరుగకుండ నిలచినది. అది తెలిసిన ఋషి గణములు భార్యా పిల్లలతో గౌతమ ఆశ్రమస్థలమును చేరి పర్ణశాలలు నిర్మించుకొని తపస్సు యజ్ఞయాగాదులతో కాలం వెళ్ళబుచ్చేవారు.

గౌతముడు గాయత్రీ మంత్ర ప్రభావముతో సద్యోజాత ఫలితముగా (విత్తనము వేసిన వెంటనే మొక్క మొలచి కాపు కాయుట) పంటలు పండిస్తూ తన దగ్గర చేరిన వారందరిని కరువుబారిన పడకుండ కాపాడేవాడు. దేవతలకు క్రమము తప్పకుండా



హవిస్సులందుతూ వుండేవి. దేవతలు గౌతముని దయార్ద్రభావానికి, తపోప్రభావానికీ మెచ్చుకొంటూ వుండుటను తోటి మహర్షులు, బ్రాహ్మణ వర్గములు అసూయతో సహించలేక పోయేవారు. గౌతముని యెలాగైనా కించపరచాలనుకొన్నారు.

ఆ బ్రాహ్మణ వర్గములు ఒకచోట చేరి చర్చించుకొన్నారు. వారందరూ తమ తపస్సులను ధారపోసి ఒక ఆవును సృష్టించి గౌతముడు వేసిన పంటపొలములపైకి పంపించారు. అది పంటను తిననారంభించింది. అపుడా బ్రాహ్మణులు గౌతమునితో ఒక ఆవు పంటను నాశనము చేస్తోంది అని చెప్పారు. గౌతముడు దర్భగడ్డి పుల్లలతో ఆ ఆవును బయటకు తగులుటకు అదలించాడు. బ్రహ్మణ వర్గములవారి ఆశయము మేరకు ఆ ఆవు చనిపోయింది. దాంతో వారు గౌతమునకు గోహత్యా పాపమంటి నదనీ, దానిని నివారించుకొనుటకు గిరిప్రదక్షిణములు చేయుచూ, ఈశ్వరునికై తపస్సు చేసి, ఆప్రాంతమున నది ప్రవహించునట్లు చేయమని, అదే అందుకు ప్రాయశ్చితమని చెప్పారు. వారి మోసమును గ్రహించని గౌతముడు ఆ సహ్యాద్రికి ప్రదక్షిణములు చేయుచు, ఈశ్వరునికై తపమాచరించెను. నిస్వార్థపూరితమైన గౌతముని తపస్సునకు ఈశ్వరుడు సంతుష్టుడై గౌతమునకు ప్రత్యక్షమై 'మహర్షీ ! నిన్ను బ్రాహ్మణ వర్గముల వారు తామసులై వంచించారు. అది గ్రహించక నీవు తపస్సును కఠినముగా చేసి నన్ను తృప్తి పరిచావు. నీ అభీష్టమం ప్రకారము నేనిక్కడ జ్యోతిర్లింగముగా వెలుస్తాను. దివ్యగంగ నదిగా ఇక్కడ నుండి ప్రవహిస్తుంది. నీవలన దానియుత్పత్తి జరిగినది. కాబట్టి ఇకపై గౌతమి అనే పేరుతో పిలువబడుతుంది. గోహత్యాపాప నివారణకని నీవు తపస్సు చేశావు కాబట్టి గోదావరి అనే పేరున కూడ పిలువబడుతుంది. అని వరము లిచ్చాడు. నిన్ను మోసగించిన వారిని శిక్షిస్తాను అని శివుడు అన్నాడు. కాని గౌతముడు వారిని క్షమించమని కోరాడు. అతని విశాల, ఔదార్య బుద్ధికి మెచ్చుకొని శివుడు గౌతముని అనంతర జీవనమున సప్తఋషులలో ఒకనిగా స్థానమును పొందెదవని ఆశీర్వదించాడు. గౌతముడు, 'బ్రాహ్మణుల కుండవలసిన సత్త్వ గుణమును వదలి, తామస గుణమవలంభించి ఒకరిని ఇబ్బంది పెట్టుటకు తపస్సును వ్యయము చేసినారు కావున మీయందు బ్రాహ్మణ్యము నశిస్తుంది. ఇకపై సేవక వృత్తితో దారిద్ర్యముతో పలుకష్టములు పడుతూ జీవించండి' అని ఆ బ్రాహ్మణ వర్గములను శపించాడు. వారు తమ తప్పు తెలిసికొని, శాపము నుపసంహరించి తమను కాపాడమని వేడుకున్నారు. జాలిపడిన గౌతముడు ప్రతి నిత్యము బ్రహ్మణవిధులను తప్పకుండా నెరవేర్చువారిని, ప్రతినిత్యము గాయత్రిని ఉపాసించువారిని ఈ శాపము బాధించదని గౌతముడు వారి నూరడించాడు.

నాటి నుండి గౌతముడు తపస్సుచేసిన ప్రాంతమున వెలసిన ఆ శివునికి త్ర్యంబకేశరుడని (జ్యోతిర్లింగము) అక్కడినుండి ప్రారంభమైన నదికి గోదావరి/గౌతమి అను పేర్లు వచ్చాయి.

ఇక్కడికి దగ్గరలో గల పంచవటియందు శ్రీరాముడు సీతాలక్ష్మణులతో వనవాస మునకు వచ్చి నివసించినట్లు రామాయణము వలన తెలుస్తోంది. ఇక్కడి రామ కుండము, లక్ష్మణకుండము అను పేర్లతో రెండు కుండములు (చెరువులు) వున్నాయి.

సీతా కుండమను పేరుతో నొకటి గలదు. దానిని అహల్యాకుండమనీ శారంగపాణి కుండమని కూడా వ్యవహరిస్తున్నారు. సీతమ్మను రావణుడు ఇక్కడి నుండియే అపహరించాడని రామాయణం-పంచవటిలో వరుణానది యొద్దునగల ఇంద్ర కుండములో స్నానము చేయుటచేత గౌతముని శాపమువలన ఇంద్రుని శరీరమున యేర్పడిన వేలాదిక్షిద్రములు (కన్నములు) ని వృత్తియై ఇంద్రుడు పూతాత్ము డయ్యెనని పురాణగాథ-ఇక్కడ గల అంజనాద్రి శిఖరమున ఆంజనేయుడు పుట్టాడట.

**చరిత్ర:** త్ర్యంబక క్షేత్రమును గూర్చి చెప్పుకోవలసినంతటి విశేషాలు లేవు. మరాఠా రాజ్యాన్ని పరిపాలించిన అనేకమంది రాజులు ఈ క్షేత్రాభివృద్ధికి పాటుపడ్డారు. పీష్వా బాలాజీ బాజీరావు అనేరాజు త్ర్యంబకేశ్వరునికి ఆలయం కట్టించి ఈ క్షేత్రాభివృద్ధికి యెంతో కృషి చేశాడు.

## దర్శనీయ స్థలములు

**త్ర్యంబకేశ్వరాలయం:** బ్రహ్మగిరిపై త్రిమూర్త్యాత్మకమనుటకు గుర్తుగా మూడుకనులతోనున్న త్ర్యంబకేశ్వరజ్యోతిర్లింగము. గంగా ద్వారము, పావనకుండము, గౌతమ మహర్షి, అహల్యల పూజలందుకొన్న 108 శివలింగములున్న గుహ-సీతా రామ లక్ష్మణ - ధనుష్కుండములు, సూర్య- చంద్ర - అశ్వనీ - హనుమత్కుండములు - పేశవాకుండమున్న స్థలమున గోదావరి నదిలో వరుణ - సరస్వతి - గాయత్రీ - సావిత్రీ - శ్రద్ధా అను అయిదు నదులును కలిసి పోవును. ఖండోబా కుండము, ఓకకుండము, వైశంపాయన - ఇంద్ర - ముక్తేశ్వరకుండములు, మేదాతిథి - కోటి - అహల్యా సంగమతీర్థములు దర్శింపదగినవి.

**మందిరములు** (దేవాలయాలు): గోదావరీ మందిరము (గోదావరి పుష్కర సమయమున (12 సం॥ల ఒకసారి) మాత్రమే తెరువబడి ఒక సంవత్సరముపాటు పూజలు నిర్వహింపబడును.) బాణేశ్వర లింగము, గణేశుడు, శివుడు, దేవి, సూర్యుడు, విష్ణువు ఒక మందిరమున వున్నారు. విఠలేశ్వరుని గుడి, శ్రీరామ మందిరం, శివాలయం, శ్రీ కపాలేశ్వర మందిరం, సంగమేశ్వరుడు, కనకేశ్వరుడు, కపోతేశ్వరుడు, త్రిభువనేశ్వరుడు, శ్రీవిసంధ్యాదేవి దర్శనీయములు.-కృష్ణ మందిరం.

**బస్తీలో:** లక్ష్మీనారాయణ - శ్రీరామ - పరశురామ మందిరములు, ఇంద్రేశ్వర - త్రిసంధేశ్వర - కాంచనేశ్వర - జలేశ్వర - బల్లాలేశ్వర - గౌతమేశ్వర - రామేశ్వర - ముకుందేశ్వర - కాశీ విశ్వేశ్వరులు - భువనేశ్వరీ త్రిభువనేశ్వరులు - గాయత్రీ చూడదగినవి - నీలాంబికాదేవిని పరశురాముని తల్లియగు రేణుకాదేవియే అని చెప్తున్నారు. దత్తాత్రేయ, నీలకంఠేశ్వరాలయములు చూడదగినవి.

వరహగుహలో సీతారామలక్ష్మణుల విగ్రహములున్నవి. శ్రీ గోరఖ్‌నాథుడు, భక్తజ్ఞానేశ్వరుని పెద్ద సోదరుడగు శ్రీని వృత్తినాధుడు ఈ క్షేత్రమున తపస్సు చేశారట.

క్షేత్రమున ఆలయములకు దగ్గరలో వివిధ అంగడులు, ధర్మశాలలు, హోటళ్ళు ఉన్నాయి. అన్ని సదుపాయములు (వసతి మొ॥) లభిస్తాయి. మోటారు వాహన సౌకర్యాలు లభిస్తాయి.



# 11. కేదారేశ్వర జ్యోతిర్లింగము

## (కేదార్‌నాథ్, ఉత్తరప్రదేశ్)




శ్లో॥ "మహాద్రి పార్శ్వేచ తటే రమంతం.
సంపూజ్యమానం సతతం మునీంద్రైః
సురాసురైర్యక్ష మహోరగాద్యై
కేదారమీశం శివమేక మీడే ॥"

**భావము:** గొప్పదైన హిమవత్పర్వతము ప్రక్కన కొండ చరియ సమీపమున యెల్లప్పుడూ మునులచేత, దేవతలచేత, రాక్షసులు, యక్షులు, నాగులు మొదలగు వారిచేత పూజింపబడుచున్న మంగళ (శివం) కరుడగు కేదారేశ్వరుని పొగడుచున్నాను. (ఇక్కడి అమ్మవారి పేరు కేదారగౌరి)

**పురాణగాథ:** శ్రీ మహావిష్ణువు అంశలు (అవతారములు) గా నరనారాయణులు ధర్మదేవతకు కుమారులుగా జన్మించారు. వారు హిమాలయ పర్వతం మీదనున్న అత్యంత శోభాయమానమైన కేదారశిఖరమున బదరికాశ్రమంలో, నివసిస్తూ వుండేవారు. వారిద్దరు లోక కళ్యాణార్థమై శివుని గూర్చి తపస్సు చేశారు. వారు వేకువనే పుణ్యనదియైన మందాకినిలో స్నానముచేసి పార్థివ లింగమును నిర్మించుకొని పూజించేవారు. (పార్థివ లింగమంటే మట్టితో చేసిన లింగము) వారు మందాకిని నీటితోనూ, పవిత్రమైన బిల్వ పత్రితోనూ, వికసించిన తామరపూలతోనూ మిక్కిలి శ్రద్ధతో శివుని పూజించేవారు.

నరనారాయణుల భక్తికి ప్రసన్నమైన శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. అపుడు వారు దేవా! "మానవకళ్యాణం అనే హేతువుగా, శుభంకరముగా నీవెల్లప్పుడూ ఇక్కడనే వుండి, నిన్ను దర్శించి, పూజించు భక్తులకు అక్షయప్రాప్తి కలిగేటట్లు వరము నిమ్ము", అని ప్రార్థించారు. వారి ప్రార్థన ననుసరించి పరమేశ్వరుడు అక్కడ కేదారేశ్వర జ్యోతిర్లింగముగా వెలిశాడు. ఈ లింగమును దర్శించుట, పూజించుటల వలన అభీష్టములు సిద్ధించుటయే గాక, అచంచల శివభక్తి, మోక్షము లభిస్తాయి. కేదారేశ్వర భక్తులు కేదారమార్గమున మరణించినా ముక్తులగుదురని (మోక్షము పొందుదురని) పురాణములు చెప్తున్నవి. ఈ నరనారాయణుల తండ్రి 'ధర్ముడు' అనే ధర్మమూర్తి. తల్లి దాక్షాయణి. (దక్ష ప్రజాపతి కుమార్తెలలో ఒకరిత) వీరు బదరికాశ్రమంలో శివుని గూర్చి తపస్సు చేస్తున్నప్పుడు వారివల్ల తన ఇంద్రపదవి పోతుందేమోనని భయపడిన దేవేంద్రుడు వారి తపస్సును విఘ్నము చేయమని అప్సరసలను పంపాడు. నరనారాయణులు

సత్త్వ సంపన్నులగుటచేత అప్సరసలను కోపింపక, వారి (అప్సరసల) అజ్ఞానమును తెలుపుటకు నారాయణుడు తన తొడను చీల్చి, అందుండి ఒక అప్సరసను సృష్టించాడు. ఆమెయే ఊర్వశి, అట్లా అతి నిగ్రహంగా, నిష్ఠగా, సాత్త్వికంగా తపస్సు చేశారు. కావుననే వారికి శివదర్శనం కలిగింది. కేదారేశ్వర జ్యోతిర్లింగము స్వయం భువుగా వెలసింది.

**చరిత్ర:** పురాణాలలో, ఇతిహాసాలలో ఈక్షేత్రం గురించి వర్ణింపబడినది. అదిచల్లని హిమప్రదేశములో నుండుట, ఆకారణంగా ఈ ఆలయం మే నెలనుండి అక్టోబరు నెల వరకూ మాత్రమే తెరువబడియుండుట అనే కారణాలుగా ఈ కేదార్‌నాథ్ దేవాలయం ముస్లిములు మొదలగు దుండగుల బారిన పడి నాశనముగాక నిలిచియున్నదన వచ్చును.

**ఇక్కడి విశేషము:** అక్టోబరు నెల చివరలో మూసివేసిన ఆలయపు తలుపులు తిరిగి మే నెలలోనే తెరుస్తారు. అయితే అక్టోబరు చివరలో తలుపులు మూసివేసే సమయంలో ఆ కేదారనాథుని ముందు వెలిగించిన జ్యోతులు తిరిగి మే నెలలో తలుపులు తెరిచేవరకూ ఆరిపోకుండా జ్వలిస్తూనే వుంటాయి. ఇది జ్యోతిస్వరూపుడైన ఆ పరమేశ్వరుని అస్తిత్వప్రభావమనక తప్పదు కదా !

**చుట్టు ప్రక్కల చూడదగిన స్థలములు - ప్రయాణ మార్గములు :-**

కేదారనాథ్ యాత్ర హరిద్వార్ నుండి మొదలవుతుంది. త్రోవలో బదరీనాథ్ తగులుతుంది. దీనినే బ్రహ్మకపాలం అని కూడ అంటారు. కేదార్‌యాత్రలో బ్రహ్మకుండము, కన్‌ఖాల్, భీమగోదా, త్రివేణీఘాట్, లక్ష్మణఝులా, ఆల్మోరా, గఢ్వాల్ హిమాల్, రుద్రప్రయాగ, గుప్తకాశి, త్రిజోగి - నారాయణం, గౌరీ కుండము, బాల గణేష్, వ్యాసఘాట్, బదరికాశ్రమము, విష్ణు ప్రయాగ, నంద ప్రయాగ, యమునోత్రి, గంగోత్రి మొదలగునవి చూడదగినవి. హరిద్వార్‌లో ప్రతి 12 సం॥లకు కుంభమేళా జరుగుతుంది. హరిద్వార్‌లో అనేక ఆలయాలు, పుణ్యస్థలాలు, స్నానఘట్టాలు వున్నాయి. హరిద్వార్‌కి 24 కి.మీ.లలో ఋషీకేశ్ ఉంది. ఇక్కడ చాలా ఆశ్రమాలున్నాయి. వీటిలో విష్ణుభవనం, విష్ణు ధర్మశాల, ఆంధ్రాశ్రమం ముఖ్యములు. హరిద్వార్, ఋషీకేశ్‌ల మధ్య రైలు, బస్సులు, వ్యాన్సు, టాక్సీలు, టూర్ సర్వీస్‌లు మొదలగు రవాణా సదుపాయాలున్నాయి.

ఋషీకేశ్‌నుండి కేదారనాథ్‌కు దూరం సుమారు 250 కి.మీ. మార్గమధ్యంలో రుద్రప్రయాగ, అగస్త్యముని, గుప్తకాశి, త్రిజోగినారాయణ (సోన్ ప్రయాగ), గౌరీ కుండం మొదలైన పుణ్యక్షేత్రలున్నాయి. వీటన్నిటికీ ప్రయాణ సౌకర్యం వున్నది. (బస్సులు మొ॥) గౌరీకుండం నుండి కేదారీనాథ్‌కు దూరం 14 కి.మీ. ఇది ( ఈ14 కి.మీ.) నడక ప్రయాణమే - నడవలేని వారికి డోలీలు, పోనీ (Ponies) లపై (ఆడు గుర్రాలపై) స్వారి సదుపాయముంటుంది. గౌరీకుండమువద్ద అన్ని వసతి భోజన సదుపాయాలు వుంటాయి. గౌరీ కుండం, కేదార్‌నాథ్‌ల మధ్య (రామవాడి అనే ప్రదేశంలో టీ, బ్రేక్‌ఫాస్ట్ (ఫలహారాలు) దొరుకుతాయి. కేదార్‌నాథ్ సముద్ర మట్టానికి 11500 అడుగుల ఎత్తున వుంది. కేదారనాథ్‌లో పూజా సామాగ్రి అమ్ముషాపులు ధర్మశాలలు, కాటేజీలు, హాస్పిటలు, పోస్టాఫీసులు, హోటల్సు ఉన్నాయి. పూజారులు/ పండాలుతో అభిషేకం చేయించుకోవచ్చు. స్వామిని శ్రీశైలములో వలెనే అందరూ తాకి పూజించుకోవచ్చును. ఆలయం వెనుక మందాకినీ నది జలపాతాలు, పాండవులు, ద్రౌపది పాద చిహ్నాలు మొదలగు దర్శనీయములు.



# 12. ఘృశ్నేశ్వర జ్యోతిర్లింగము

## (ఎల్లోరా గుహలకు దగ్గరలో, మహారాష్ట్ర)




శ్లో॥ ఇళాపురే రమ్య విశాలకేఽస్మిన్
సముల్ల సంతం చ జగద్వరేణ్యం ।
వందే మహోదరతర స్వభావం
ఘృశ్నేశ్వరాఖ్యం శరణం ప్రపద్యే ॥

**భావము:** రమ్యము, విశాలమునైన ఇళాపురము (ఏలా పురము)లో ప్రకాశిస్తున్నవాడు, జగద్వరేణ్యుడు, అతి ఉదారమైన స్వభావము కలవాడునయిన ఘృశ్నేశ్వరుని శరణుకోచున్నాను. (ఇక్కడి అమ్మవారు ఘృశ్నేశ్వరి - ఈ ఇలా (ఏలా) పురము దగ్గర నున్న దేవగిరి అను దుర్గము దేవతలను నిలయమని ప్రసిద్ధి.)

**పురాణగాథ:** దేవగిరి దుర్గమునందు సుధర్ముడను బ్రాహ్మణుడు 'సుదేహ' అను తన భార్యతో నివసిస్తూ వుండేవాడు. నిత్యనైమిత్తిక కర్మలతో, అతిథి అభ్యాగతుల ఆదరణతో పవిత్రమైన గృహస్థ ధర్మమును ఆచరించు ఆ బ్రాహ్మణ దంపతులకు యెన్ని సంపదలున్నా సంతానము లేక బాధపడేవారు. ఒక రోజు ఆ గ్రామమునకు ఒక యతి వచ్చేడు. అతని తన ఇంటికి భోజనమునకు రమ్మని సుధర్ముడాహ్వానించాడు. సుదేహ భక్తితో అతనికి వడ్డిస్తోంది. ఆ యతి భోజనము ముందు కూర్చొని మీకు పిల్లలెందరు అని అడిగాడు. వారు విచారముతో పిల్లలులేనట్లు తెల్పారు. ఆ యతి పిల్లలు లేని వారింట భోజనము చేయడు. అంచేత వెంటనే లేచి వెళ్ళిపోబోయాడు. సుధర్ముడు యతి కాళ్ళపైబడి భోజనము చేయకుండా పోవద్దని బ్రతిమాలాడు. యోగదృష్టితో చూసిన యతి నాయనా సుధర్మా! విచారించకు. నీవు అనపత్యుడవు కావు. కాలాంతరమున నీకు కుమారుడు కలుగును అని దీవించాడు. యతి మాటలకు సుదేహ ఆశ్చర్యపోయింది. ఆమె చిన్నతనమున జ్యోతిష్కులు ఆమెకు సంతానము కలుగరని చెప్పారు. ఈ యతి తన భర్త పుత్రవంతుడగుననుచున్నాడు. ఆమె బాగా ఆలోచించి భర్తయగు సుధర్మునితో తన చెల్లెలు ఘృశ్నను పెండ్లాడి సంతానమును కనమని బలవంతము చేసెను. సుధర్ముడు ఘృశ్నను పెండ్లాడెను. ఆమె మహాపవిత్రత, శివభక్తురాలు. ఆమె భర్తకు, అక్కగారికి శుశ్రూష చేస్తూ ప్రతి దినము 101 పార్థివ లింగములను పూజించి వాటిని దగ్గర నున్న చెరువులో

నిమజ్జనము చేస్తూ వుండేది. ఇట్లు లక్ష సంఖ్యలో పార్థివ లింగముల పూజ పూర్తి యగుసరికి ఆమె గర్భవతియై ఒక సుపుత్రుని కన్నది.

కాలము గడచిన కొలది సుదేహ మనస్సున అసూయ పెరుగసాగింది. ఒకనాటి వేకువ జామున సుదేహ నిద్రిస్తున్న బాలుని కత్తితో నరికి దేహభాగాలను దగ్గరలో నున్న చెరువులో పారవేసి, యేమియు యెరుగనట్లు ఇంటికి తిరిగివచ్చి నిద్రనటించు చున్నది. ఘృశ్న మామూలు ప్రకారం పార్థివలింగములను పూజించి చెరువులో నిమజ్జనం చేయుటకు నీట అడుగుపెట్టగానే నీటి నడుమ నుండి బాలుడు ఈదుకొని వచ్చి తల్లి కాళ్ళుపట్టుకొని 'అమ్మా! నేను మరణించి మళ్ళీ బ్రతికినట్లు రాత్రి కల వచ్చింది. అది నిజమగునా?' అని యేమోమో చెప్తున్నాడు. ఘృశ్నకు ఆశ్చర్యము కలిగింది. ఇంట్లో పడుకొన్న బాలుడు నీటిలోకెలా వచ్చాడు? ఏమో! అదంతా శివ మహిమ అనుకొనుచు బాలుని యెత్తుకొని ఇంటికి వచ్చుచుండెను. అంతలో శివుడు ప్రత్యక్షమై 'సాధ్వీ! నీ అక్క అసూయతో వేకువజామున నీ బిడ్డను చంపి చెరువులో పారవేసి పోయినది. నీ భక్తి, పాతివ్రత్యములు బిడ్డను బ్రతికించినవి. పుత్ర ఘాతుకి యైన సుదేహను శిక్షించెను' అని పలుకుచుండ ఘృశ్న శివుని కాళ్ళపైబడి 'మహదేవ! కరుణామూర్తీ! పుత్రభిక్ష పెట్టి నన్ను కాపాడితివి. మా వంశమును నరకము నుండి తప్పించితివి. మా అక్క అమాయకురాలు. ఆమెయే కదా భర్తతో పోరి నన్ను వివాహ మాడునట్లు చేసింది. అసూయ అంత పాపము చేయించింది. ఆమెను క్షమించండి' అని ప్రార్థించింది.

పరమేశ్వరుడు ఘృశ్న సహనమునకు ఔదార్యమునకు మెచ్చుకొని 'అమ్మా! ఈనాటి నుండి నీ పేరు మీదుగా ఘృశ్నేశ్వరుడను పేరుతో నేనిచట వెలసెదను. నీవు నీ భర్తతో సుఖముగా జీవించి అంత్యమున నా లోకము చేరుదువు' అని పలికి మాయమయ్యెను. సుధర్ముడు, సుదేహ, గ్రామస్థులు అక్కడకు చేరి, అక్కడ నున్న జ్యోతిర్లింగమును చూసి ఘృశ్నను వేనోళ్ళ పొడిడారు. చేసిన మహాపరాధమును క్షమించమని ప్రార్థించింది. ఘృశ్న అక్కను కౌగలించుకొని ఓదార్చింది. దేవతలు పూల వాన కురిపించారు. సుధర్ముడు ఘృశ్నేశ్వరునకు ఆలయమును కట్టించి భార్యా బిడ్డలతో ప్రతిరోజూ శివుని ఆరాధిస్తూ అంత్యమున సుధర్ముడు, ఘృశ్న, సుదేహలు మోక్షమును పొందారు. ఘృశ్నేశ్వరుని దర్శించి ఆరాధించు వారికి అకాలమరణ ముండదు. సంతాన నష్టము నుండి విముక్తులగుదురు. పుత్రశోకము కలుగదు.

**చరిత్ర:** ఈ క్షేత్రము ఛత్రపతి శివాజీ పూర్వీకుల స్వగ్రామముగా చెప్పబడుచున్నది. మాలోజీభోంస్లే (శివాజీ తాత), అతని తమ్ముడు విఠోజీ ఈ క్షేత్రాభివృద్ధికి యెంతో కృషి చేశారు. తర్వాత 1765-1795 ప్రాంతంలో ఇండోర్ మహారాణి అహల్యాబాయి హోల్కార్ ఘృశ్నేశ్వర మందిరాన్ని పునర్నిర్మించి ఈ క్షేత్రాన్ని బాగా అభివృద్ధి చేసింది.



## దర్శనీయ స్థలాలు

**శ్రీ ఘృశ్నేశ్వరాలయం:** ఆలయ ప్రాంగణం చాలా విశాలమై చుట్టూ పెద్ద ప్రహరీతో వుంది. శ్రీ స్వామి వారి గర్భాలయము భూమిలోపలికి వుంటుంది. అమ్మవారు కూడా గర్భాలయములోనే వుంది. దేవాలయ గోడలపై మంచి శిల్పములున్నాయి.

**శివాలయం (కోనేరు):** దేవాలయ సమీపంలో వుంది. దీనిలోనే ఘృశ్న పార్థివ లింగాలను నిమజ్జనం చేసేది.

**ఎల్లోరా గుహలు:** ఘృశ్నేశ్వరాలయానికి $1^1/_2$ కి.మీ. దూరంలో వున్నాయి. 17 గుహలలో హిందూ ఆలయాలు, 12 గుహలలో బౌద్ధాలయాలు, 5 గుహలలో జైన ఆలయాలు వున్నాయి. ఈ 34 గుహలు క్రీ.శ. 600-1000 మధ్య నిర్మింపబడ్డాయి. గుహలలోని శిల్పకళ అత్యంత రమణీయంగా వుంటుంది. ఘృశ్నేశ్వరాలయం గల గ్రామాన్ని 'వెరుల్' అని పిలుస్తారు.

# లింగాష్టకమ్



బ్రహ్మ మురారి సురార్చిత లింగం నిర్మలభాసిత శోభిత లింగం
జన్మజదుఃఖ వినాశక లింగం తత్ప్రణమామి సదాశివ లింగమ్ 1

దేవముని ప్రవరార్చిత లింగం కామదహన కరుణాకర లింగం
రావణదర్ప వినాశన లింగం తత్ప్రణమామి సదాశివ లింగమ్ 2

సర్వ సుగంధ సులేపిత లింగం బుద్ధి వివర్ధన కారణ లింగం
సిద్ధి సురాసుర వందిత లింగం తత్ప్రణమామి సదాశివ లింగమ్ 3

కనక మహామణి భూషిత లింగం ఫణిపతి వేష్టిత శోభిత లింగం
దక్ష సుయజ్ఞ వినాశన లింగం తత్ప్రణమామి సదాశివ లింగమ్ 4


కుంకుమ చందన లేపిత లింగం పంకజ హార సుశోభిత లింగం
సంచిత పాప వినాశన లింగం తత్ప్రణమామి సదాశివ లింగమ్ 5

దేవగణార్చిత సేవిత లింగం భావైర్భక్తిభి రేవచ లింగం
దినకరకోటి ప్రభాకర లింగం తత్ప్రణమామి సదాశివ లింగమ్ 6

అష్టదళో పరివేష్టిత లింగం సర్వసముద్భవ కారణ లింగం
అష్టదరిద్ర వినాశన లింగం తత్ప్రణమామి సదాశివ లింగమ్ 7

సురగురు సురవర పూజిత లింగం సువన పుష్ప సదార్చిత లింగం
పరమపదం పరమాత్మక లింగం తత్ప్రణమామి సదాశివ లింగమ్ 8

లింగాష్టక మిదం పుణ్యం యః పఠేచ్ఛివ సన్నిధౌ
శివలోక మవాప్నోతి శివేన సహమోదతే 9





1. సోమనాథ్ - సోమనాథుడు
2. శ్రీశైలం - మల్లికార్జునుడు
3. ఉజ్జయిని - మహాకాళేశ్వరుడు
4. ఓంకార్ - ఓంకారేశ్వరుడు
5. వైద్యనాథ్ - వైద్యనాథుడు
6. భీమశంకర్ - భీమశంకరుడు
7. రామేశ్వర్ - రామేశ్వరుడు
8. నాగనాథ్ - నాగేశ్వరుడు
9. కాశీ - విశ్వేశ్వరుడు
10. నాసిక్ - త్ర్యంబకేశ్వరుడు
11. కేదారనాథ్ - కేదారేశ్వరుడు
12. ఘృష్ణేశ్వర్ - ఘృష్ణేశ్వరుడు

ఈ మ్యాప్ స్కేలునకు సరికాదు. కేవలం విషయ పరిజ్ఞానమునకు మాత్రమే.




# ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రములకు రైలు మార్గపు LAY-OUT


## 1. సోమనాథ్ : సోమనాథుడు - (సమీప విమానాశ్రయం : కేశోద్)




## 2. శ్రీశైలం: మల్లికార్జునుడు (రైలు మార్గాలు)- (సమీప విమానాశ్రయం : హైదరాబాద్)





## శ్రీశైలం: (బస్సు మార్గాలు)





సమీప రైల్వేస్టేషన్ = మార్కాపురం రోడ్ (అక్కడి నుండి బస్సులపై సుమారు 80 కి.మీ.లో శ్రీశైలం)
సమీప విమానాశ్రయం : హైదరాబాద్


**3. ఉజ్జయిని - మహాకాళేశ్వరుడు** - (సమీప విమానాశ్రయం : ఇండోర్)





**4. ఓంకార్ - ఓంకారేశ్వరుడు** - (సమీప విమానాశ్రయం : ఇండోర్)




**5. దేవఘర్ - వైద్యనాథుడు** - (సమీప విమానాశ్రయం : పాట్నా)





**6. భీమశంకర్ - భీమశంకరుడు** - (సమీప విమానాశ్రయం : పూనా)








**7. రామేశ్వరం : రామేశ్వరుడు** - (సమీప విమానాశ్రయం : మధురై)




**8. నాగనాథ్ : నాగేశ్వరుడు** - (సమీప విమానాశ్రయం : జామ్‌నగర్)




**9. వారణాసి (కాశీ) : విశ్వేశ్వరుడు** - (సమీప విమానాశ్రయం : బాపట్‌పూర్)





**Note** : లే-అవుట్‌లో ముఖ్య నగరాలు (ప్రయాణంలో తగిలే నగరాలు) మాత్రమే చూపించాము. వివరంగా కావాలంటే రైల్వే / రోడ్ మ్యాపును చూడండి.


## మృత్యుంజయ మహామంత్రము

ఓం త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనం ।
ఉర్వారుక మివబంధనా న్మృత్యో ర్ముక్షీయ మామృతాత్ ॥

**10. నాసిక్ : త్ర్యంబకేశ్వరుడు** - (సమీప విమానాశ్రయం : ఓఝూడ్)





**11. కేదారనాథ్ - కేదారేశ్వరుడు** - (సమీప విమానాశ్రయం : జాలిగ్రాంట్, డెహ్రాడూన్)




> **శివగాయత్రి**
> ఓం తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి ।
> తన్నో శ్శివః ప్రచోదయాత్ ॥



**12. వెరుల్ (ఘృష్ణేశ్వర్) : ఘృష్ణేశ్వరుడు** - (సమీప విమానాశ్రయం : ఔరంగాబాద్)




# దర్శించవలసిన ముఖ్య శైవక్షేత్రాలు

**ద్వాదశ జ్యోతిర్లింగములుగా పిలువబడుచున్న ఇతర లింగములు:**

1. **గోకర్ణేశ్వర:** కర్ణాటకలోని గోకర్ణ క్షేత్రం - ఉడిపికి 200 కి.మీ. స్వామి గోకర్ణేశ్వరుడు - అమ్మవారు తామ్రగౌరి.
2. **జోగేశ్వర్:** ఉత్తరప్రదేశ్‌లో ఖటేర్‌మల్‌కు 44 కి.మీ., ఆల్మోరాకు 90 కి.మీ. స్వామి నాగేశ్వరుడు - అమ్మవారు పుష్టీదేవి.
3. **జ్యోతిబా:** మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు 20 కి.మీ.
4. **వాసుకీనాథ్ లేక నాగనాథ్:** బీహార్‌లోని వైద్యనాథధామ్‌కు 75 కి.మీ.లో వున్న 'ధుంకా' క్షేత్రమున గల నాగేశ్వరలింగము.
5. **భీమేశ్వరుడు:** ఆంధ్రప్రదేశ్‌లోని ద్రాక్షారామమున గల భీమశంకరలింగము - అమ్మవారు మాణిక్యాంబ.
6. **భీమశంకర లింగము:** అస్సాంలోని గౌహతిలో బ్రహ్మ పర్వతంపై నున్నది.
7. **భీమశంకర లింగము:** ఉత్తరప్రదేశ్‌లోని నైనిటాల్ జిల్లాలో 'ఉజ్జనక్' అను గ్రామంలో వుంది. నైనిటాల్‌కు 20 కి.మీ. రెండంతస్థుల నుండి దర్శనము - ద్రోణుడు కురు, పాండవులకు విలువిద్య నేర్పిన ప్రదేశము. 108 శివ లింగములు గల పుణ్యక్షేత్రము.
8. **అమరనాథ్:** జమ్మూ-కాశ్మీర్ నుండి పహలీగామ్‌కు, చందన్‌వాడీకి శేషనాగ్‌కి, పంచతరణికి వెళ్ళి లిడ్డర్ లోయలో అమరగంగానదీ తీరాన గుహాలయంలో నున్న మంచు లింగము - అమ్మవారు అమరనాథేశ్వరి.

9. **పశుపతినాథ్:** నేపాల్‌లోని ఖాట్మండు నగరంలో వుంది. భాగామతీ నదీ తీరము - అమ్మవారు గుహ్యేశ్వరి.
10. **వైద్యనాథ్:** మహారాష్ట్రలోని నాందేడ్‌కు 20 కి.మీ.లో గల గంగాఖేడ్ అను చోట వుంది.
11. **వైద్యనాథ్:** పంజాబ్‌లోని కీర గ్రామంలో వుంది.
12. **చంద్రనాథ్:** బంగ్లాదేశ్‌లో చిట్టగాంగ్‌కు 60 కి.మీ.లో సీతాకుండ్ ప్రదేశ మందలి పర్వతముపై వుంది.
13. **కైలాసనాథ్:** ఎల్లోరాలోని 16వ నెంబర్ గుహలో నున్నది.
14. **వైద్యనాథ్:** హిమాచల్‌ప్రదేశ్‌లో నగరోటా నుండి 33కి.మీ. కాంగ్రా జిల్లాలోని పాలంపూర్‌కు 16 కి.మీ. ధర్మశాలకు 40 కి.మీ.
15. **బాలబ్రహ్మేశ్వరలింగం:** ఆంధ్రప్రదేశ్ - మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపూరంలో జోగులాంబ ఆలయంలో నున్నది.

మరికొన్ని ముఖ్యమైన శైవక్షేత్రముల గూర్చి తెలిసికొందము.

## మరికొన్ని శైవక్షేత్రములు

1. **కాళేశ్వరము:** కరీంనగర్ జిల్లా వేములవాడ నుండి, కరీంనగర్ నుండి బసులున్నాయి.

**పంచభూత లింగములు:**

1. **క్షితి (పృథ్వి) లింగము:** తమిళనాడులోని కాంచీపురమున నున్నది. స్వామి ఏకాంబరేశ్వరుడు - అమ్మవారు కామాక్షీదేవి.
2. **ఆకాశలింగము:** తమిళనాడులోని చిదంబరమున నున్నది. కడలూరుకు 40 కి.మీ. స్వామి నటరాజ రూపమున వున్నాడు - అమ్మవారు శివకామసుందరి.
3. **జలలింగము:** తమిళనాడులోని జంబుకేశ్వరమున నున్నది. తిరుచినాపల్లికి 10 కి.మీ. స్వామి జంబుకేశ్వరుడు - అమ్మవారు అఖిలాండేశ్వరి.
4. **తేజో (అగ్ని) లింగము:** తమిళనాడులోని తిరువణ్ణామలై (అరుణాచలం) నగరంలో వుంది. మద్రాసుకు 68 కి.మీ. విల్లుపురం-కాట్పాడి లైనులో - స్వామి అరుణాచలేశ్వరుడు - అమ్మవారు అరుణాచలేశ్వరి. అభిదకు జాంబాళ్ - ఉన్నామలై అమ్మ అను పేర్లతో పిలువబడుతోంది.
5. **వాయులింగం:** శ్రీకాళహస్తి - తిరుపతికి 40 కి.మీ. స్వామి శ్రీకాళహస్తీశ్వరుడు - అమ్మవారు జ్ఞానప్రసూనాంబ.

పురాణాలలో శివుని అష్టోత్తర శత దివ్య ఆలయముల గూర్చి వివరింపబడి వున్నాయి. అట్లే తమిళనాడులోని పెరియ పురాణము ఆధారంగా దేశంలో పవిత్ర శైవస్థలములుగా 274క్షేత్రములు చెప్పబడినవి. వివరములకు శ్రీ పోతిరెడ్డి సూర్యనారాయణ గారు స్వయంగా దర్శించి అనుభూతులతో వ్రాసిన "దివ్యజ్యోతి" గ్రంథము తప్పకుండా చదువగలరు.



# శివపంచాక్షరీ స్తోత్రమ్

ఓం నాగేంద్రహారాయ త్రిలోచనాయ భస్మాంగరాగాయ మహేశ్వరాయ
నిత్యాయ శుద్ధాయ దిగంబరాయ తస్మై **న** కారాయ నమశ్శివాయ ॥
మందాకినీ సలిల చందన చర్చితాయ నందీశ్వర ప్రమథనాథ మహేశ్వరాయ
మందారపుష్ప బహుపుష్ప సుపూజితాయ తస్మై **మ** కారాయ నమశ్శివాయ ॥
శివాయ గౌరీ వదనాబ్జ భృంగసూర్యాయ దక్షాధ్వర నాశకాయ
శ్రీ నీలకంఠరాయ వృషధ్వజాయ తస్మై **శి** కారాయ నమశ్శివాయ ॥
వశిష్ఠకుంభోద్భవ గౌతమార్య మునీంద్ర దేవార్చిత శేఖరాయ
చంద్రార్క వైశ్వానర లోచనాయ తస్మై **వ** కారాయ నమశ్శివాయ ॥
యక్షస్వరూపాయ జటాధరాయ పినాక హస్తాయ సనాతనాయ
దివ్యాయ దేవాయ దిగంబరాయ తస్మై **య** కారాయ నమశ్శివాయ ॥

పంచాక్షరమిదం పుణ్యం యః పఠేత్ శివసన్నిధౌ
శివలోక మవాప్నోతి శివేన సహ మోదతే.

# బిల్వాష్టకమ్

త్రిదళం త్రిగుణాకారం, త్రినేత్రంచ త్రియాయుధమ్
త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పితమ్ ॥ 1
త్రిశాఖైర్బిల్వపత్రైశ్చ అచ్ఛిద్రైః కోమలైశ్శుభైః
తవపూజాం కరిష్యామి ఏకబిల్వం శివార్పితమ్ ॥ 2
దర్శనం బిల్వవృక్షస్య స్పర్శనం పాపనాశనమ్
అఘోరపాపసంహారం ఏకబిల్వం శివార్పితమ్ ॥ 3
సాలగ్రామేషు విప్రేషు తటాకే వనకూపయోః
యజ్ఞకోటి సహస్రాణాం ఏకబిల్వం శివార్పితమ్ ॥ 4
దంతకోటిసహస్రేషు అశ్వమేధశతానిచ
కోటికన్యాప్రదానేన ఏకబిల్వం శివార్పితమ్ ॥ 5
ఏకం చ బిల్వపత్రైశ్చ కోటియజ్ఞ ఫలం లభేత్
మహాదేవైశ్చ పూజార్థం ఏకబిల్వం శివార్పితమ్ ॥ 6
కాశీక్షేత్రే నివాసంచ కాలభైరవ దర్శనమ్
గయాప్రయాగ మే దృష్ట్వా ఏకబిల్వం శివార్పితమ్॥ 7
ఉమయా సహ దేవేశం వాహనం నందిశంకరమ్
ముచ్యతే సర్వపాపేభ్యో ఏకబిల్వం శివార్పితమ్ ॥ 8

# విశ్వనాథాష్టకమ్

శ్లో॥ గంగా తరంగ రమణీయ జటాకలాపం గౌరీ నిరంతర విభూషిత వామభాగమ్।
నారాయణ ప్రియమనంగ మదాపహారం వారాణాసీపురపతిం భజ విశ్వనాథమ్॥ 1

శ్లో॥ వాచామగోచరమనేక గుణ స్వరూపం వాగీశవిష్ణు సురసేవిత పాదపీఠమ్ ।
వామేన విగ్రహవరేణ కళత్ర వంతం వారాణసీ పురపతిం భజ విశ్వనాథమ్॥ 2

శ్లో॥ భూతాధిపం భుజగ భూషణ భూషితాంగం, వ్యాఘ్రాజి నాంబరధరం జటిలం త్రినేత్రమ్।
పాశాంకుశాభయ వరప్రద శూలపాణిం వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్॥ 3

శ్లో॥ శీతాంశుశోభిత కిరీట విరాజమానం ఫాలేక్షణానల విశోషిత పంచబాణమ్ ।
నాగాధిపారచిత భాసుర కర్ణపూరం వారాణసీపురపితం భజ విశ్వనాథమ్॥ 4

శ్లో॥ పంచాననం దురిత మత్తమతంగజానాం నాగాంతకం దనుజ పుంగవ పన్నగానామ్।
దావానలం మరణ శోక జరాట వీనాం వారాణసీపురషితం భజ విశ్వనాథమ్॥ 5

శ్లో॥ తేజోమయం సుగుణ నిర్గుణ మద్వితీయ-మానందకందమపరాజితమ ప్రమేయమ్।
నాదాత్మకం సకల నిష్కళ మాత్మరూపం వారాణసీపురపితం భజ విశ్వనాథమ్॥ 6

శ్లో॥ ఆశాం విహాయ పరిహృత్య పరస్య నిందాం పాపేరతించ సునివార్య మనస్సమాధౌ।
ఆదాయ హృత్కమలమధ్యగతం పరేశం వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్॥ 7

శ్లో॥ రాగాదిదోషరహితం స్వజనానురాగ వైరాగ్య శాంతి నిలయం గిరిజా సహాయమ్।
మాధుర్య ధైర్యసుభగం గరళాభిరామం వారాణసీపురపతిం భజ విశ్వనాథమ్ ॥ 8

శ్లో॥ వారాణసీపురపతేః స్తవనం శివస్య వ్యాసోక్తమష్టకమిదం పఠతే మనుష్యః ।
విద్యాం శ్రియం విపుల సౌఖ్య మనంత కీర్తిం సంప్రాప్య దేహవిలయే లభతే చ మోక్షమ్॥

శ్లో॥ విశ్వనాథాష్టక మిదం యః పఠేచ్ఛివ సన్నిధౌ । శివలోక మవాప్నోతి శివేన సహ మోదతే॥ 10

"ఇతి శ్రీమత్ వేదవ్యాస విరచితం విశ్వనాథాష్టకమ్ సంపూర్ణమ్"



# గణపతి ద్వాదశనామ స్తోత్రము

ప్రణమ్య శిరసాదేవం గౌరీపుత్రం వినాయకమ్। భక్తావాసం స్మ రేన్నిత్య మాయుష్కా మార్థసిద్ధయే ॥1

ప్రథమం వక్రతుండం చ ఏకదంతం ద్వితీయకమ్। తృతీయం కృష్ణపింగాక్షం గజవక్త్రం చతుర్థకమ్॥2

లంబోదరం పంచమం చ షష్ఠం వికట మేవ చ। సప్తమం విఘ్నరాజం చ ధూమ్రవర్ణం తథాష్టకం॥3

నవమం బాలచంద్రంచ దశమంతు వినాయకం। ఏకాదశం గణపతించ ద్వాదశంతు గజాననం॥4

ద్వాదశై తాని నామాని త్రిసంధ్యం యః పఠేన్నరః। న చ విఘ్న భయం తస్య సర్వసిద్ధికరం పరం॥5

విద్యార్థీ లభతే విద్యా జ్ఞానార్థీ లభతే జ్ఞానం। పుత్రార్థీ లభతే పుత్రా న్మోక్షార్థీ లభతే గతిం॥6

జపే ద్గణపతి స్తోత్రం షడ్భిర్మాసైః ఫలం లభేత్ సంవత్సరేణ సిద్ధించ లభతే నాఽ త్ర సంశయః॥7

అష్టానాం బ్రాహ్మణానాంచ లిఖిత్వాయ స్సమర్పయేత్। తస్య విద్యా భవేత్సర్వా గణేశస్య ప్రసాదతః॥8



# ద్వాదశ జ్యోతిర్లింగ అష్టోత్తర శతనామావళి

ప్రతి నామమునకు ముందు 'ఓం' అని చివర 'నమః' అనియు పఠించవలెను

ఓం జ్యోతిర్లింగ స్వరూపాయ నమః
ఓం సౌరాష్ట్రేసు సంస్థితాయ నమః
ఓం శివాయ నమః
ఓం సోమనాథ నిలయాయ నమః
ఓం సోమారాధితాయ నమః
ఓం శంభవే నమః
ఓం శ్రీ హరాయ నమః
ఓం శ్రీశైలాధినాథాయ నమః
ఓం భ్రమరాంబాపతయే నమః
ఓం భవాయ నమః 10
ఓం త్రిలోకాధినాథాయ నమః
ఓం నిత్యాయ నమః
ఓం సర్వలక్షణ లక్షితాయ నమః
ఓం సోమసూర్యాగ్నిలోచనాయ నమః
ఓం దేవాసుర గణాశ్రయాయ నమః
ఓం సర్వబంధ విమోచనాయ నమః
ఓం జితకామాయ నమః
ఓం తేజస్కరాయ నమః
ఓం భక్తానుగ్రహకారకాయ నమః
ఓం వరదాయ నమః 20
ఓం మల్లికార్జునాయ నమః
ఓం ఉజ్జయినీపుర పతయే నమః
ఓం మహాకాలాయ నమః
ఓం మహేశ్వరాయ నమః
ఓం విశ్వరూపాయ నమః
ఓం విరూపాక్షాయ నమః
ఓం దేవాసుర వరప్రదాయ నమః
ఓం వృషభారూఢాయ నమః
ఓం త్రినేత్రాయ నమః
ఓం త్రిపురాంతకాయ నమః 30
ఓం సర్వజ్ఞాయ నమః
ఓం మహాకాళీనాథాయ నమః
ఓం అవంతీపురాధిపతయే నమః
ఓం దూషణాసురమర్ధనాయ నమః
ఓం మోక్షప్రదాయ నమః
ఓం వేదప్రియాయ నమః
ఓం ఓంకారపుర వాసాయ నమః
ఓం వింధ్యాద్రి బలగర్వాపహాయ నమః
ఓం మాంధాతృపుర నివాసాయ నమః 40
ఓం అన్నపూర్ణాపతయే నమః
ఓం ఈశ్వరాయ నమః
ఓం బదరికాశ్రమ నివాసాయ నమః
ఓం దేవాసుర సంసేవితాయ నమః
ఓం గౌరీనాథాయ నమః
ఓం కేదారేశ్వరాయ నమః
ఓం అక్షయ భాగ్యప్రదాయ నమః
ఓం సర్వశుభంకరాయ నమః
ఓం అవ్యయాయ నమః
ఓం అనంతరూపాయ నమః 50
ఓం వ్యోమకేశాయ నమః
ఓం వారణాసీపురపతయే నమః
ఓం విశ్వనాథాయ నమః
ఓం సర్వాశ్రయాయ నమః
ఓం సర్వదేవ మునివందితాయ నమః
ఓం యజ్ఞసుసమాహితాయ నమః
ఓం మణికర్ణికాతీర్థ నిలయాయ నమః
ఓం మరణాన్ముక్తిదాయ నమః
ఓం గౌతమారాధితాయ నమః
ఓం శివాయ నమః
ఓం గౌతమీ జన్మకారుణాయ నమః 60
ఓం బ్రహ్మహత్యా పాపహరాయ నమః
ఓం త్ర్యంబకాయ నమః

ఓం సుతీర్థాయ నమః
ఓం శర్వాయ నమః
ఓం దేవాసుర వరప్రదాయ నమః
ఓం యజ్ఞరూపాయ నమః
ఓం మృత్యుం జయాయ నమః
ఓం చితాభూమి స్థితావాసాయ నమః
ఓం వైద్యనాథ ప్రకీర్తితాయ నమః 70
ఓం సర్వబాధ నివాకరాయ నమః
ఓం సర్వభూత హరాయ నమః
ఓం రుద్రాయ నమః
ఓం సర్వకామదాయ నమః
ఓం శాశ్వతాయ నమః
ఓం ద్వారకాది రాక్షసాంతకాయ నమః
ఓం భక్తజన రక్షకాయ నమః 80
ఓం ఢాకినీ వాసాయ నమః
ఓం శంకరాయ నమః
ఓం భీమాసుర విమర్థనాయ నమః
ఓం మాణిక్యాంబా ప్రియనాథాయ నమః
ఓం దక్షారామ నివాసినే నమః
ఓం అమృతాయ నమః
ఓం సర్వపూజితాయ నమః
ఓం చంద్రశేఖరాయ నమః
ఓం సుముఖాయ నమః
ఓం అవ్యక్తాయ నమః
ఓం త్రిపురాంతకాయ నమః
ఓం గిరిజా ప్రియాయ నమః
ఓం విముక్తాయ నమః
ఓం శితి ఖంఠాయ నమః
ఓం శూలపాణినే నమః
ఓం మహా క్రోధాయ నమః
ఓం మహేశ్వరాయ నమః
ఓం దేవాసురమునివందితాయ నమః
ఓం శ్రీరామ ప్రతిష్ఠితాయ నమః
ఓం ధనుష్కోటి ప్రాంత -
వాసాయ నమః 100
ఓం సీతారామ సంసేవితాయ నమః
ఓం హనుమత్సేవితాయ నమః
ఓం సాంబాయ నమః
ఓం సర్వపాప నివారకాయ నమః
ఓం దేవగిరి దుర్గవాసాయ నమః
ఓం ఘృశ్నలారాధితాయ నమః
ఓం సాంబాయ నమః
ఓం అపమృత్యునివారకాయ నమః 108
ఓం జ్యోతిర్లింగాధ్యక్షాయ నమః

॥ ఇతి శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ అష్టోత్తర శతనామావళిః సమాప్తః ॥

# శ్రీ భ్రమరాంబాష్టకమ్

శ్లో॥ శ్రీకంఠార్పిత పత్రగండ యుగళాం సింహాసనాధ్యాసినీం
లోకానుగ్రహ కారిణీం గుణవతీం లోలేక్షణాం శాంకరీమ్ ।
పాకారి ప్రముఖామరార్చిత పదాం మత్తేభకుంభస్తనీం
శ్రీశైల భ్రమరాంబికాం భజమనః శ్రీ శారదా సేవితామ్ ॥ 1

శ్లో॥ వింధ్యాద్రీంద్ర గృహాన్తరే నివసితాం వేదాన్త వేద్యాం నిధిం
మందార ద్రుమ పుష్పవాసిత కుచాం మాయాం మహామాయినీమ్ ।
బంధూక ప్రసవోజ్జ్వలారుణ నిభాం పంచాక్షరీ రూపిణీం
శ్రీశైల భ్రమరాంబికా భజమనః శ్రీ శారదా సేవితామ్ ॥ 2



శ్లో॥ మాద్యచ్ఛుంభనిశుంభ మేఘపటల ప్రధ్వంస ఝంఝానిలాం
కౌమారీం మహిషాఖ్య శుష్కవిటపీ ధూమోరు దావానలామ్ ।
చక్రాద్యాయుధ సంగ్రహోజ్జ్వల కరాం చాముండికాధీశ్వరీం
శ్రీశైల భ్రమరాంబికాం భజమనః శ్రీ శారదా సేవితామ్ ॥ 3

శ్లో॥ దృక్కం జాతవిలాస కల్పిత సరోజాతోరు శోభాన్వితాం
నక్షత్రేశ్వర శేఖర ప్రియతమాం దేవీం జగన్మోహినీమ్ ।
రంజన్మంగళ దాయినీం శుభకరీం రాజత్స్వరూపోజ్జ్వలాం
శ్రీశైల భ్రమరాంబికాం భజమనః శ్రీ శారదా సేవితామ్ ॥ 4

శ్లో॥ కేళీ మందిర రాజతాచల తలాం సంపూర్ణ చంద్రాననాం
యోగీంద్రైర్నుత పాదపంకజ యుగాం రత్నాంబరాలంకృతామ్ ।
స్వర్గావాస సరోజ పత్రనయనాభీష్ట ప్రదాం నిర్మలాం
శ్రీశైల భ్రమరాంబికాం భజమనః శ్రీ శారదా సేవితామ్ ॥ 5

శ్లో॥ సంసారార్ణవ తారకాం భగవతీం దారిద్ర్య విధ్వంసినీం
సంధ్యా తాండవ కేళికాం ప్రియసతీం సద్భక్త కామప్రదామ్ ।
శింజన్నూపుర పాదపంకజయుగాం బింబాధరాం శ్యామలాం
శ్రీశైల భ్రమరాంబికాం భజమనః శ్రీ శారదా సేవితామ్ ॥ 6

శ్లో॥ చంచత్కాంచన రత్నచారు కటకాం సర్వంసహా వల్లభాం
కాంజీ కాంచన ఘంటికా ఘణఘణాం కంజాత పత్రేక్షణామ్ ।
ఆర్తత్రాణ పరాయణాం పురహర ప్రాణేశ్వరీం శాంభవీం
శ్రీశైల భ్రమరాంబికాం భజమనః శ్రీ శారదా సేవితామ్ ॥ 7

శ్లో॥ స్వర్లోకేశ్వర వంద్యపాదకమలాం పంకేరుహాక్ష స్తుతాం
ప్రాలేయాచల వంశ పావనకరీం శృంగార భూషానిధిమ్ ।
తత్వాతీత మహాప్రభాం విజయినీం దాక్షాయిణీం భైరవీం
శ్రీశైల భ్రమరాంబికాం భజమనః శ్రీ శారదా సేవితామ్ ॥ 8

శ్లో॥ భ్రమరాంబ మహాదేవ్యా అష్టకం సర్వసిద్ధిదమ్
శత్రూణాం తు నరాణాం చ ధ్వంసనం తద్వదామ్యహమ్ ॥

॥ ఇతి శ్రీ దూర్వాసముని విరచితం శ్రీ భ్రమరాంబాష్టకమ్ ॥

# శివప్రాతః స్మరణ

విశ్వేశ్వర విరూపాక్ష విశ్వరూప సదాశివ, శరణం భవ భూతేశ కరుణాకర శంకర।
హర శంభో మహాదేవ విశ్వేశామరవల్లభ, శివ శంకర సర్వాత్మన్ నీలకంఠ నమోస్తుతే॥

మృత్యుంజయాయ రుద్రాయ నీలకంఠాయ శంభవే, అమృతేశాయ శర్వాయ శ్రీమహాదేవ తేనమః
ఏతాని శివనామాని యఃపఠేన్నియతః స్మృత్, నాస్తిమృత్యు భయం తస్య పాప రోగాది కిఞ

# అష్టాదశ శక్తి పీఠములు - స్థల పురాణములు



**1. లంకాయాం శాంకరీదేవీ - స్థలపురాణము :-** రావణుని భక్తికి సంతోషించి వాని కోరిక ప్రకారం లంకలో వెలసి 'శాంకరీదేవి' రావణుడు సీతాదేవిని చెరబట్టి తీసుకు రావడంచే ఆ అధర్మానికి లంకను విడిచిందని అంటారు. ఆ లంక యీ నాటి శ్రీలంక అనుకుంటే అక్కడ 'శాంకరి' ఆలయం లేదు. మరెక్కడా లంకలో 'శాంకరి' కనిపించదు. ఒకప్పుడీ ఆలయం వుండి తరువాత కాల గర్భంలో నిలీనమై మన దృష్టికి అంది వుండక పోవచ్చును. కనుక అమ్మవారి దర్శనము దుర్లభము.



**2. కామాక్షీకాంచికాపురే - స్థలపురాణము :-** కాంచీనగరం తమిళనాడులో వుంది. మోక్షాన్ని యిచ్చే అయోధ్య, మధురా, మాయా, కాశీ, కాంచీ, అవంతి, ద్వారవతీ అనే సప్తమోక్ష పురములలో ఒకటి. సతీదేవి కంకాళము పడినచోటు అని అంటారు. ఇచటి రావి చెట్టును, మామిడిచెట్టును పూజిస్తారు. మామిడిచెట్టు ఆకులు, పండ్లు వేరు వేరు ఆకారములతో రుచులతో నుండును. ఇచటి స్వామి ఏకామ్రనాధుడు. చెన్నైకు 70 కి.మీ దూరము.



**3. శ్రీప్రద్యుమ్నే శృంఖలాదేవీ - స్థలపురాణము :-** పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో, కలకత్తాకు 80 కి.మీ దూరంలో పాండవప్రాంతము కలదు. మహమ్మదీయుల పాలనలో హిందూ దేవాలయములు నేలమట్టము కావించబడి "అదీన" అనే పెద్ద మసీదు మాత్రము కన్పించుచున్నది. ప్రద్యుమ్న దేశముగా భావించబడుచున్న ఈ ప్రాంతములో శృంఖలాదేవి ఆలయము కనిపించుటలేదు. కలకత్తాకు 135 కి.మీ దూరములో గంగాదేవి వెలసిన గంగాసాగర్ క్షేత్రమును అష్టాదశ శక్తిపీఠములలో ఒకటిగా భావించబడుచున్నది. ఈ క్షేత్రమును అధినాధ క్షేత్రము అని పిలుస్తున్నారు. పవిత్రగంగానది, బంగాళా ఖాతము కలియుచోటు.



**4. చాముండాక్రౌంచపట్టణే - స్థలపురాణము :-** కర్ణాటక రాష్ట్రములో నున్నది. మహిషాసురుని యిక్కడే అమ్మవారు సంహరించినట్లు చెబుతారు.



**5. అలంపురే జోగులాంబా - స్థలపురాణము :-** ఆంధ్రదేశములో వుంది. కృష్ణా తుంగ భద్రానదుల సంగమస్థానం. స్వామిపేరు బాల బ్రహ్మేశ్వరుడు. ఎన్ని నీళ్ళతో అభిషేకించినా చుక్క నీరు కూడా బయటికి రాదు. రససిద్ధుడొకడు నిర్మించిన వినాయకుని విగ్రహ మున్నది. మూలికలు పసరులతో తయారుచేయుటచే విగ్రహము గరుకుగా వుంటుంది. సప్తమాతృకలున్నారు. సంగమేశ్వరస్వామి ప్రధానదేవులు. నవబ్రహ్మలకూ, ఎల్లమ్మకూ, భూదేవికీ ఆలయాలున్నాయి. పరశు రామక్షేత్రం అని కూడా అంటారు. జమదగ్ని ఆశ్రమం అక్కడ వుండేదని చెబుతారు. రేణుకాదేవి నదీ స్నానానికి వెళ్ళి స్నానం చేసి యిసుకతో కుండను చేసి ప్రతిదినం



నదినుంచి నీరు తెచ్చేది. ఒకనాడు ఒక రాజ కుటుంబం నదీ స్నానం చేస్తూ వుంటే, వారి వైభవాన్ని చూస్తూ తదేకధ్యానంలో వుండి, ఆలస్యంగా యింటికి వచ్చింది. ధ్యానం కుదరక యిసుకతో కుండని చేయలేక పోయింది. ఆలస్యంగా వచ్చినందుకు కోపించిన జమదగ్ని ఆమె తలను నరుకమని కొడుకులని ఆజ్ఞాపించాడు. వారాపనిని చేయలేక పోవడంతో కోపించిన ముని వారి తలలనీ నరకమని చివరి కొడుకైన పరశురాముని ఆజ్ఞాపించాడు. పరశురాముడు వెంటనే తండ్రి మాటను పాటించినాడు. జమదగ్ని సంతృప్తుడై కావలసిన వరం కోరుకోమంటే తల్లినీ సోదరులనీ బ్రతికించమని కోరాడు. అందరూ బ్రతికారు. రేణుకాదేవి తల మాత్రం తెగినా ప్రాణంతో వుండడంచేతను మరొక కులంవారు ఆమెని దేవతగా భావించి పూజాధికం చేసి తాకడం వలన అన్యస్పర్శాదోషం వలన ఆమె తల మొండేనికి అతకలేదు. అందుకని తలమాత్రం ఎల్లమ్మ (ఎల్లరికి అమ్మ)గా గ్రామదేవతగా అర్చింపబడినది. మిగిలిన భాగం భూదేవిగా అర్చింపబడుతోందని పెద్దలు అంటారు. కర్నూలుకి 40 కి.మీ దూరంలో వున్నది.



**6. శ్రీశైలే భ్రమరాంబికా - స్థలపురాణము :-** శ్రీశైలము మన రాష్ట్రం లోనిదే. అమ్మవారి మెడపడినచోటు. ఇక్కడి అమ్మవారి పేరు భ్రమరాంబా దేవి. అయ్యవారి పేరు మల్లికార్జునస్వామి. హిరణ్యకశిపుడు, శ్రీరాముడు పాండవులు యిక్కడి అమ్మనీ అయ్యనీ సేవించినారట. పాండవులు ప్రతిష్ఠించిన లింగములు కూడా యిచ్చట వున్నవి. భ్రమరాంబా ఆలయానికి యెడమవైపున పార్వతీదేవి ఆలయం వున్నది. స్వామివారికి శివరాత్రికి భ్రమరాంబదేవితోను, సంక్రాంతికి పార్వతీదేవితోను సంవత్సరానికి రెండు మార్లు స్వామివారికి రెండు కల్యాణములు ప్రతియేటా జరుగును. మల్లెపొదలో వుండడంవలన మల్లికాపుష్పములచే అర్చింపబడడం వలన స్వామి మల్లికార్జునుడని, భ్రమరరూపంలో మల్లికార్జును స్వామిపై వాలడం వలన, అరుణుడనే దానవుని చంపడం వలన అమ్మ భ్రమరాంబాదేవి అయింది. మాధవి, సర్వమంగళ అని కూడా అమ్మవారిని తలుస్తారు. ద్వాదశజ్యోతిర్లింగాలలో మల్లికార్జునస్వామి ఒకరు. అష్టాదశ శక్తిపీఠాలలో భ్రమరాంబాదేవి ఒకటి. ఛత్రపతి శివాజీ ప్రార్థించిన దేవాలయము. శ్రీకృష్ణదేవరాయులు, శివాజీలు అమ్మవారికి చాలా రకములైన ఆభరణములను సమర్పించినారు. విజయవాడ నుండి మార్కాపురం మీదుగా శ్రీశైలం చేరాలి. ప్రముఖ నగరాలన్నిటినుండి బస్సులు వున్నాయి. సమీప రైల్వేస్టేషన్ మార్కాపురంరోడ్.



**7. కొల్హాపురే మహాలక్ష్మి - స్థలపురాణము :-** కొల్హాపురం మహారాష్ట్రలో వుంది. ఇక్కడి అమ్మవారిని మహాలక్ష్మి అని అంటారు. భవాని కరవీరవాసిని, అమలాదేవి అని కూడా అంటారు. విలువైన ఆభరణాలు కలిగి పసుపువర్ణంలో అమ్మవారు వుంటారు. ఆసనం వెండిది. కొద్ది దూరంలో వున్న అయ్యవారిని జ్యోతిబా అని అంటారు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు లింగరూపంలో వెలసినట్లు చెపుతారు. షోలాపూర్ నుండి బస్సు మరియు రైలు మార్గాలు వున్నవి. పూనా నుండి గోవాకు వెళ్ళు మార్గములో వున్నది.



**8. మాహూర్యే ఏకవీర్యకా - స్థలపురాణము :-** మహారాష్ట్రలోని మహోర్ గ్రామంలో వుంది. ఏకవీర్యకా, రేణుకామాత అని అంటారు. తలమాత్రమే వుంది. గంగ సిందూరంతో యెఱ్ఱగా భీకరంగా అమ్మవారు వుంటారు. క్షుద్రవిద్యల సిద్ధికి ఆటపట్టు. ఇచట వున్న మూడు పర్వత శిఖరములపై అమ్మవారు, దత్తాత్రేయస్వామి, అనసూయ అత్రిమహర్షుల ఆలయములున్నాయి. శ్రీక్షేత్రమని కూడా అంటారు. అమ్మవారిని జమదగ్ని మహర్షి భార్యగా పరశురాముని తల్లిగా రేణుకామాతగా సేవిస్తారు. సతీదేవి కుడి స్తనం యిక్కడ పడిందని అంటారు. నాందేడ్ నుండి 128 కి.మీ దూరము.



**9. ఉజ్జయిన్యాం మహాకాళీ - స్థలపురాణము :-** మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ నగరం. దీనిని అవంతికా నగరం అనీ అంటారు. ఇక్కడినది పేరు సిప్రా. సిప్రా నదీతీరంలో అమ్మవారి ఆలయం వుంది. అమ్మవారి మోచేయి యిక్కడ పడిందని అంటారు. మోక్షప్రదాలైన యేడు నగరాలలో యిది ఒకటి. స్వామిపేరు మహాకాళేశ్వరస్వామి ఆయన లింగమూర్తికి కన్నులున్నాయి. ఇత్తడితో చేసిన సర్వాలంకారము కలదు. స్వామివారిని తాకినచో భయము కలుగును. ద్వాదశజ్యోతిర్లింగములలో నొకటి. ఈ క్షేత్రమును భూమికి నాభిగా చెబుతారు. ఇచటి శ్రీచక్రము దేవీ పీఠమున న్నుది. ఇండోర్ నుండి 55కి.మీ దూరము.



**10. పీఠాయాం పురుహూతికా - స్థలపురాణము :-** పిఠాపురం ఆంధ్ర దేశంలో వుంది. అమ్మవారి పేరు పురుహూతికాదేవి. ఇక్కడ దేవీ విగ్రహం కనిపించదు. భయంకరమైన రూపం గల విగ్రహాన్ని భూస్థాపితం చేసినట్లు పెద్దలు చెపుతారు. ఇచటి మూడు ఆలయాలలో అమ్మవారున్నారని చెపుతారు. కుక్కుటేశ్వరస్వామివారి గర్భాలయంలో గోడమీద సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయములోని చిన్న గుడిలో చిన్న సందులోని సిమెంటు విగ్రహం నాప రాయి బొమ్మ మనకి కనిపిస్తాయి. దీనిని పాదగయ అని కూడా అంటారు. కుక్కుటేశ్వర స్వామికి ఎదురుగా ఒక చిన్న ఆలయంలో పురుహూతికా శక్తిపీఠం నెలకొని వున్నది. విజయవాడ-విశాఖపట్టణం రైల్వేలైనులో వున్నది. రాజమండ్రికి 60 కి.మీ. కాకినాడకు 18 కి.మీ దూరము.



**11. ఓడ్యాణే గిరిజాదేవీ - స్థలపురాణము :-** ఒరిస్సాలోని జాజ్‌పూర్ రైల్వేస్టేషన్‌కి 20 కి.మీ దూరంలో వుంది. కటక్‌నుండి సరాసరి బస్సు కలదు. ఆ వూరిని వైతరణి అని అంటారు. అక్కడి నది వైతరిణి, అమ్మవారిని భిరిజాదేవి అనీ పిలుస్తారు. మహాలక్ష్మి మహాసరస్వతి, మహాపార్వతీ దేవుల అంశలున్నాయని అంటారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు యిక్కడ విధాయకం ప్రశస్తం. సమీపంలో శ్వేతవరాహమూర్తి ఆలయం వుంది. అమ్మవారి నాభి యిక్కడ పడిందని అంటారు. అఖండలేశ్వర్, లింగేశ్వర్, త్రిలోచనేశ్వర్. జగన్నాధ్, కాళికామాతల ఆలయములున్నవి.





**12. మాణిక్యా దక్షవాటికే - స్థలపురాణము :-** ఆంధ్రదేశంలోని దాక్షారామంలో ఆలయం వుంది. సతీదేవీ 'కణితి' యిక్కడ పడిందని అంటారు. అమ్మవారి పేరు మాణిక్యాంబాదేవి. స్వామివారి పేరు భీమేశ్వర స్వామి. దక్షారామం పంచారామాలలో ఒకటి. సప్తగోదావరమని యిక్కడి కోనేరును పిలుస్తారు. ఆలయం ప్రక్కగా ప్రవహించడం వలన యిక్కడి స్నానం అత్యంత శుభప్రదమనీ, పవిత్రతాకరం అని అంటారు. ఇక్కడి అమ్మవారిని వేశ్యలు కులదైవంగా భావించేవారు. కాకినాడకు 32 కి.మీ రాజమండ్రికి 60 కి.మీ దూరము.



**13. హరిక్షేత్ర కామరూపా - స్థలపురాణము :-** అస్సాంరాష్ట్రంలోని గౌహతికి 18 కి.మీ దూరంలో నీలాంచల పర్వతంపై ఆలయం వుంది. అమ్మవారి పేరు కామాఖ్య. సతీదేవి యోని యిక్కడ పడిందని చెపుతారు. కామదేవుల ఆలయాలున్నాయి. మన్మధుడిని శివుడు నేత్రాగ్నిచే దహించినచోటు యిదే అని చెపుతారు. అమ్మవారు 'బహిష్ఠ' అవడం వుంది. దానిని అంబుబాషి అని అంటారు. అది జరిగిన నాలుగురోజులూ ఆలయం మూసివేస్తారు. ఆ సమయంలో అమ్మవారికి ఎఱ్ఱనిపూలు, ఎఱ్ఱని పసుపు, ఎఱ్ఱని వస్త్రం అలంకరిస్తారు. ఈ ఉత్సవం తరువాతనే పంటలు వేస్తారు. ఆలయం తెరిచే అంబుబాషి ఉత్సవం అయిదవ రోజున అమ్మవారి మూర్తిక్రిందనుంచి యెఱ్ఱని నీరు స్రవిస్తుంది. నరకాసురుడు పరిపాలించిన ప్రాక్‌జ్యోతిష పురం యిదేనని అంటారు. కాళికామాతగా అర్చిస్తారు. మేకలని పావురాలని బలి యిస్తారు. ఇదే కొండపై కాళీతార భువనేశ్వరి భైరవి ఛిన్నమస్త భగళ ధూమవతి అనే యేడుగురి అమ్మవార్ల ఆలయాలూ, కామేశ్వర, సిద్ధేశ్వర, కోటిలింగ, అఘోర, అమృత కేశవస్వాముల ఆలయా లున్నాయి అంబుబాషి ఉత్సవ దినాలలో అన్ని ఆలయాలను మూసివేస్తారు. అమ్మవారి యోని రాతిపై ముద్రింపబడింది. దీనినే పూజిస్తారు. ఇది యెప్పుడూ తడిగా వుంటుంది. నీరు వూరుతూ వుంటుంది.



**14. ప్రయాగే మాధవేశ్వరీ - స్థలపురాణము :-** ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాదులో ప్రయాగ క్షేత్రం వున్నది. అమ్మవారిని మాయాదేవి అనీ మాధవేశ్వరి అనీ అలోపిదేవీ అని అంటారు. ఇక్కడి అమ్మవారు శ్రీచక్రస్వరూపిణిగా అర్చింపబడుతున్నది. ఈ క్షేత్రం గంగా యమున సరస్వతీనదుల సంగమ స్థానం. సతీదేవి హస్తాంగుళి పడినచోటని అంటారు.



**15. ప్రయాగే మాధవేశ్వరీ - స్థలపురాణము :-** జమ్మూ కాశ్మీర్‌లో కాత్రాకు 14 కి.మీ దూరము. బాణ గంగనించి యెల్లప్పుడూ వెళ్ళవచ్చును అమ్మవారిని వైష్ణవీదేవి అనీ త్రికూట భగవతీ అని అంటారు. మహాకాళీ మహాలక్ష్మి మహాసరస్వతీ దేవతలు పిండ రూపంలో వున్నారు. సాక్షి భైరవస్వామి ఆలయం వుంది. అమ్మవారు వెలసిన గుహాలయాన్ని త్రికూట పర్వతమనీ, భవన్ అనీ అంటారు. అడిగిన కోరికలనిచ్చేదిగా చాలా ప్రసిద్ధి వుంది. యిక్కడ నల్లని నీటి ఊట చాలా ప్రసిద్ధమూ పవిత్రమూ అయినది. జమ్ము నుండి


కాట్రా 46 కి.మీ దూరము. కాట్రా నుండి బాణగంగ 2 కి.మీ. బాణగంగ నుండి 12 కి.మీ. కాలినడకన లేదా గుర్రములపై రాత్రింబవళ్ళు వెళ్ళవచ్చును. 3 గంటలు ప్రయాణము. దారిలో సమస్త సౌకర్యముల ఏర్పాట్లు ఉన్నవి.



**16. శ్రీగయామాంగళ్య గౌరికా - స్థలపురాణము :-** బీహారులోని గయకు సమీపంలో వుంది. అమ్మవారిని మంగళగౌరీ, సర్వమంగళా అనీ అంటారు. పితృదేవతల శ్రాద్ధ విధులకీ పిండప్రదానాలకీ యిది చాలా ప్రశస్తం. విష్ణువు 'గజ' రాక్షసుని సంహరించిన చోటు విష్ణుపాదాలయం వుంది. భాగేశ్వర దేవికి గదాధర్ భగవానునికీ శ్రీకృష్ణుడికి, సూర్యనారాయణ స్వామికి ఆలయములున్నవి. యముని పుత్రిక అయిన ధర్మవ్రత భర్త శాపం వలన శిల అయింది. తనను అనుగ్రహించి ఊరడింప వచ్చిన విష్ణువును నేను శిలగానే వుంటాను. నాపై నీ పాదాలుంచమని కోరింది. విష్ణువు అంగీకరించినాడు. గయాసురుని సంహరించేటప్పుడు ఆ రాక్షసుడు కదలకుండా వుండడానికి శిల అయిన ధర్మవ్రతను ఉంచి విష్ణువు దానిపై కదలకుండా నిలిచినాడు. గయుడు నేనీరాయి బరువుకి క్రిందకు క్రుంగిపోతాను. ఈ రాతిమీద నిలిచిన నీ పాదాలను చూచినవారికి సద్గతిని కలిగించు. నా పేరునీ, యీ నీ పాద చిహ్నాలు గల యీ క్షేత్రాన్నీ స్మరించి పిండప్రదానం చేస్తే వారికి వంశవృద్ధినీ, సద్గతినీ యిమ్మని కోరి వరం పొందినాడు. అందువలన గయ పిండప్రదాన ప్రధాన క్షేత్రం అయింది. ఇక్కడ కూడా కాశీలోవలె కూరలు పండ్లువిడవడం ఆచారం. ఔరంగాబాద్ నుండి బస్సు, ధన్‌బాద్‌నుండి రైలు పైనను చేరవచ్చును. పాట్నాకు 73 కి.మీ దూరము.



**17. వారాణస్యాం - విశాలాక్షీ స్థలపురాణము :-** కాశీ, బనారస్, వారణాసి ఉత్తర ప్రదేశంలో వుంది. చాలా ప్రసిద్ధమైన పవిత్రమైన ప్రాచీన క్షేత్రం. గంగాతీరంలో వుంది. స్వామివారి పేరు విశ్వనాధుడు సప్త మోక్షప్రద పురాలలో ఒకటి. విశాలాక్షీదేవి ఆలయానికి దగ్గరలోనే అన్నపూర్ణాదేవి ఆలయం వుంది. కాలభైరవుడు వాహనమైన కుక్కనెక్కి కాశీకి గస్తీ తిరుగుతూ వుంటాడని చెబుతారు. శివుని త్రిశూలముపై యీ నగరం వున్నదని అంటారు. ఇచట మరణించినవారికి ముక్తి వస్తుందని చెపుతారు. మనకిష్టమైన పండ్లు, కూరలు విడవడం యిక్కడి విశిష్టాచారము.



**18. కాశ్మీరేషు సరస్వతీ స్థలపురాణము :-** ఇక్కడ సరస్వతీ ఆలయం కనిపించదు. పూజలు సరిగా జరగడం లేదని శ్రీశంకరాచార్యులవారు సువర్ణమూర్తియైన ఆమెను శృంగేరిలో ప్రతిష్ఠించారని అంటారు. శృంగేరి కర్నాటకలో వుంది. శారదాపీఠం వున్న ఆలయం చాలా పెద్దది. దగ్గరలో శాంతాదేవీ ఋష్యశృంగమహర్షి-వీరి ఆలయాలున్నాయి. శ్రీనగర్‌లో నున్న శ్రీశంకరాచార్య ఆలయమును సరస్వతీదేవి ఆలయంగా భావిస్తున్నారు. కాని యిక్కడ దేవీ విగ్రహము లేదు.